మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

| రాజన్న సిరిసిల్ల | గురువారం | 24.09.2026 | సంపుటి : 01 | సంచిక : 265 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | THURSDAY | 24.09.2026 | Volume : 01 | Issue : 265 | Pages : 12 | Cost : 2/- |




## ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 23 :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 నాటి చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పు వెలువడింది. ఈ కేసును విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా? అనే అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్.సి. శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఏకాభిప్రాయానికి

మిగతా2లో...

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ సమ్మిట్ కీలకం

### - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** తెలంగాణలో భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లను ప్రభుత్వం ముమ్మరం చేసింది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న సమ్మిట్ ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించింది.తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా భారీ పెట్టుబడులను ఆకర్షించాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా దేశ, విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహించడంతో పాటు పెట్టుబడులకు అవకాశాలు ఉన్న దేశాలు, నగరాలు, రంగాలపై ప్రత్యేక అధ్యయనం చేయాలని నిర్ణయించారు.సమ్మిట్ ఏర్పాట్ల పర్యవేక్షణ

మిగతా2లో...



## రైతుల పోరాటం ఫలించింది..

### - జూరాల కాలువలకు నీటి విడుదల
### కుడి, ఎడమ కాలువలకు సాగునీరు.. కర్ణాటక నుంచి 7 టీఎంసీల నీటికి హామీ

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సాగునీటి కోసం జూరాల ఆయకట్టు రైతులు చేపట్టిన ఆందోళన

మిగతా2లో...

## ప్రజల ముంగిటకే 'మీ సేవ'లు: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగంగా అందించేందుకు లిలి'మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్'లిలిను ప్రారంభించింది. ఆర్టీసీ కళ్యాణ మండపంలో మంత్రి శ్రీధర్‌బాబు ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 108 ప్రభుత్వ మీ సేవ కేంద్రాలతో పాటు 5,400కు పైగా ప్రైవేట్ మీ సేవ కేంద్రాలు సేవలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో మీ సేవ కేంద్రాల సంఖ్యను మరింత పెంచుతామని చెప్పారు.ఇకపై ప్రజలు మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడం లేదా మీ సేవ పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా ఇంటి వద్ద నుంచే సేవలు పొందవచ్చని తెలిపారు. మీ సేవ ఎగ్జిక్యూటివ్‌లు నేరుగా ఇంటికి వచ్చి అవసరమైన సేవలను అందించనున్నారు.

మిగతా2లో...



## తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

### ఏపీకి అరవింద్ భదౌరియా.. తెలంగాణకు సునీల్ బన్సల్
### ఇతర రాష్ట్రాల్లోనూ తెలుగు నేతలకు బాధ్యతలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 23 :** బీజేపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక మార్పులు చోటుచేసుకు న్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చా ర్జిలు, కో-ఇన్‌చార్జిలను పార్టీ అధిష్ఠానం నియమించింది. రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ నియామకాలు

మిగతా2లో...

## తుమ్మల చెరువుకు గోదావరి జలాలు

### అశ్వాపురం రైతుల చిరకాల స్వప్నం సాకారం
### 'మారేళ్లపాడు ఎత్తిపోతల'ను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి
### తొలి విడతలో 4,300 ఎకరాలకు.. దశలవారీగా 23 వేల ఎకరాలకు సాగునీరు



2లో

## జలాల వినియోగంపై శ్వేతపత్రం ప్రకటించాలి

### - బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనాయకుడు తన్నీరు హరీశ్‌రావు డిమాండ్
### - గురుదక్షిణ కింద తెలంగాణ వాటాను ఆంధ్రాకు ధారాదత్తం



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, సా గునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు ద మ్ముంటే మూడేళ్లల్లో కృష్ణ, గోదావరి జలాలు ఎంత వినియోగమయ్యాయో శ్వేతపత్రం ప్రక టించాలని బీఆర్‌ఎస్ ఎల్పీ ఉపనాయకుడు త న్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గురుదక్షి ణ కింద కృష్ణ, గోదావ రి జలాలను ఆంధ్ర ప్రాం తానికి ధారాదత్తం చేయడం తప్పా రైతాంగాని కి ప్రయోజనం చేకూరిన అంశం ఒక్కటి

మిగతా2లో...

## కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

### బొగ్గు కొరతతో థర్మల్ విద్యుత్ ప్లాంట్ల మూత
### జెన్‌కోకు నాసిరకం బొగ్గు సరఫరాతో రూ.2,900 కోట్ల నష్టం
### నేడు పవర్‌ప్లాంట్ల సందర్శన : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే కరెంటు కోతలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. బొగ్గు కొరత కారణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోవిద్యుత్ ఉత్పత్తి నిలిపేస్తున్నారని అన్నారు. నీటి కొరత వల్ల జల విద్యుత్ కేంద్రాలు కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతున్నాయని చెప్పారు. ఇప్పుడే విద్యుత్ కోతలు ఇలా ఉంటే వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ కేంద్రాల వద్ద వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు గురువారం ఆరు బీఆర్‌ఎస్ బృందాలు రాష్ట్రంలోని థర్మల్ పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనున్నాయని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేటీఆర్

మిగతా2లో...

## మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

### స్పష్టం చేసిన ఇరాన్...న్యూయార్క్‌లో అమెరికా ప్రతినిధులతో అరాగ్చీ భేటీ



2లో



## దేవాదుల నీటిని సంపూర్ణంగా వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్

### తుంగతుర్తికి దేవాదుల జలాలు తీసుకొస్తాం..
### ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా చర్యలు

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** గోదావరి, దేవాదుల ప్రాజెక్టుల నీటిని సంపూర్ణంగా వినియోగించుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు నీటిని తీసుకొస్తానని హామీ ఇచ్చారు.బుధవారం సూర్యాపేట జిల్లాలో పర్యటించిన మంత్రి ఉత్తమ్

మిగతా2లో...

# రైతుల పోరాటం ఫలించింది..

(మొదటి పేజీ తరువాయి)

ఫలించింది. వారం రోజులుగా పంట కాలువలకు నీటిని విడుదల చేయాలని రైతులు చేస్తున్న పోరాటం నేపథ్యంలో బుధవారం జూరాల రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.పంట కాలువలకు నీరు విడుదల చేయాలని రైతులు ఆందోళన చేపట్టగా, గత రెండు రోజులుగా నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కూడా మద్దతు ప్రకటించారు. తాగునీటి అవసరాలకు మాత్రమే జూరాలలో నీరు ఉందని అధికారులు చెప్పడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. **కర్ణాటక నుంచి నీటికి హామీ**జూరాల ఆయకట్టు రైతుల సాగునీటి సమస్యను ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కర్ణాటకకు వెళ్లిన ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజాప్రతినిధులు బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 30 రోజులపాటు రోజుకు 5 వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 7 టీఎంసీల నీటిని జూరాల ప్రాజెక్టుకు విడుదల చేస్తామని డీకే శివకుమార్ హామీ ఇచ్చినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. **2,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులోకి ప్రస్తుతం 2,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు బుధవారం ఉదయం 8 గంటల సమయంలో కుడి, ఎడమ కాలువల వద్దకు చేరుకుని తూములను తెరిచి నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో ఇదే స్థాయిలో కొనసాగితే ప్రాజెక్టు నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటే స్పిల్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. **రైతుల్లో ఉపశమనం** సాగునీటి కోసం రైతులు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో కాలువలకు నీరు విడుదల కావడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు కర్ణాటక నుంచి 7 టీఎంసీల నీటి విడుదలకు హామీ లభించడంతో జూరాల ఆయకట్టు సాగునీటి అవసరాలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కరెంట్ విలాస వస్తువు కాదనీ, జీవనరేఖ అని అన్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు, ఐటీ రంగం, గృహ అవసరాలు అన్నింటికీ విద్యుత్ అత్యంత కీలకమని చెప్పారు. విద్యుత్ సమస్యపైనే తెలంగాణ మలిదశ ఉద్యమానికి పునాది పడిందని గుర్తుచేశారు.‘ఎల్‌నినో కాదు.. ఎల్ కాంగో’ విద్యుత్ సంక్షోభానికి ఎల్‌నినో ప్రభావం కారణం కాదనీ, ఎల్ కాంగో (కాంగ్రెస్) ప్రధాన కారణమని కేటీఆర్ విమర్శించారు. విద్యుత్ సంక్షోభానికి సింగరేణి బొగ్గు సరఫరా వ్యవస్థ కూడా ఒకటని అన్నారు.సింగరేణితో సర్కార్ ఫుట్‌బాల్ సింగరేణి సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఫుట్‌బాల్ ఆట ఆడుతున్నదని కేటీఆర్ అన్నారు. సింగరేణితో కార్మికులు, రైతులు, ప్రజలు ఆటలాడే పరిస్థితి రావొద్దని కోరారు. సింగరేణిలో సైట్ విజిటేషన్ సర్టిఫికెట్ల పేరుతో అక్రమాలు, సోలార్ పవర్ టెండర్లలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి 2023-24లో 70 మిలియన్ టన్నుల నుంచి 2025-26లో 58 మిలియన్ టన్నులకు ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు. వ్యవసాయానికి ఆరు గంటల కరెంటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయానికి ఆరు గంటలకు మించి కరెంట్ సరఫరా కావడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు‘ కాంగ్రెస్ అధికారంలో ఉంటే కరెంటు ఉండదని కేటీఆర్ అన్నారు. అదే ఇప్పుడు నిజమైందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనూ రైతులు విద్యుత్ కోతలపై రోడ్డెక్కారని గుర్తు చేశారు. విద్యుత్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆరు బీఆర్ఎస్ బృందాలు గురువారం పవర్ స్టేషన్లను సందర్శిస్తాయని చెప్పారు.యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్, భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి,చెన్నూరు నియోజకవర్గం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్‌ల బృందం సందర్శిస్తుందని వివరించారు. హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్ పరిశీలిస్తారని చెప్పారు. మాజీమంత్రులు తాటికొండ రాజయ్య, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, ఎల్ రమణ, ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఎ జీవన్‌రెడ్డి, బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల చెరువుకు గోదావరి జలాలు

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** తుమ్మల చెరువుకు గోదావరి జలాలు అందించాలన్న రైతుల చిరకాల కోరిక నెరవేరిందని మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో సీతారామ కాలువపై నిర్మించిన మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని బుధవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. పంపులు ఆన్ చేసి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేశారు. సుమారు రూ.610 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అనంతరం గొందిగూడెంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి అశ్వాపురం, పినపాక నుంచి పాలేరు వరకు గోదావరి జలాలను తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనుమతులు, సవరించిన అంచనాలను అధిగమిస్తూ పనులు చేయిస్తున్న తెలిపారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలకు అదనపు నిధులను సీఎం మంజూరు చేశారని, ఇల్లెందుకు జూలూరుపాడు టన్నెల్, లలితాపురం వద్ద ఎత్తిపోతలపై సర్వేలు చేసి అంచనాలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. అన్నదైవం ప్రాజెక్టుకు కూడా జలాలు విడుదల చేస్తున్నామని చెప్పారు. భూసేకరణలో రైతులు సహకరించాలని కోరారు. న్యాయమైన పరిహారం రైతులకు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా పది నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణకు కృషి చేస్తున్నామని, భద్రాచలంలో ప్రగళ్లపల్లి ఎత్తిపోతలతో పాలెంవాగు, తాలిపేరు, మోడికుంటవాగు అనుసంధానం చేస్తే మరిన్ని మండలాలకు నీరు అందుతుందన్నారు. ప్రస్తుత వర్షాభావం, ఎల్‌నినో నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, రబీలో తక్కువ నీటి పంటలు వేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ మొక్కలు అందిస్తామన్నారు. రూ.350 కోట్లతో భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించామని, పుష్కరాల నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పులుసుబొంత్ ప్రాజెక్టు భూసేకరణ, ప్రత్యామ్నాయ భూముల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు నిధులు మంజూరు చేసి టెండర్లు పిలుస్తామన్నారు. బూర్గంపాడులో దొమ్మలవాగు రిజర్వాయర్‌పై ప్రజల అవసరాల మేరకు చర్యలు తీసుకుంటామని, గిరిజన గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పేదలు, రైతులు, గిరిజనులు, మహిళలు, యువత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ మారేళ్లపాడు ద్వారా అశ్వాపురంలో 24 గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దశాబ్దాల కల నెరవేరిందని, గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరడం పండుగ వాతావరణం తెచ్చిందన్నారు. తుమ్మల ప్రధాన కాలువకు లైనింగ్, 22 కి.మీ డిస్ట్రిబ్యూటరీలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మణుగూరు రేగులగండి చెరువుకు నీరిస్తే 4 వేల ఎకరాల్లో మూడు పంటలు పండుతాయని, దొమ్మలవాగును మినీ రిజర్వాయర్‌గా చేయాలని కోరగా మంత్రులు సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. మారేళ్లపాడుతో పాటు జిల్లాలో 16 వేల ఎకరాలకు సాగునీటి పనులకు శ్రీకారం చుట్టామని, పులుసుబొంత్‌కు కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ భూముల గుర్తింపు కొనసాగుతోందన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ సహా 8 మండలాల్లో డిస్ట్రిబ్యూటరీల సర్వే 60 శాతం పూర్తయిందని, సీతమ్మసాగర్‌కు 600 ఎకరాల భూసేకరణ అవార్డు దశలో ఉందని, రూ.46 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, ఎస్పీ రోహిత్ రాజ్, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# జలాల వినియోగంపై శ్వేతపత్రం ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

కూడా లేదని దుయ్యబట్టారు. బుధవారం నాగర్‌కర్నూ ల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం పేరు చెప్పి కాంగ్రెస్ నేతలంతా ప్రకృతిని నింది స్తున్నారని, పాలమూరు జిల్లాలో ప్రతీ ప్రాజెక్టు ను సందర్శిస్తే కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు కన్పి స్తున్నాయన్నారు. కృష్ణానది జలాల వినియోగం లో ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 36 టీఎంసీల నీటిని తెలంగాణ సాగు భూములకు మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంకెల గారడీతో రైతాంగాన్ని మోసగించే ప్రయత్నం చే యడం ఏమాత్రం సహించరని విషయమన్నా రు. కేసీఆర్ చాలా దూరదృష్టితో కృష్ణ, గోదావరి జలాలపై లిఫ్టులు, రిజర్వాయర్లు నిర్మించారని, బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ అధికారంలో ఎన్ని ఎకరాల సాగు భూములకు నీరందించారో వివ రాలతో శ్వేతపత్రం ప్రకటించాలని ఆయన డి మాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొం త జిల్లాలో ఎకరా పంట ఎండినా సహించబో మని ఇందుకోసం ఉద్య మిస్తామని స్పష్టం చే శారు. రాబోయే కాలంలో కృష్ణా, గోదావరి నదీ జలాలను మళ్లించే ప్రయత్నం చేస్తే మహోద్య మం తప్పదని హెచ్చరించారు. కేఎల్ఐ కింద ఆ యకట్టులో సింహభాగానికి, పాలమూరు రంగా రెడ్డి ఎత్తిపోతల పథకం కింద నార్లాపూర్, ఏదు ల, వట్టెం రిజర్వాయర్ల వరకు కృష్ణా జలాలను పంపింగ్ చేసిన ఘనత కేసీఆర్‌దేనని ఈ అంశంపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ నేతలు సిద్ధం కావాలని, వేదిక వాళ్లే నిర్ణయించాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 3 రోజులు భారీ వర్షాలు.. తీరం వైపు తీవ్ర వాయుగుండం

## నేటి అర్ధరాత్రి కళింగపట్నం దక్షిణంవైపు తీరం దాటే చాన్స్

## పలు రాష్ట్రాల్లో నైరుతి నిష్క్రమణ

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** పశ్చిమ-మధ్య బంగాళాఖాతం, వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉన్నదని హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది. గోపాల్‌పురం-కళింగ పట్టణానికి సమీపంలో తీవ్ర వాయుగుండంగా బలపడి బుధవారం అర్ధరాత్రి కళింగపట్నం దక్షిణ తీరాన్ని దాటే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో తెలంగాణలో గురు, శుక్రవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని పేర్కొన్నారు.

# ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు

(మొదటి పేజీ తరువాయి)

రాలేకపోయింది. దీంతో ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.**ఏకగ్రీవ తీర్పు వచ్చి ఉంటే బాగుండేది: దత్తా** ఈ అంశంపై ధర్మాసనం ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చి ఉంటే సంస్థాగత ఐక్యతకు మరింత ప్రయోజనకరంగా ఉండేదని జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు. అభిప్రాయ భేదాలు ఏర్పడటంతో సుదీర్ఘమైన ఉత్తర్వులు వెలువరించాల్సి వచ్చిందని తెలిపారు.**పాలకులు చట్టానికి లోబడి ఉండాలి** తీర్పు సందర్భంగా జస్టిస్ దత్తా కీలక వ్యాఖ్యలు చేశారు. “పాలకులు చట్టానికి లోబడి ఉండాలి.. ఎవరూ చట్టానికి అతీతులు కారు” అని స్పష్టం చేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా కాకుండా రాజ్యాంగం, చట్టాల పరిధిలోనే పరిపాలన సాగాలని ఆయన ఉద్ఘాటించారు.**కొలీజియం వ్యవస్థపై స్పష్టత** జడ్జీల నియామకం, కొలీజియం వ్యవస్థపై జరుగుతున్న ప్రచారంపైనా సుప్రీంకోర్టు స్పందించింది. “జడ్జీలే తమ సహచర జడ్జీలను నియమించుకుంటున్నారు” అనే ప్రచారం వాస్తవానికి దూరంగా ఉందని పేర్కొంది. న్యాయమూర్తుల అభ్యర్థుల పరిశీలన, ఎంపిక ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇతర నిఘా వ్యవస్థల పాత్ర కూడా ఉంటుందని ధర్మాసనం వివరించింది.

# తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టినట్లు సమాచారం.ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జిగా డాక్టర్ అరవింద్ భదౌరియా, కో-ఇన్‌చార్జిగా వనతి శ్రీనివాసన్‌ను నియమించారు. తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్, కో-ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, రేఖా శర్మలను నియమించారు.**ఇతర రాష్ట్రాల్లో తెలుగు నేతలకు బాధ్యతలు** తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులకు ఇతర రాష్ట్రాల సంస్థాగత బాధ్యతలను కూడా పార్టీ అప్పగించింది. ఏపీ బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరిని ఒడిశా బీజేపీ ఇన్‌చార్జిగా నియమించారు. తెలంగాణకు చెందిన డీకే అరుణకు తమిళనాడు బీజేపీ కో-ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ కసమ్ వెంకటేశ్వర్లును కర్ణాటక బీజేపీ కో-ఇన్‌చార్జిగా నియమించారు.**సంస్థాగత విస్తరణపై దృష్టి** రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత కార్యకలాపాలను సమన్వయం చేయడం, రాష్ట్ర నాయకత్వంతో కలిసి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌చార్జిల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో తాజా జాతీయ స్థాయి నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ప్రకటించినట్లు సమాచారం. ఇదే సమయంలో కొత్త జాతీయ బృందంలో తరుణ్ చుగ్‌కు కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

# మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

**న్యూయార్క్ సెప్టెంబర్ 23 :** ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ ప్రతినిధులతో అమెరికా అధికారులు న్యూయార్క్‌లో మూడు గంటల పాటు సమావేశమయ్యారు. ఈ భేటీ సానుకూలంగా జరిగిందని, ఒప్పందానికి రావడం రాకపోవడం ఇరాన్‌పై ఆధారపడి ఉన్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ‘ఇది ఓ మంచి సమావేశం. ఒప్పందానికి వస్తే వారికే ప్రయోజనం’ అని వ్యాఖ్యానించారు. ఘర్షణల నివారణ కోసం ఇరాన్ ఎందుకు ఒప్పందం చేసుకోవడం లేదో తాను ఊహించలేకపోతున్నానని చెప్పారు. ఐరాస సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికా ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్‌లతో చర్చలు జరిపారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, అన్ని రకాల పోరును నిలిపివేయాలని అరాగ్చీ ఈ సందర్భంగా డిమాండ్ చేశారని తెలిసింది. ఈ డిమాండ్లను నెరవేరిస్తే హార్ముజ్ జలసంధిని తెరుస్తామని ఆయన చెప్పారు.‘వారు నాతో మాట్లాడాలని అనుకుంటున్నారు. వారు మాతో మాట్లాడుతూనే ఉన్నారు. ఈ రోజు కూడా మాట్లాడారు. ఈ సంబంధం అభివృద్ధి చెందుతోంది’ అని ఆయన తెలిపారు. చర్చలు కొనసాగుతాయని అంటూ అంతిమంగా ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే అణ్వాయుధాన్ని పొందకుండా ఇరాన్‌ను నిరోధిస్తామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇరాన్ ప్రతినిధులతో చర్చలపై తాను చాలా సంతోషంగా ఉన్నానని విట్‌కాఫ్ వ్యాఖ్యానించారు. మధ్యవర్తులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తారని ఆయన చెప్పారు. కాగా గల్ఫ్, ప్రాంతీయ దేశాల దౌత్య యత్నాల కారణంగానే అమెరికా, ఇరాన్ ప్రతినిధులు చర్చలు జరిపారని తెలుస్తోంది.

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ సమ్మిట్ కీలకం

(మొదటి పేజీ తరువాయి)

కోసం సుమారు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. సీనియర్ అధికారులు, మంత్రులకు వివిధ బాధ్యతలు అప్పగించడంతో పాటు ప్రత్యేక వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసి రోజువారీగా ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను వినియోగించాలని నిర్ణయించారు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, గతంలో కుదిరిన ఎంవోయూల అమలు పురోగతిని సమీక్షించాలని భట్టి సూచించారు.ప్రతినిధుల స్పందనను బట్టి సభా ప్రాంగణాల సంఖ్యను ప్రస్తుత 4 నుంచి 6 లేదా 8కు పెంచే అంశాన్ని పరిశీలించనున్నారు. మూడు రోజుల కార్యక్రమంగా మాత్రమే కాకుండా తెలంగాణకు దీర్ఘకాలికంగా పెట్టుబడులు, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

# ప్రజల ముంగిటకే ‘మీ సేవ’లు: మంత్రి శ్రీధర్‌బాబు

(మొదటి పేజీ తరువాయి)

జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, ఈసీ కాపీలు, పోలీస్ శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర పౌర సేవలను డోర్ డెలివరీ ద్వారా అందించనున్నారు.తొలిదశలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ సేవలను అమలు చేసి, అనంతరం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# దేవాదుల నీటిని సంపూర్ణంగా వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

కుమార్ రెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.**ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా..** 365 టీఎంసీల నీటిని ఒక్క చుక్క కూడా వృథా కాకుండా వినియోగించుకునేలా కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టు నీటి లభ్యత, వినియోగంపై వివరాలు వెల్లడించారు. రాజకీయ దురుద్దేశాలకు తావులేకుండా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు.**తాటిపాముల అభివృద్ధికి కృషి** అధికారంలో ఉన్నా లేకున్నా తన తండ్రి కోరిక మేరకు తాటిపాముల గ్రామాన్ని తన శక్తి మేర అభివృద్ధి చేస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఏపీ ఓపెన్ స్కూల్ పోస్టర్లు, ప్రాస్పెక్టస్ ఆవిష్కరణ



**కుప్పం, సెప్టెంబర్ 23 ప్రజావాణి :** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పాఠశాల పోస్టర్లు, ప్రాస్పెక్టస్‌లను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పంలోని తన నివాసంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పాఠశాలలో చేర్పించి, వారికి విద్యావకాశాలు కల్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యకు దూరమైన వారు, వివిధ కారణాలతో చదువును కొనసాగించలేకపోయిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా లభిస్తున్న అవకాశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. సార్వత్రిక విద్య ద్వారా మరింత మంది విద్యార్థులకు విద్యావకాశాలు అందించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా సార్వత్రిక పాఠశాల సమన్వయకర్త మరియు అసిస్టెంట్ కమీషనర్ డాక్టర్ వి. జయ ప్రకాష్ నాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ--గుండమ్మ రిజర్వాయర్‌లో గణనాథుని నిమజ్జనంలో

● 6వ వార్డు కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్





పట్టణం, పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల అనంతరం గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ఎల్లమ్మ--గుండమ్మ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్ పాల్గొన్నారు. గణనాథుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల సమక్షంలో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. గణపతి బప్పా మోరియా నినాదాలతో రిజర్వాయర్ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులు, యువత, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది సూచించిన భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు

## ప్రభుత్వ భూముల పరిశీలన

● ఆన్లైన్ రికార్డులపై ఎమ్మార్వో ఆరా.



**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి.** మంథని మండలం చిల్లపల్లి దుబ్బపల్లి పరిధిలోని సర్వే నెంబర్లు 173. 170 ప్రభుత్వ భూములను కలెక్టర్ ఆదేశాల మేరకు మంథని ఎమ్మార్వో పరిశీలించారు ప్రభుత్వ భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా భూములకు సంబంధించిన రికార్డులు ఆన్లైన్లో నమోదయి ఉన్నాయా లేదా అనే విషయాలను కాస్తులు ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు ప్రభుత్వ భూముల విస్తీర్ణం సర్వే నెంబర్లు ఆన్లైన్ రికార్డుల వివరాలను పరిశీలిస్తూ రికార్డులో ఏమైనా లోపాలు లేదా వ్యత్యాసాలు ఉంటే వాటిని గుర్తించాలని సూచించారు ప్రభుత్వ భూముల వివరాలను పక్కాగా నమోదు చేసి భూముల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో చిల్లపల్లి గ్రామ సర్పంచ్ గోప్ సంతోష్ కుమార్ గ్రామ కార్యదర్శి జి పి ఓ సర్వేయర్ అక్కపాక సంపత్ రాజయ్య రైతులు ప్రజలు పాల్గొన్నారు

## దరంబాద్‌లో ఎస్సై మధుకర్‌కు ఘన సన్మానం



**పెద్దపల్లి:** పెద్దపల్లి మండలం దరంబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని పెద్దపల్లి రూరల్ ఎస్సై మధుకర్ సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, కమిటీ గౌరవ అధ్యక్షులు కీర్తి రాజయ్య ఆధ్వర్యంలో ఎస్సై మధుకర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను క్రమశిక్షణతో నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప గడ్డ డివిజన్ లో వినాయక పూజ లో పాల్గొన్న ఎం ఎల్ ఏ





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 23 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** బీరప్ప గడ్డ డివిజన్‌లో వినాయక పూజ, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి బుధవారం నాడు బీరప్ప గడ్డ డివిజన్ పరిధిలోని స్థానిక నాయకులు సల్ల వీరారెడ్డి ప్రత్యేక ఆహ్వానం మేరకు ఏర్పాటు చేసిన వినాయక చవితి పూజా కార్యక్రమం మరియు అన్నదాన కార్యక్రమంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు గణేష్ మండపం వద్ద ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి బిఆర్ఎస్ BRS సీనియర్ నాయకులతో కలిసి బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చనలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గారు ప్రారంభించి భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని వడ్డించారు.

# నయీం ఆస్తుల లెక్క తారుమారు...!

- 327 ఆస్తులపై జీవో.. గెజిట్ జారీ.
- తూప్రాన్‌పేటలోనే ఎందు కీ గందరగోళం..?
- 22ఏ జాబితాలో కనిపిం చని భూములు.
- 5.5 ఎకరాలు అప్‌లోడ్.. 40 ఎకరాల సంగతేంటి..?
- రిజిస్ట్రేషన్ యత్నంతో బయటపడిన వ్యవహారం.
- నయీం ఆస్తులు చేతులు మారుతున్నాయా..?



**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ 24 మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి**

గ్యాంగ్‌స్టర్ నయీం ఆస్తుల లెక్కలు మాయమవు తున్నాయా..? ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చాలని స్పష్టంగా ఆదేశించిన ఆస్తుల్లోనే కొన్ని వివరాలు రికార్డుల్లో కనిపించకపోవడం వెనుక ఏముంది..? నయీంకు చెందిన 327 ఆస్తులను 22 ఏ (1) (ఈ) కింద చేర్చాలని జీవో జారీ చేసి.. గెజిట్ కూడా విడుదల చేసినా..యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలోని భూముల విషయంలో మాత్రం రికార్డులు , క్షేత్ర స్థాయి పరిస్థితులకు పొంతన లేకపోవడం ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. 5.5 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించిన సమయం లో ఈ వ్యవహారం వెలుగులోకి రావడం.. అధికార యంత్రాంగం హడావుడిగా ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం మరిన్ని ప్రశ్నలకు దారితీస్తోంది. అదే సమయంలో మరో సర్వే నంబర్‌లోని దాదాపు 40 ఎకరాల భూమి ఇంకా ప్రొహిబిటెడ్ జాబితాలో ఎందుకు స్పష్టంగా కని పించడంలేదన్నది చర్చనీ యాంశంగా మారింది. నయీం బెదిరింపులు , అరాచకాలతో భూములు కూడబెట్టుకున్నాడని..? పలువురు పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో పాటు కోర్టులను ఆశ్రయించారు. నయీం తన భార్య , బంధువులు , అను చరుల పేర్లతో ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించినట్లు దర్యాప్తు సంస్థల కేసుల్లో అంశాలు ఉన్నాయి. 2020 ఆగస్టు 8న ఎన్‌కౌంటర్‌లో నయీం మరణించిన తర్వాత అతడి ఆస్తులపై సిట్ , ఈడీ తదితర సంస్థల దర్యాప్తులు కొనసాగాయి. ఈ నేపథ్యంలో నయీంకు చెందిన 327 ఆస్తులను 22 ఏ (1) (ఈ) లో చేర్చాలని ప్రభుత్వం ఆదేశించింది.

**గెజిట్ ఉంది..జాబితాలో లేవు...**

ప్రభుత్వం జీవో నంబర్ 206 జారీ చేసి.. అనంతరం గెజిట్ నంబర్ 149 ను విడుదల చేసింది. గెజిట్‌లో పేర్కొన్న ఆస్తుల వివరాలను రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ వెబ్ సైట్‌లోని ప్రొహిబిటెడ్ జాబితాలో నమోదు చేయాల్సి ఉంది. యాదాద్రి జిల్లాలోని పలు ఆస్తులను 22 ఏ (1) (ఈ) లో అప్ లోడ్ చేసినా..చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట లోని కొన్ని భూముల వివరాలు మాత్రం కని పించకపోవడం ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. తూప్రాన్‌పేటలోని సర్వే నంబర్ 13 ఏ , 14 లో 5.5 ఎకరాల భూమి ఉంది. క్షేత్ర స్థాయిలో అది ఖాళీ ప్లాట్లుగా ఉన్నప్పటికీ రికార్డుల్లో వ్యవసాయ భూమి గానే ఉన్నట్లు సమాచారం. ఈ భూమిలో ని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కొందరు శుక్రవారం రోజు చౌటుప్పల్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లారు. ఈడీ కేసుల కారణంగా రిజిస్ట్రేషన్ చేయలేమని సబ్ రిజిస్ట్రార్ చెప్పినా.. రికార్డుల్లో భూములు నిషేధిత జాబితాలో లేవని వారు వాదించినట్లు తెలు స్తోంది. దీంతో సబ్ రిజిస్ట్రార్ వ్యవహారాన్ని సీసీఎల్‌ఏ దృష్టికి తీసుకెళ్లారు.

**సీసీఎల్‌ఏ ఆరా..షోకాజ్ నోటీసు...**

తూప్రాన్‌పేట భూముల వివరాలు 22ఏ జాబితా లో ఎందుకు కనిపించ లేదన్న అంశంపై సీసీఎల్‌ఏ నుంచి జిల్లా అధికారులకు వివరణ కోరుతూ ఆదేశాలు వచ్చి నట్లు సమాచారం. మరో వైపు గెజిట్‌లో పేర్కొన్న ఆస్తులను ప్రొహిబిటెడ్ లిస్టులో ఎందుకు చేర్చ లేదని చౌటుప్పల్ తహసీల్దార్ వీరాబాయికి శుక్రవారం రోజున రాత్రి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా రెవెన్యూ అధికారులు హడావుడిగా రికార్డులను పరి శీలించారు. వివాదం ముదరడంతో యాదాద్రి జిల్లా రెవెన్యూ అధికారులు శనివారం రోజున రాత్రంతా కసరత్తు చేసినట్లు సమాచారం. సర్వే నంబర్లు 13 ఏ , 14 లోని 5.5 ఎకరాల భూమి వివరాలను ఆదివారం ఉదయం 7.45 గంటలకు ప్రొహిబిటెడ్ సైట్‌లో అప్ లోడ్ చేశారు. వివాదం వెలుగులోకి వచ్చిన వెంటనే వివరాలు అప్ లోడ్ చేయడం ఇప్పుడు చర్చకు దారితీసింది. అసలు గెజిట్‌లో ఉన్న ఆస్తి ఇంతకాలం ఆన్‌లైన్ జాబితాలో ఎందుకు కనిపించలేదన్నదే ప్రశ్న.

**ఆస్తులు చేతులు.. మారుతున్నాయా...?**

తూప్రాన్‌పేటలో మరో సర్వే నంబర్‌లో ఉన్న దాదాపు 40 ఎకరాల భూమి వివరాలు మాత్రం ఇంకా అప్‌లోడ్ కాలేదని తెలుస్తోంది. ఈ భూమికి సంబంధించి సిట్ నుంచి ఎన్‌వోసీ వచ్చిందని కొందరు అధికారులు చెబు తున్నట్లు సమాచారం. దర్యాప్తు సంస్థల నుంచి క్లియరెన్స్ వచ్చిన తర్వాతే ఆ భూములు చేతులు మారాయా..? అన్న సందేహాలు వ్యక్తమవు తున్నాయి. అయితే ఈ 40 ఎకరాలు ప్రొహిబిటెడ్ సైట్‌లోని కోర్టు కేసుల విభాగంలో కనిపిస్తున్నట్లు సమాచారం. నయీం ఆస్తులను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చాలని ఆదేశించిన నేపథ్యంలో..అవి సురక్షి తంగా ఉన్నాయా..? ఇప్పటికే చేతులు మారాయా..? అన్న అను మానాలు వ్యక్తమవు తున్నాయి. తూప్రాన్‌పేట లో 5.5 ఎకరాల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించక పోవడం , రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నం జరగడం , ఆ తర్వాత హడావుడిగా వివరాలు అప్‌లోడ్ చేయడం..మొత్తం వ్యవ హారం పై మరిన్ని ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ఇది అధికారుల నిర్లక్ష్యమా..? సాంకేతిక లోపమా..? లేక ఎవరైనా ఉద్దేశ పూర్వకం గా ఆస్తులను జాబితాలోకి రాకుండా అడ్డు కున్నారా..? అన్నది తేలాల్సి ఉంది.

**మిగిలిన జిల్లాల్లోనూ.. తనిఖీ అవసరం...**

నయీంకు సంబంధించిన ఆస్తులు యాదాద్రితో పాటు రంగారెడ్డి , మేడ్చల్, నల్గొండ , ఖమ్మం , కరీంనగర్ , జగిత్యాల , సిద్దిపేట , మెదక్ , మహ బూబ్‌నగర్, పెద్దపల్లి జిల్లాల్లో ఉన్నట్లు సమాచారం. తూప్రాన్‌పేట వ్యవహారం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ జిల్లాల్లోని ఆస్తుల వివరాలు కూడా గెజిట్‌తో సరిపోల్చి పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. 327 ఆస్తుల జాబితాలో ఏ ఒక్క ఆస్తి వివరమూ మిస్ కాకుండా సమగ్రంగా ధ్రువీకరించాల్సి ఉంది. లేనిపక్షంలో నయీం ఆస్తుల రక్షణ కోసం తీసుకున్న ప్రభుత్వ చర్యలే ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది.

# భక్తి శ్రద్ధలతో స్వర్ణగిరిలో గిరి ప్రదక్షిణ...

- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు.
- ఘనంగా స్వర్ణగిరిషుని దివ్య విమాన రథోత్సవం.
- స్వామి వారి రథాన్ని లాగి తరించిన భక్తజనం.







**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23**

తెలంగాణ రాష్ట్రంలోనే ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్ర మైన యాదాద్రి తిరుమల స్వర్ణగిరి దేవస్థానంలో బుధవారం రోజు శ్రవణా నక్షత్రం వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించు కొని ఉదయం 6 గంటల 30 నిమిషాలకు స్వర్ణగిరి క్షేత్రంలోని స్వామివారి పాదాల వద్ద ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు , చైర్మన్లు మానేపల్లి మురళీ కృష్ణ , గోపికృష్ణల ఆదేశాల మేరకు గిరి ప్రదక్షణ యొక్క విశిష్టతను విచ్చేసిన భక్తులకు వివరించిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్య క్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి గోవింద నామాలను స్మరిస్తూ గిరి ప్రదక్షిణ గావించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించు కోని దివ్యాను భూతిని పొందారు. సాయంత్రం 6:30 నిమిషాలకు పద్మా వతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య విమాన రథోత్సవానికి ఆలయ ఈవో అమర్నాథ్ , ఆలయ సిపిఆర్ఓ సాయిబాబా సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్ కొబ్బరికాయలు కొట్టి స్వర్ణగిరీషుని దివ్య విమాన రథోత్సవ కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి రథాన్ని లాగి మహతానందాన్ని పొంది ఆనంద పరవశు లయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గిరి ప్రదక్షణ చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. అలాగే గిరి ప్రదక్షణకు వచ్చే చంటి పిల్లల తల్లుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# చర్చలు విఫలం ఐదు రోజులు బ్యాంకులు బంద్...!

- దేశవ్యాప్త సమ్మెకు బ్యాంకు సంఘాల పిలుపు..!
- సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె..!
- శని ఆదివారాలతో కలిపి మొత్తం ఐదు రోజులు బ్యాంకులు బంద్..!
- వారానికి 5 రోజుల పని ప్రధాన డిమాండ్ అన్న యూనియన్లు..!
- లావాదేవీలు ముందు గానే పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచన.




**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23**

దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి అంత రాయం ఏర్పడనుంది. బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో , యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ యూఎఫ్‌బీయూ దేశ వ్యాప్త సమ్మెకు పిలుపు నిచ్చింది. ఫలితంగా సెప్టెంబర్ చివరి వారంలో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూత పడనున్నాయి. వారానికి ఐదు రోజుల పనిదినాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు సంఘాలు కొంత కాలంగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక శాఖ సూచన మేరకు మంగళ వారం డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. ఐదు రోజుల పని విధానం అంశం పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ , స్పష్టమైన హామీ యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు బంద్ ప్రకటించారు. ఆ తర్వాత శని , ఆదివారాలతో కలిపి వరుసగా ఐదు రోజులు బ్యాంకు మూసి ఉండనుంది. కావున లావాదేవీలు జరుపుకునే కస్టమర్లు ముందుగా గ్రహించి లావాదేవీలు జరుపుకోవాలని బ్యాంకు సంఘాలు సూచించాయి.

## ఎమ్మెల్యే మల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధ్యక్షురాలు

● జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి. ● ఎమ్మెల్యే: మల్ రెడ్డి రంగారెడ్డి:



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 23 (ప్రజావాణి న్యూస్):** నియోజకవర్గం లో కష్టపడి పనిచేసిన కార్యకర్త ఏ స్థాయికైనా ఎదిగే అవకాశం కాంగ్రెస్‌లో మాత్రమే ఉంటుందని, డీసీసీ ప్రెసిడెంట్‌గా పారిజాత నియామకమే ఇందుకు నిదర్శనంగా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా ఇటీవల నియమితులైన చిగురింత పారిజాతానర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా తిరుమల హిల్స్‌లోని నివాసంలో మల్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే కొత్త బాధ్యతల్లో మంచిపేరు తెచ్చుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలని మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కాంగ్రెస్‌ను జిల్లాలో మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలు నాయకులందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్న మల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. డీసీసీ అధ్యక్షులుగా నియామకంలో సహకరించిన మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన పారిజాతనర్సింహారెడ్డి పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు.

# ఉప్పల్ నియోజకవర్గం లో పలు వినాయక మండపాల్లో ఎం ఎల్ ఏ సందర్శన

● ఉప్పల్ ఎం ఎల్ ఏ బండారి లక్ష్మా రెడ్డి

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 23 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** వినాయక మండపాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శన భక్తిశ్రద్ధలతో గణనాథునికి ప్రత్యేక పూజలు హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు వినాయక మండపాలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , మాజీ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మండప నిర్వాహకులతో కలిసి బుధవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సమృద్ధులు కలగాలని స్వామివారిని ప్రార్థించారు.వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో



పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా నిర్వహించడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. మండప నిర్వాహకులతో మాట్లాడి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు వంజరి ప్రవీణ్



కరిపే, గుమ్మడి జంపాల్ రెడ్డి, మల్లేష్ గౌడ్, కైలాష్ శర్మ, పవన్ శర్మ, లింగం, మల్లారెడ్డి, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, నరసింహ గౌడ్,సంజయ్ నాయక్,రిజ్వాన్, చారి, బాలయ్య గౌడ్, అంజయ్య, జైపాల్, కోటి రెడ్డి, సతీష్ రెడ్డి, కరుణాకర్, శివ, శేఖర్ గౌడ్, పోచయ్య, రామకృష్ణ, అశోక్, కిరణ్ అఫ్రోజ్, శ్రీను, మహేష్ యువత,భక్తులుమండప నిర్వాహకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయుడు టి.కే. రమేష్ మృతి పట్ల

● ప్రభుత్వ విప్ విజయరమణ రావు సంతాపం





**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి సెప్టెంబర్ 23**సుల్తానాబాద్‌కు చెందిన టీవీ9, సిటీ కేబుల్ సీనియర్ పాత్రికేయుడు టి.కే. రమేష్ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు సుల్తానాబాద్‌లోని రమేష్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన విజయరమణ రావు, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. రమేష్ మృతి జర్నలిజం రంగానికి, మీడియా మిత్రులకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో తాము అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా కల్పించారు.రమేష్‌తో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా పలువురు మీడియా ప్రతినిధులు, నాయకులు గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, కౌన్సిలర్లు, మీడియా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని టి.కే. రమేష్‌కు నివాళులర్పించారు.

# నేడు పోయి..మరలెడు రావయ్యా గణపయ్యా..

● నిమజ్జనం రోజు వినాయకుడి చెవిలో ఇది చెబితే..కోరిన కోర్కెలు నెరవేరుతాయట..?

**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23**
వినాయక చవితి పండుగ ప్రారంభమై నేటికి తొమ్మిది రోజులు గడిచాయి. సెప్టెంబర్ 14న గణేష్ చతుర్ధది రోజు ప్రతి ఒక్కరు వినాయకుడి విగ్రహం ప్రతిష్ఠించుకొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇంకా కొంతమంది తమ సాంప్రదాయ కుటుంబం ఆచారం ప్రకారం నిమజ్జనం చేయడం కూడా ప్రారంభించారు. అయితే వినాయకుడిని నిమజ్జనం చేసే సమయంలో ఈ చిన్న పని చేస్తే చాలు మీ తీరని కోరికలు కూడా తీరుతాయంట.. ఇంతకీ ఆ పనులు ఏవో ఇప్పుడు చూద్దాం. వినాయకుడి పండుగ అంటే చాలు పల్లె , పట్నం అన్నిచోట్ల ఆ సందడే వేరుంటుంది. ప్రతిరోజు ఉదయం సాయంత్రం పూజలు , కోలాటం , ఆటపాటలతో సందడి నెలకొంటుంది. చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రతి ఒక్కరు గణేష్ ఉత్సవాలలో చాలా ఆనందంగా పాల్గొంటారు. అయితే ఇప్పటికీ కొన్ని చోట్ల నిమజ్జనాలు కూడా ప్రారంభవయ్యాయి. అయితే నిమజ్జనం చేసిన సమయంలో వినాయకుడి చెవిలో ఈ పదాలు చెబితే చాలు మీరు కోరుకుంటున్న కోరికలు నెరవేరుతాయంట. ఇంతకీ అవి ఏమి అనుకుంటున్నారా.. నిమజ్జనానికి తరలించే ముందు వినాయకుడి ఎడమచేవిలో మీ



కోరికను చెప్పాలంట.. కుడి చేతితో మీ నోటికి చేయి అడ్డుపెట్టి మనసులో ఉన్నది గణేశుడికి చెప్పాలంట. అంతేకాకుండా మీ కోరికను చెప్పిన తరువాత నా కోరికను నెరవేర్చు స్వామి , గౌరవాన్ని కాపాడు , మేలు కడిగేలాచూడు స్వామి.. ఉద్యోగం , ఇంట్లో సంతోషం , ఐశ్వర్యం , కలగాలని , అందరూ ఆరోగ్యంగా ఉండాలని దీవించు అని ఆయనకు చెప్పాలంట. ఇలా చెప్పడం వలన మీరు కోరిన కోరిక నెరవేరు తుందని చెబుతున్నారు పండితులు. అయితే ఇలా చెప్పడం వెనుక ఒక కారణం ఉన్నది అంటున్నారు బ్రాహ్మణ పంతులు. అది ఏమిటి అంటే..? నిమజ్జనం అంటే వినాయకుడు భూ లోకాన్ని వదిలి కైలాసం చేరుకోవడం. నిమజ్జనం తర్వాత వినాయకుడు నేరుగా కైలాసానికి



చేరుకొని తన తల్లి దండ్రులను కలిసి వారి ఆశీస్సులు తీసుకుంటాడంట. అందువలన మీరు ఆ సమయంలో చెప్పిన సన్నివేశాన్ని ఆయన తల్లిదండ్రులైన శివపార్వతులకు చేరవేస్తాడని విశ్వసిస్తారు. అందువలన నిమజ్జనం రోజు ఎవరికి వినపడకుండా మీ కోరికను వినాయకుడు చెవిలో చెప్పండి.

నోట్:- ఈ వార్తలలో ఇవ్వబడిన సమాచారం మతావిశ్వాసం పై ఆధారపడి ఉంది. పాఠకుల ఆసక్తి మేరకు.. పలువురు పండితుల సూచనలు , వారు తెలిపిన అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే.. వీటిలో ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని పాఠకులు గమనించాలని మన ప్రజావాణి తెలుగు దినపత్రిక యాజమాన్యం కోరుకుంటుంది.

# కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి - మంత్రికి అడ్లూరి కి వినతి



**జనగామ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 23(ప్రజావాణి):**కరెన్సీ నోట్లపై డా. బి.ఆర్. అంబేద్కర్ ఫోటో ముద్రించాలని కోరుతూ కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డా. జేరిపోతుల పరశురామ్ తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు బుధవారం వినతి పత్రం అందజేశారు. సెక్రటేరియట్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి ఈ డిమాండ్ ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి క్యాబినెట్ లో చర్చించి, కేంద్రానికి లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఇది న్యాయమైన డిమాండ్ అని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి లేఖ రాసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం డా. జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ డా. అంబేద్కర్ లేకుంటే నేడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదన్నారు. 1921లో ఇంపీరియల్ బ్యాంకు కుప్పకూలినప్పుడు “రూపాయి - దాని సమస్య పరిష్కార మార్గం” అనే పుస్తకాన్ని రాసి హిల్టాన్ యంగ్ కమిషన్, రాయల్ కమిషన్, సైమన్ కమిషన్ కు ఇవ్వడం వల్ల 1935 ఏప్రిల్ 1న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడిందని, దానికి కారణం డా. బి.ఆర్. అంబేద్కర్ అని తెలిపారు. చరిత్రను నిర్మించిన వారి ఫోటో కరెన్సీపై ఉండాలని, ఈ డిమాండ్ సాధనకు రాజ్యసభ, పార్లమెంట్ సభ్యులు, అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆమోదించిన సందర్భంగా కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద వేలాది మంది కళాకారులచే దూం దాం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. మధు, సూరారపు పరీక్షన్, దాసరి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయుర్వేదం ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకం - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**భూపాలపల్లి, సెప్టెంబర్ 23 (మన ప్రజావాణి):** భారతదేశ ప్రాచీన వైద్య విజ్ఞానమైన ఆయుర్వేదం ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా భూపాలపల్లిలోని ఇంటిగ్రేటెడ్ ఆయుష్ 50 పడకల ఆసుపత్రిలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుష్ శాఖ డైరెక్టర్ ఐషా మసరత్ ఖానం, ఐఏఎస్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది.హాజరైన ఎమ్మెల్యే గండ్ర ధన్వంతరి భగవాన్ కు పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో శిబిరాన్ని ప్రారంభించారు. ఆయుర్వేదం కేవలం చికిత్స మాత్రమే కాకుండా ఆరోగ్యకర జీవనం, సమతుల్య ఆహారం, ప్రకృతి ఆధారిత విధానాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. ప్రజలు ఆయుష్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

289 మందికి వైద్య సేవలు:

ఈ మెగా శిబిరానికి 289 మంది హాజరై వైద్య సేవలు పొందారు.



మధుమేహం, రక్తపోటు, కీళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, జ్వరం, అస్తమా, స్త్రీ సంబంధిత సమస్యలు తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, సలహాలు అందించారు.

ఆయుష్ సేవలను చేరువ చేస్తాం:

ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ కె. రాఘవేందర్ రావు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భవిష్యత్తులో మరిన్ని



శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ‘ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం’ అనే సందేశంతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, డీపీఆర్వో శ్రీనివాస్, డిప్యూటీ నోడల్ అధికారులు డాక్టర్ మధుమిత, డాక్టర్ ప్రేమ్ సాగర్, కన్వీనర్ డాక్టర్ బుసారా, వైద్యులు డాక్టర్ జగదీష్ కన్నా, డాక్టర్ సాధానందం, డాక్టర్ గీత, డాక్టర్ అజయ్ రెడ్డి, ఫార్మసిస్టులు, యోగా ఇన్ స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

# బాల సదన్ హోమ్ ను సందర్శించిన జిల్లా న్యాయ సేవాది కారి





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 23 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జడ్జి వి. బాలభాస్కర్ రావు ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ DLSA మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెక్రటరీ మరియు సీనియర్ సివిల్ జడ్జి వీం జి.ఎస్.ఎల్. ప్రియాంక ప్రభుత్వ బాలసదన్ హోంను సందర్శించారు.ఈ సందర్భంగా బాలసదన్‌లోని పిల్లల వసతి, భోజనం, ఆరోగ్యం, విద్య, రక్షణ మరియు వారికి అందుతున్న ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు.అలాగే బాలసదన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లు మరియు ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించి, పిల్లల సంక్షేమం మరియు రక్షణకు సంబంధించిన అంశాలపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు.పిల్లలకు నాణ్యమైన సంరక్షణ, విద్య మరియు అవసరమైన న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు కె. నాగజ్యోతి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇంతియాజ్ రహీం , నారపల్లి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ శ్రీమతి సౌమ్య బాలసదన్ సూపరింటెండెంట్ భవాని DCPU సిబ్బంది మరియు బాలసదన్ హోం సిబ్బంది పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పక్కా ప్రణాళిక - అదనపు కలెక్టర్ పి. అశోక్ కుమార్

**భూపాలపల్లి, సెప్టెంబర్ 23 (మన ప్రజావాణి):** ఖరీఫ్ 2026-27 సీజన్ లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేస్తామని అదనపు కలెక్టర్ పి. అశోక్ కుమార్ తెలిపారు.బుధవారం హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, సంచాలకులు గోపి, మార్కెటింగ్ శాఖ సంచాలకులు రాహుల్ రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఐడీఓసీ నుంచి ఆయన పాల్గొన్నారు.

జిల్లాలో 170 కొనుగోలు కేంద్రాలు:

జిల్లాలో 170 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 123, ఐకేపీ ద్వారా 40, జీసీసీ ద్వారా 5 కేంద్రాలు ఉంటాయన్నారు. సుమారు 1,05,400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాటాలు తదితర పరికరాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పరికరాల వినియోగం, సంరక్షణపై నిర్వాహకులు బాధ్యత వహించాలని, నిర్లక్ష్యం వల్ల దెబ్బతిన్న పరికరాల నష్టాన్ని కమిషన్ నుంచి కోత విధిస్తామని వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ స్పష్టం చేశారు.




ముంపునకు గురయ్యే అవకాశమున్న 12 కొనుగోలు కేంద్రాలకు ప్రత్యామ్నాయ స్థలాలను, ధాన్యం నిల్వకు ఫంక్షన్ హాళ్లు, ప్రైవేటు గోదాములు, సీఏపీ స్థలాలను గుర్తించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సుమారు 37.60 లక్షల గోనె సంచులు అవసరమవుతున్నందున వాటిని ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు .ధాన్యాన్ని నూర్పిడి అనంతరం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి బాబూరావు, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, శాస్త్రవేత్త డా. మదన్ మోహన్ రెడ్డి, అదనపు డీఆర్డీఓ చౌహాన్, మహాదేవ్ పూర్ ఏడీఏ శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు దారి కల్పించాలని ధర్నా

● భద్రు తండా వద్ద జాతీయ గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఆందోళన



**డోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 23 ప్రజావాణి :**ఎలుకచెట్టు తండా: మండలంలోని ఎలుకచెట్టు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని భద్రు తండా వెనుక నుంచి జాతీయ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో రైతులకు రాకపోకలకు దారి కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ధర్నా నిర్వహించారు.సర్పంచ్ మాలోత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో తండా రైతులు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు. హైవేకు ఇరువైపులా తండా వాసుల వ్యవసాయ భూములు ఉండటంతో పొలాలకు వెళ్లేందుకు సరైన దారి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులు, తండా వాసులతో మాట్లాడారు. తండా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ భూములకు దారి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యుడు బాదావత్ నరేష్, తండా రైతులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## నాగారంలో మడే సమ్మక్క కుటుంబానికి రవి పటేల్ పరామర్శ -- రూ.10,000 ఆర్థిక సాయం



**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 23 (మన ప్రజావాణి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రూరల్ పరిధిలోని నాగారం గ్రామంలో ఇటీవల మరణించిన మడే సమ్మక్క గారి దశదిన కర్మలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (TRP) భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ హాజరయ్యారు. టీఆర్పీ జిల్లా అధికార ప్రతినిధి మడే సంతోష్ నానమ్మ అయిన మడే సమ్మక్క కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిరుపేద కుటుంబానికి పార్టీ తరఫున రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ.. పార్టీ కోసం క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేస్తున్న మడే సంతోష్ కుటుంబానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగారం టీఆర్పీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిదం ధర్మయ్య ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇనుగాల ప్రణయ్ రాజ్, క్రమశిక్షణ కమిటీ సభ్యులు గండు కరుణాకర్, పిట్టల వెంకటేష్, మోటపోతుల సమ్మయ్య, జిల్లా కోశాధికారి జినుకల శ్రీను, వ్యవసాయ విభాగం అధ్యక్షులు పింగిడి శంకరయ్య, కార్మిక విభాగం అధ్యక్షుడు, భూపాలపల్లి మండల అధ్యక్షుడు మీసాల రాజు, మనోహర్రావు మండల అధ్యక్షుడు మేనం సంతోష్, నాగారం గ్రామ కమిటీ నాయకులు, టీఆర్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నివాళులర్పించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**చిలిపిచెడ్, సెప్టెంబర్ 23 (ప్రజావాణి):** మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండల పరిధిలోని బండాపోతుగల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ హుస్సేన్ మాతృమూర్తి ఖాజాబీ బేగం (87) అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. ఖాజాబీ బేగం మృతి వార్త తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హుటాహుటిన బండాపోతుగల్ గ్రామానికి చేరుకున్నారు. ఆమె పార్థివదేహానికిఘనంగా నివాళు లర్పించారు. అనంతరం శ్రద్ధాంజలి ఘటించారు. తరువాత శోకసంద్రంలో మునిగిపోయిన కుమారుడు సయ్యద్ హుస్సేన్ మరియు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖాజాబీ బేగం మృతికి గల కారణాలను, గత కొద్ది రోజులుగా ఆమె ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ తీరని విషాద సమయంలో ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె ప్రార్థించారు. అదేవిధంగా ఫైజాబాద్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రామస్వామి సుధాకర్ గౌడ్ మాతృమూర్తి రుక్కమ్మ



ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారని తెలుసుకున్న ఎమ్మెల్యే, వెంటనే వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపి, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల నాయకులు సారా రామాగౌడ్, సంగా గౌడ్, మధుసూదన్ రెడ్డి,



ఎంపీ విట్టల్, నర్సింహారెడ్డి, షఫీ, దుర్గారెడ్డి, గోపాల్ రెడ్డి, యాదగిరి, గోపాల్ రావు, మల్లారెడ్డి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సయ్యద్ హుస్సేన్ కుటుంబాన్ని పరామర్శించారు.

## పౌష్టికాహారంతో తల్లి బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం

- బైరాన్ పల్లి గ్రామ సర్పంచ్ బర్మా రాజమల్లయ్య



**మద్దూరు సెప్టెంబర్ 23, ప్రజా వాణి,** మండలంలోని బైరాన్ పల్లి 2వ అంగన్వాడి కేంద్రంలో బుదవారం పోషణ మాసం అంగన్వాడి సూపర్వైజర్ రేణుక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రేణుక మాట్లాడుతూ చిరుధాన్యాలు ఎక్కువగా ఉపయోగించాలని వంటలలో ఆయిల్ వాడకాన్ని తగ్గించాలని సుచించారు. అదే విధంగా గ్రామ సర్పంచ్ బర్మా రాజమల్లయ్య మాట్లాడుతూ పిల్లలకు ప్యాకెట్స్ ఇప్పించొద్దని ఆకుకూరలు,కూరగాయలు పండ్లు తీసుకోవాలనీ అన్నారుతల్లులకు సమతుల ఆహారం తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు, అంగన్వాడీ టీచర్లు స్వరూప, విజయ, ఆశా,గర్భిణీ బాలింతలు తల్లులు కిశోర బాలికలు పాల్గొన్నారు.

## రిమ్స్ అగ్నిప్రమాదంలో మృతి చెందిన 15 రోజుల చిన్నారి కుటుంబానికి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శ

- రిమ్స్ అగ్నిప్రమాదంలో మృతి చెందిన 15 రోజుల చిన్నారి కుటుంబానికి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శ
- బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత
- ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్

**ప్రజావాణి -- ఖానాపూర్ నియోజకవర్గం** ఆదిలాబాద్: ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని చిన్నారుల వార్డులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మృతి చెందిన 15 రోజుల చిన్నారి కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. ఇంద్రవెల్లి మండలం గిన్నెరగూడ గ్రామానికి చెందిన కుమ్రాం దినేష్ -- షేకుబాయి దంపతుల 15 రోజుల చిన్నారి ఈ విషాద ఘటనలో మృతి



చెందడంతో, వారి కుటుంబ సభ్యులను భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించి ధైర్యం చెప్పారు. చిన్నారిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పసికందును కోల్పోవడం అత్యంత విషాదకరమైన ఘటన అని, కుటుంబ సభ్యుల బాధను మాటల్లో వ్యక్తం చేయలేమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రిమ్స్లో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. అలాగే ఆసుపత్రుల్లో అగ్నిప్రమాద నివారణ, అత్యవసర పరిస్థితుల్లో రోగులను రక్షించే వ్యవస్థలను మరింత పటిష్టం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. విషాదంలో ఉన్న బాధిత కుటుంబానికి ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు అండగా నిలిచి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని భూక్యా జాన్సన్ నాయక్ కోరారు.

## మిర్యాలగూడ పట్టణం డాక్టర్స్ కాలనీలో శ్రీ వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

- ముఖ్య అతిధులుగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి BLR



**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 23** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి BLR DCC ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపాటి నవీన్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ?గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, నిర్వాహకులు ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే BLR మాట్లాడుతూ వినాయక చవితి పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక భావనతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన కమిటీ సభ్యులను, నిర్వాహకులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, డాక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, దీూ= బ్రదర్స్, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బెంబర్ గ్రామ శివారులో చిరుత కలకలం

- లేగదూడపై దాడి చేసి హతమార్చిన చిరుత.. పాదముద్రలను గుర్తించిన అటవీశాఖ అధికారులు
- పొలాల్లోకి వెళ్లేందుకు రైతుల జంకు.. అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

**నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, సెప్టెంబర్ 23:--** నిర్మల్ జిల్లా తానూర్ మండలం బెంబర్ గ్రామ శివారులో చిరుతపులి సంచారం రైతులు, గ్రామస్తుల్లో తీవ్ర భయాందోళనకు దారితీస్తోంది. గత రెండు రోజులుగా గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల పరిసరాల్లో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తాజాగా రైతు సాయినాథ్కు చెందిన లేగదూడపై చిరుత దాడి చేయడంతో అది అక్కడికక్కడే మృతి చెందింది. లేగదూడపై చిరుత దాడి చేసిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. డిప్యూటీ రేంజ్ అధికారి శంకర్, బీట్ అధికారి కృష్ణలు పరిశీలనలో చిరుత పాదముద్రలను గుర్తించారు. దీంతో బెంబర్ గ్రామ శివారులో చిరుత సంచారం ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. చిరుత సంచారం నిర్ధారణ కావడంతో బెంబర్తో పాటు సమీప గ్రామాల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. పశువులను సైతం బయటకు వదలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చిరుత కదలికలను గుర్తించేందుకు అటవీశాఖ అధికారులు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.










రైతులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఒంటరిగా పొలాల్లోకి లేదా అటవీ ప్రాంతాల వైపు వెళ్లవద్దని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని హెచ్చరించారు. చిరుత కనిపించినా దాని సమీపానికి వెళ్లకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

## తెలంగాణరాష్ట్ర రిజర్వేషన్ సమితి వర్కింగ్ సెక్యూరిటీ గౌరీ గారి పరుశురాములను పరామర్శించిన.

- తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి.
- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ గణేష్.



**రాయపోల్. సెప్టెంబర్ 23(ప్రజావాణి)** సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న సాకలి పరశురాములును బుధవారం తన ఇంటి వద్ద రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రాష్ట్ర రిజర్వేషన్ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్సిద్దిపేట జిల్లా రజక రిజర్వేషన్ సమితి యువజన యువజన అధ్యక్షులు చింతకింది కర్ణాకర్ జిల్లా అధ్యక్షులుఅధ్యక్షులు జంగాపల్లి ఐలయ్య. రాయపోల్ మండల అధ్యక్షులు వడ్లకొండ బిక్షపతి .రాయపోల్ మండల ఉపాధ్యక్షులు చెప్యాల స్వామి. మండల యువజన అధ్యక్షులు సాకలి రాము వర్కింగ్ ప్రెసిడెంట్ చింతకింది కృష్ణ. పరశురాములు పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు అనంతరం వారు మాట్లాడుతూ. ఆరోగ్యంగా ఉంటూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని ఆయనకు ధైర్యం చెప్పారు.

## జిల్లా ఉత్తమ మండల విద్యాధికారిగా రాందాస్

- ఘనంగా సన్మానించిన మంచాల మండల ఉపాధ్యాయ సంఘం నాయకులు

**రంగారెడ్డి జిల్లా మంచాల సెప్టెంబర్ 23:( ప్రజావాణి)** ఉత్తమ మండల విద్యాధికారిగా మంచాల మండల విద్యాధికారి రాందాస్ ఎంపికైన సందర్భంగా మంచాల మండల ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. మంచాల మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు రాందాస్ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్యూటీఎఫ్ జిల్లా కోశాధికారి డాక్టర్ జగన్నాథ్ మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే మహత్తర బాధ్యతతో పాటు పాఠశాలల అభివృద్ధికి రాందాస్ అంకితభావంతో నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని



అన్నారు. మంచాల మండలంలో విద్యా ప్రమాణాల అభ్యున్నతికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మండల విద్యాధికారిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యారంగానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా జిల్లా ఉత్తమ మండల విద్యాధికారి అవార్డు లభించడం రాందాస్ అంకితభావానికి, నిరంతర కృషికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. రాందాస్ మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మంచాల మండలం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రంగారెడ్డి జిల్లాలో అగ్రగామిగా నిలిచిందని డాక్టర్ జగన్నాథ్ తెలిపారు. మండలంలోని పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, పాఠశాల మానివేసే విద్యార్థుల సంఖ్యను తగ్గించేందుకు కూడా నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్యూటీఎఫ్ మండల అధ్యక్షుడు డాక్టర్ అజ్మత్ ఖాన్, మండల ప్రధాన కార్యదర్శి తుల్జారామ్, ఉపాధ్యక్షుడు మండల యాదయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు మోతీలాల్, వెంకట నరసయ్య, సమగ్ర వనరుల ఉపాధ్యాయులు జగదీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు..

## గణేష్ ఉత్సవాల్లో మహిళలకు ఉచిత చీరలు

- సొంత నిధులతో చీరల పంపిణీ చేసిన యువ దాత చెరుకుపల్లి వంశీ



**చిలుకూరు సెప్టెంబర్ 23(ప్రజావాణి): ఆచార్యుల గూడెం:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆచార్యులగూడెంలో మహిళల కు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువ దాత చెరుకుపల్లి వంశీ పాల్గొని మహిళలకు చీరలు అందజేశారు. పండుగ సందర్భంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో తన సొంత నిధులతో చీరలను అందించినట్లు వంశీ తెలిపారు. సమాజ సేవలో భాగంగా యువత ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా చీరలు అందుకున్న మహిళలు వంశీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలి.

- సీపీఐ మాస్ లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్



**కోటగిరి/ప్రజావాణి:**-అమెరికా ఆధిపత్య ధోరణులు,యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య,ప్రగతిశీల శక్తులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ బోధన్ డివిజన్ కమిటీ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ పిలుపునిచ్చారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షాహిద్ భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా అమెరికా సామ్రాజ్యవాదా న్ని వ్యతిరేకిస్తూ పీడీఎస్యూ,పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ఒక సదస్సు ను నిర్వహించారు. పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.నాగమణి అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు బి.మల్లేష్ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. షాహిద్ భగత్ సింగ్ చూపిన ధైర్యం, త్యాగం,సామాజిక మార్పు కోసం సాగించిన పోరాట స్ఫూర్తితో యువత, విద్యార్థులు,మహిళలు ముందుకు సాగాలని కోరారు. ప్రపంచంలో శాంతి, ప్రజాస్వామ్యం,సామాజిక న్యాయం పరిఢవిల్లాలంటే ప్రజల ఐక్య పోరాటా లను బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.నాగమణితో పాటు ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు కళావతి,లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న మెడపై 'రసాయన' కత్తి: కల్తీ కాంబినేషన్లు... అడ్డగోలు దోపిడీ!

- ఎమ్మార్పీకి మంగళహారతులు... ప్యాకెట్‌పై ధర ఒకటైతే అమ్మేది మరొకటి!
- యూరియా, డీఏపీ నిల్వలపై 'నామ్‌కే వాస్తే' తనిఖీలు... బ్లాక్ మార్కెట్‌కు అధికారుల పరోక్ష సహకారం!
- నిషేధిత గడ్డి మందులు, అనుమతి లేని బయో ఉత్పత్తుల దందా..పట్టించుకోని వ్యవసాయ శాఖ!
- మామూళ్ల మత్తులో ఆఫీసర్లు... వెంకటాపురం, ఏజెన్సీలో వ్యాపారుల విచ్చలవిడి రాజ్యం!




**వెంకటాపురం (నూగూరు), సెప్టెంబర్ 23 (ప్రజావాణి):** ఏజెన్సీలో సాగును నమ్ముకున్న గిరిజన, నిరుపేద రైతన్నలను ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు నిలువునా దోచుకుంటున్నారు. ఎకరాల కొద్దీ పంట సాగు చేసి చీడపీడల బారిన పడకుండా కాపాడుకుందామంటే.. పెంకుటిల్లు దాటని వ్యాపార సంస్కృతి రైతులకు శరాఘాతంగా మారింది. మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో వెలిసిన ఎరువులు, పురుగుమందుల దుకాణదారులు ఏకంగా ప్రభుత్వ నిబంధనలకే నకిలీ రంగు పూస్తూ అక్రమ వ్యాపారాన్ని దర్జాగా సాగిస్తున్నారు.

**యూరియా, డీఏపీ నిల్వలపై నిమ్మకు నీరెత్తిన అధికారులు:**
ప్రస్తుతం సాగు సీజన్ కీలక దశకు చేరడంతో యూరియా, డీఏపీ ఎరువులకు డిమాండ్ పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు గోదాముల్లో వందలాది బస్తాల స్టాక్‌ను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దుకాణాల్లో, గోదాములలో ఎన్ని బస్తాల నిల్వలు ఉన్నాయనే కనీస స్టాక్ లెక్కింపును వ్యవసాయ అధికారులు చేయడం లేదు. కేవలం షాపుల ముందు నిలబడి 'నామ్‌కే వాస్తే' తనిఖీలు చేస్తూ మమ అనిపిస్తున్నారు. పాయింట్ ఆఫ్ సేల్ మిషన్లలో చూపే స్టాక్‌కు, గోదాముల్లో ఉన్న అసలు నిల్వలకు అస్సలు పొంతన ఉండటం లేదు. అధికారుల ఈ నిర్లక్ష్యం వ్యాపారుల బ్లాక్ మార్కెట్ దందాకు పరోక్షంగా సహకరిస్తోంది.

**ఎమ్మార్పీతో పనిలేదు... డిమాండే ప్రామాణికం!**
పంటలకు చీడపీడలు ఆశించే సమయాన్ని ఆసరాగా చేసుకుని పురుగుమందుల షాపుల నిర్వాహకులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. డబ్బా లేదా ప్యాకెట్‌పై ముద్రించిన గరిష్ట విక్రయ ధరలకు (ఎంఆర్ పి ) ఏమాత్రం సంబంధం లేకుండా అదనంగా రూ. 100 నుండి రూ. 300 వరకు గుంజుతున్నారు. రశీదులు (జీఎస్టీ బిల్లులు) అడిగితే అసలు మందులే ఇవ్వబోమని బెదిరిస్తూ, తెల్ల కాగితాలపై అంకెలు రాసి రైతుల చేతిలో పెడుతూ అటు రైతులను, ఇటు పన్ను రూపంలో ప్రభుత్వాన్ని ముంచుతున్నారు.

**వెనుక తలుపుల గుండా నిషేధిత మందుల విక్రయం:**
ప్రభుత్వం నిషేధించిన ప్రమాదకర విషపూరిత గడ్డి మందులు, నాణ్యతా ప్రమాణాలు లేని బయో ఉత్పత్తులను వ్యాపారులు యథేచ్ఛగా అమ్ముతున్నారు. ఎక్కువ దిగుబడి వస్తుందని ఆశచూపి, అనుమతి లేని కంపెనీల టానిక్లు, మందులను రైతులపైకి రుద్దుతున్నారు. వీటిని వాడి పొలాల్లో తెగుళ్లు అదుపులోకి రాకపోగా, చేతికొచ్చిన పంటలు ఎండిపోయి పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొంది.

**అధికారుల నిద్రమత్తు... తనిఖీలకు పాతరే!**
కళ్లముందే ఎరువుల షాపుల్లో అక్రమాలు, నిషేధిత మందుల విక్రయాలు సాగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారులు కనీసం షాపుల్లోని స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, ధరల పట్టికలను తనిఖీ చేసిన దాఖలాలు లేవు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా శూన్యమవ్వడం వల్లే వ్యాపారులు ఇంతలా తెగబడుతున్నారని, ప్రతి నెలా అందుతున్న మామూళ్ల వల్లే చర్యలు తీసుకోవడం లేదని స్థానిక రైతులు మండిపడుతున్నారు.

**చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్ ముట్టడి!**
వెంటనే వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఏజెన్సీలోని ఎరువులు, పురుగుమందుల షాపులు, గోదాములపై సమగ్ర విచారణ జరిపించాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తూ, స్టాక్ దాచిపెడుతూ, నిషేధిత మందులు అమ్ముతున్న వ్యాపారులపై క్రిమినల్ కేసులు పెట్టి లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేయాలని కోరుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే జిల్లా కలెక్టరేట్ ముట్టడి సమరానికి దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# సిద్దిపేట జిల్లాలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీల నిర్మాణం



**నంగునూరు, సెప్టెంబర్ 23:** తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ( టీఎస్, ఎమ్మార్పీఎస్)ను సిద్దిపేట జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు మండలాల వారీగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రాజేందర్ తెలిపారు. జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న, రాష్ట్ర అధ్యక్షుడు కేదాస్ మోహన్ నాయకత్వంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో సంస్థను బలోపేతం చేసేందుకు కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు .జిల్లాలోని మండలాల్లో పర్యటిస్తూ మాదిగల సమస్యలను తెలుసుకోవడంతో పాటు ఎమ్మార్పీఎస్ కార్యకలాపాలపై అవగాహన కల్పిస్తున్నట్లు రాజేందర్ తెలిపారు. మండలాల్లో మాదిగల నుంచి మంచి స్పందన లభిస్తోందని, సంస్థలో చేరేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. జిల్లాలోని మొత్తం 30 మండలాలకు అధ్యక్షులను నియమించి నూతన కమిటీలను ఏర్పాటు చేయడానికి జిల్లా వ్యాప్తంగా పర్యటనలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.జిల్లాలోని మాదిగలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను చేపడతామని తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్‌లో సిద్దిపేట జిల్లా కేంద్రంలో మాదిగల సమస్యలపై భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించిన నిధులు పక్కదారి పట్టకుండా ఎస్సీల సంక్షేమానికే వినియోగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీలకు కేటాయించిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ.12 లక్షలు అందించాలని కోరారు. జీవో నంబర్ 58, 59 ప్రకారం అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని, పారిశుద్ధ్య కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.25 వేల వేతనం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 'సోషల్ వాలా' వెబ్‌సైట్ ఆవిష్కరణ

- వెబ్ సైట్ రూపొందించిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు సుద్దాల రంజిత్ కుమార్
- వినూత్న కార్యక్రమాలతో సిద్దిపేట సోషల్ ఫోరం ఆదర్శంగా నిలుస్తోంది
- రమేశ్, డీఈఓ సిద్ధిపేట జిల్లా

**నంగునూరు, సెప్టెంబర్ 23** విద్యార్థుల్లో సాంఘిక శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించి బోధన, అభ్యసన ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు సిద్ధిపేట జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఫోరం ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర విద్యార్థుల కోసం సిద్ధిపేట జిల్లా నంగునూరు గ్రామానికి చెందిన సుద్దాల రంజిత్ కుమార్ రూపొందించిన 'సోషల్ వాలా' వెబ్‌సైట్‌ను జిల్లా విద్యాధికారి (డీఈఓ) శ్రీ సిహెచ్.రమేశ్ బుధవారం ఆవిష్కరించారు. సుద్దాల రంజిత్ కుమార్ ప్రస్తుతం సిద్ధిపేట జిల్లాలో ధూళిమిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.సిద్ధిపేట జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా అధ్యక్షుడు మామిడి పూర్ణచంద్రరావు మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. ధూళిమిట్ట



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సుద్దాల రంజిత్ కుమార్ ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. సాంఘిక శాస్త్రాన్ని విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా, అవసరమైన విద్యా సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదిక ద్వారా అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 'సోషల్ వాలా' వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు సుద్దాల రంజిత్ కుమార్ తెలిపారు. సాంఘిక శాస్త్రానికి సంబంధించిన వివిధ అంశాలను విద్యార్థులకు సులభంగా చేరువ అయ్యేలా చేయడం, పాఠ్యాంశ బోధనలో ఉపాధ్యాయులకు సహాయపడేలా డిజిటల్ వనరులను అందించడం వంటి లక్ష్యాలతో ఈ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను విద్యారంగంతో అనుసంధానం చేయడంలో భాగంగా ఈ ప్రయత్నం చేపట్టారు. వెబ్‌సైట్ ఆవిష్కరణ సందర్భంగా సిద్దిపేట డీఈఓ సిహెచ్.రమేశ్ మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లాలోని వివిధ సబ్జెక్టు ఉపాధ్యాయుల ఫోరమ్‌లలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం వినూత్నంగా, సృజనాత్మకంగా కార్యక్రమాలను చేపడుతోందని అభినందించారు.కొత్త ఆలోచనలతో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలను రూపొందిస్తూ సాంఘిక శాస్త్ర ఫోరం ఇతర సబ్జెక్టు ఫోరమ్‌లకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సాంకేతికతను వినియోగించుకుని విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వనరులను అందుబాటులోకి తీసుకు రావడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మామిడి పూర్ణచంద్రరావు, 'సోషల్ వాలా' వెబ్‌సైట్ రూపకర్త సుద్దాల రంజిత్ కుమార్ లను అభినందించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా కొనసాగుతున్నాయని ఫోరం ప్రతినిధులు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సాంఘిక శాస్త్ర బోధనను మరింత ఆసక్తికరంగా, ప్రభావవంతంగా మార్చేందుకు భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మామిడి పూర్ణచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి, పలువురు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలకు తరలిరండి

- గూడూరు మండల కేంద్రంలోని వివిధ గ్రామాలలోవాల్ పోస్టర్స్ ఆవిష్కరణ





**గూడూరు మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 23. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, ఈ నెల 28, 29, 30 తేదీల లో ఖమ్మం నగరంలో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ... గూడూరు మండల కేంద్రం లో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయం అలాగే గోవిందపురం, మచ్చర్ల, అప్పరాజుపల్లి, జగన్నాయకుల గూడెం, గ్రామాలలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గజ్జి లింగన్న, కొట్టెం అచ్చన్న లు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించేందుకు జాతీయ మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని అన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సెప్టెంబర్ 28న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతు, కూలీలు తిప్పిగొట్టారని అన్నారు. రైతు హక్కుల కోసం పోరాడుతున్న ఏఐకేఎంఎస్ మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెనక భరత్, కొటెం బుజ్జన్న, ఒర్రె వెంకన్న, కాడబోయిన నరసయ్య, జోగ వీరస్వామి, రమేష్, రాజు, వెంకన్న, లక్ష్మయ్య, రామక్క, సుజాత, లక్ష్మి, నర్సక్క, తదితరులు పాల్గొన్నారు.

# భారత అండర్-15 బాలికల సాఫ్ట్‌బాల్ జట్టుకు ఈశ్వరి ఎంపిక

- కూలీల కుటుంబం నుంచి దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి
- చైనాలో అక్టోబర్ 12 నుంచి 18 వరకు అంతర్జాతీయ టోర్నీ
- గట్ల మల్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అరుదైన గౌరవం
- ఈశ్వరిని ఘనంగా సన్మానించిన సిద్దిపేట జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్





**నంగునూరు, సెప్టెంబర్ 23** సిద్ధిపేట జిల్లా క్రీడా ఖ్యాతి మరోసారి అంతర్జాతీయ స్థాయికి చేరింది. మారుమూల తండాకు చెందిన నిరుపేద కుటుంబ బాలిక, సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్ల మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తన ప్రతిభ, పట్టుదల, కఠోర సాధనతో భారత అండర్-15 బాలికల సాఫ్ట్‌బాల్ జట్టులో స్థానం సంపాదించింది. అక్కన్నపేట మండలం కపూర్ నాయక్ తండాకు చెందిన ఈశ్వరి చైనాలో అక్టోబర్ 12 నుంచి 18 వరకు జరగనున్న అంతర్జాతీయ అండర్-15 సాఫ్ట్‌బాల్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది.
వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో ఈశ్వరి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించింది. కఠినమైన ఎంపిక ప్రక్రియలో తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి భారత జట్టులో చోటు దక్కించుకుంది. అంతర్జాతీయ స్థాయికి
ఈశ్వరి అక్కన్నపేట మండలం కపూర్ నాయక్ తండాకు చెందిన వ్యవసాయ కూలీలు భానుతు ప్రభాకర్, విజయ దంపతుల ప్రథమ పుత్రిక. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తల్లిదండ్రులు తమ కుమార్తె విద్యతో పాటు క్రీడా ప్రతిభను ప్రోత్సహించారు.
గట్ల మల్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఈశ్వరి అక్కడి ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ వద్ద సాఫ్ట్‌బాల్‌లో శిక్షణ పొందింది. నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం ఆమెకు లభించింది.ఈశ్వరి అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావడం పాఠశాల మొత్తానికి గర్వకారణమని గట్ల మల్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాదాసి రమేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈశ్వరి క్రీడల్లోనే కాకుండా చదువులోనూ చురుగ్గా ఉంటూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. ఆమెను ఈ స్థాయికి తీసుకురావడంలో కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ దర్శనాల రాజ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం, హాస్టల్ వార్డెన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈశ్వరి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఇంగే నరేశ్ గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు ఆమెకు అండగా నిలిచారు. విదేశీ పర్యటనకు సంబంధించిన అవసరాల కోసం తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించి ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గట్లమల్యాల పాఠశాల నుంచి ఒక విద్యార్థిని అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం ఇదే తొలిసారి కావడం విశేషమని గ్రామ సర్పంచ్ ఇంగే నరేశ్ పేర్కొన్నారు.
భారత అండర్-15 బాలికల సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికై చరిత్ర సృష్టించిన ఈశ్వరిని సిద్దిపేట జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నేతి కైలాసం శాలువాతో సత్కరించి, నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నేతి కైలాసం మాట్లాడుతూ.. చైనాలో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో ఈశ్వరి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భారతదేశానికి, తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ సెక్రటరీ రేణుక మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని ఒక గ్రామీణ ప్రాంతానికి చెందిన బాలిక భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సిద్దిపేట జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈశ్వరి విజయం గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకి కాదని నిరూపిస్తూ, కష్టపడి సాధన చేస్తే అంతర్జాతీయ స్థాయికి చేరుకోవచ్చని ఈశ్వరి తన విజయంతో చాటిచెప్పింది. చైనాలో జరిగే పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న ఈశ్వరిపై సిద్దిపేట జిల్లా ప్రజలు, ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు ప్రత్యేకంగా ఆశలు పెట్టుకున్నారు.

# 13 ఏళ్ల నిరీక్షణకు తెర.. భూములు కోల్పోయిన పేదలకు ఇంటి పట్టాలు

- తొగర్‌పల్లి సర్వే నం.418లో 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున పట్టాలు
- జగ్గారెడ్డి కృషితో 13 ఏళ్ల తర్వాత తొలిసారిగా జీవో జారీ





**తొగర్‌పల్లి, సెప్టెంబర్ 23: మన సమగ్ర ప్రజావాణి సంగారెడ్డి జిల్లా ప్రతినిధి** ఏళ్ల తరబడి సొంతింటి స్థలం కోసం ఎదురుచూస్తున్న భూములు కోల్పోయిన పేదల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాలకు చెందిన 93 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో ఒక్కొక్కరికి 125 గజాల చొప్పున స్థలాలను కేటాయించారు.తొగర్‌పల్లి గ్రామానికి చెందిన 72 మంది, అలియాబాద్ గ్రామానికి చెందిన 21 మంది లబ్ధిదారులకు నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాలను అందజేశారు.2011లో కేటాయింపులు.. 13 ఏళ్లుగా ఎదురుచూపులు తొగర్‌పల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన కుటుంబాలకు 2011లో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. అయితే అనంతరం ప్రభుత్వం మారడంతో గతంలో జరిగిన కేటాయింపులు అమలుకు నోచుకోకపోవడంతో లబ్ధిదారులు సంవత్సరాల తరబడి స్థలాల కోసం ఎదురుచూశారు.ఈ సమస్యను మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు, లబ్ధిదారులకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.మంత్రి పొంగులేటిని కలిసిన జగ్గారెడ్డి ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం జగ్గారెడ్డి గత సంవత్సరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. అనంతరం మంత్రి అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో మాట్లాడి, లబ్ధిదారులకు స్థలాల పొజిషన్ చూపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.13 ఏళ్ల తర్వాత జీవో రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కేటాయింపుపై గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి కొనసాగుతున్న నిషేధం నేపథ్యంలో, తొగర్‌పల్లి లబ్ధిదారుల సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా జీవో జారీ అయినట్లు కార్యక్రమంలో పేర్కొన్నారు. జగ్గారెడ్డి విజ్ఞప్తి మేరకు 13 ఏళ్ల తర్వాత ఇళ్ల స్థలాల కేటాయింపుకు జీవో రావడం ఇదే తొలిసారి అని నాయకులు, అధికారులు తెలిపారు.నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాల పంపిణీ తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో జరిగిన కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైందని ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, కొండాపూర్, అలియాబాద్ గ్రామ సర్పంచులు, కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు: విశ్వజ్యోతి స్కూల్‌లో విద్యార్థులకు పోటీలు!

- 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు!
- గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం... పాల్గొన్న వారందరికీ ప్రత్యేక కానుకలు!
- బిజెపి మండల అధ్యక్షుడు రామేళ్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమం!



**వెంకటాపురం (నూగూరు), సెప్టెంబర్ 23 (ప్రజావాణి):** భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం మండల కేంద్రంలో విద్యార్థులకు పోటీలు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక శ్రీ విశ్వజ్యోతి పాఠశాలలో బిజెపి మండల అధ్యక్షుడు రామేళ్ల రాజశేఖర్ అధ్యక్షతన విద్యార్థులకు చిత్రలేఖనం మరియు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది. పోటీల అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను నాయకులు అందజేశారు. అదేవిధంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరినీ ప్రోత్సహిస్తూ బిజెపి నాయకులు ఒక చిన్న కానుకగా ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ బోల్లే సునీల్, మండల సీనియర్ నాయకులు జల్లికంపల లక్ష్మీపతి, మండల ప్రధాన కార్యదర్శి నోముల శ్రీకిషన్, మండల ఉపాధ్యక్షులు తోట సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయ బృందం మరియు బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముష్టిబండ ఇనాం భూములపై కదిలిన రెవెన్యూ యంత్రాంగం



**దమ్మపేట, సెప్టెంబర్ 23 (మన సమగ్ర ప్రజావాణి):** దమ్మపేట మండలంలోని ముష్టిబండ గ్రామంలో ఇనాం భూములకు సంబంధించిన వివాదంపై రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. గత కొంతకాలంగా తమ భూముల హక్కుల కోసం పోరాడుతున్న ముష్టిబండ దళితుల విజ్ఞప్తి మేరకు, దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం నుంచి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ బిక్షం, జిఓసి సూర్యం తదితరులు గ్రామానికి చేరుకుని వివాదాస్పద భూములను పరిశీలించారు. ముష్టిబండకు చెందిన దళిత కుటుంబాలు తమకు సంబంధించిన ఇనాం భూములపై హక్కులను పునరుద్ధరించాలని, తమ పూర్వీకుల నుంచి సాగులో ఉన్న భూములు ఇతరుల ఆధీనంలోకి వెళ్లాయని ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై ఇప్పటికే రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్యను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు బాధితులు తెలిపారు. కొన్ని భూములకు పట్టాదారు పాసుబుక్కులు జారీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు పేర్కొంటూ, సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవ హక్కుదారులను గుర్తించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పరిశీలనకు వచ్చిన రెవెన్యూ అధికారులతో కలిసి దళితులు జోరువర్షాన్ని సైతం లెక్కచేయకుండా భూముల వద్దకు వెళ్లి, తమ వద్ద ఉన్న పాత పత్రాలు, సాగు ఆధారాలు, భూముల వివరాలను అధికారులకు చూపించి సమస్యను వివరించారు. భూముల హద్దులు, రెవెన్యూ రికార్డులు, పట్టాదారు పాసుబుక్కులు, ఆన్‌లైన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులు తేల్చాలని వారు కోరారు. రికార్డుల్లో ఏమైనా అక్రమ మార్పులు, తప్పుడు నమోదులు జరిగి ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, చట్టబద్ధమైన పత్రాలు మరియు క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా నిర్ణయం తీసుకుని తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూ హక్కుల కోసం పోరాడుతున్న కోలికపోక కాంతారావు, దాట్ల మధు,కోలికపోక ధర్మరాజు, కోలికపోరు ఐలతిరాజు, మల్లాది వెంగళరావు, నారపోగు అనిల్‌కుమార్, దాట్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# డిసివో నీరజను కలిసిన అమీనాబాద్ సొసైటీ ఛైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి

- సొసైటీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం: డిసివో హామీ



**చెన్నారావుపేట సెప్టెంబర్ 23 ప్రజావాణి**జిల్లా సహకార అధికారి (డిసివో) నీరజను అమీనాబాద్ సొసైటీ ఛైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు సొసైటీ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై డిసివోతో ప్రత్యేకంగా చర్చించారు.?ఈ సందర్భంగా ఛైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. సొసైటీ పురోగతికి ఉన్న అవకాశాలను, పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలను డిసివో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై డిసివో నీరజ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని, సొసైటీ అభివృద్ధికి శాఖ పరంగా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, సొసైటీ డైరెక్టర్ సిద్దన రమేష్, డైరెక్టర్ మంద యాకయ్య గౌడ్, సర్పంచ్ దార రంజిత్, ఉపసర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాథపురం పాఠశాలలో ఘనంగా ఉచిత యూనిఫారాలు, బూట్ల పంపిణీ!

- ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి:
- సర్పంచ్ ఆలం కళ్యాణి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, సిబ్బంది ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం



**వాజేడు, సెప్టెంబర్ 23 (ప్రజావాణి):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలలో భాగంగా వాజేడు మండలం జగన్నాథపురం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు (యూనీఫారాలు), బూట్లు, సాక్సులు మరియు బెల్టుల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మరియు పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొంగల గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి ఆలం కళ్యాణి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ శ్రీమతి లేగల నాగరాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థినీ విద్యార్థులకు తమ చేతుల మీదుగా సంక్షేమ సామాగ్రిని అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. బాలాజీ, ఉపాధ్యాయ బృందం కె. చక్రధర్, టి. రమాదేవి, వై. సంజీవ రాణి, పి. శ్రీకాంత్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భువనగిరి వ్యవసాయ మార్కెట్ గోదాం నుంచే రేషన్ దందా...!

- పట్టణ శివారులోనే భారీ స్టాకు పాయింట్..!
- పీడీఎస్ బియ్యం తూకాలు..ప్యాకింగ్ లు అక్కడే..!
- చిన్న వ్యాపారులు ఏజెంట్ల నుంచి చేరుతున్న పిడిఎస్ రైస్..!
- అవసరానికి తగ్గట్టుగా చుట్టు పక్కల ప్రదేశాల్లో స్టాక్ పాయింట్లు..!
- పిడియోస్ బియ్యానికి జెఎస్ఆర్ బియ్యం పేరు..!
- జె ఎస్ ఆర్ బ్యాగులుగా మార్కెట్లోకి విడుదల..!
- రాత్రివేళల్లో గోదాం నుంచి లారీల్లో తరలింపు..!
- రైళ్లలోనూ మిల్లుల పేరుతో లోడింగ్..?
- వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హస్తం ఉందా..!
- ఛైర్మన్ కు తెలిసే ఇలా జరుగుతుందా..!
- చిన్న వ్యాపారులతో కుమ్మక్కైన భువనగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్..!
- పదుల సంఖ్యలో ఏజెంట్లతో రేషన్ డాన్ భారీ నెట్‌వర్క్..!
- బియ్యం స్మగ్లర్‌కు సలాం కొడుతున్న ఆఫీసర్లపై మన ప్రజావాణి ప్రత్యేక కథనం.








ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న పీడీఎస్ బియ్యం దందాపై వరుసగా వెలుగులోకి వస్తున్న సమాచారం కలకలం రేపుతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా భువనగిరిలో రేషన్ డాన్ లు ఎందరో.. భువనగిరి పట్టణ శివారులోని ఓ గోదాం నుంచే వ్యవహారం నడిపిస్తున్నట్లుగా తెలుస్తోంది. చిన్న వ్యాపారులు , పీడీఎస్ కలెక్షన్ ఏజెంట్లు తాము సేకరించిన పిడిఎస్ బియ్యాన్ని విడతల వారీగా గోదాంకు చేరుస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ స్టాక్‌ను తూకం వేసి సంచుల్లో నింపడం.. రాత్రివేళల్లో లారీలకు లోడ్ చేసి సరిహద్దులు దాటించడం జరుగు తున్నట్లు సమాచారం. లారీలతోపాటు కొన్ని సందర్భాల్లో మిల్లుల పేరుతో రైళ్లలోనూ బియ్యం లోడింగ్ చేస్తున్నట్లు తెలుస్తుండటం తో వ్యవహారం ఏ స్థాయి లో విస్తరించిందని తెలుస్తుండటం విస్తుగొల్పుతోంది. మరోవైపు ప్రధాన గోదాంకు స్టాక్ చేరక ముందే చిన్న మొత్తాల్లో నిల్వ చేసేందుకు పలు ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నట్లుగా సమాచారం

**చిన్న గోదాంలోనే తూకాలు..ప్యాకింగ్ లు...**

భువనగిరి పట్టణ శివారులోని గోదాంలో పీడీఎస్ బియ్యం చేరిన తర్వాత తూకం వేసి జె ఎస్ ఆర్ పేరుతో ఉన్న సంచుల్లో నింపుతున్నట్లు సమాచారం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే స్టాక్‌ను ఒకచోట చేర్చి , అవసరానికి అనుగుణం గా లారీలకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. పగటి సమయంలో పెద్ద మొత్తంలో కదలికలు లేకుండా , రాత్రివేళల్లో వాహనాలను సిద్ధం చేసి తరలించే విధానం కొన సాగుతున్నట్లు సమాచారం. గోదాంకు వచ్చే స్టాక్ , అక్కడి నుంచి బయటకు వెళ్లే వాహనాల వివరాలను పరిశీలిస్తే వ్యవహారం వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రధాన గోదాం ఒక్కటే కాకుండా రేషన్ డీలర్లు , పీడీఎస్ కలెక్షన్ ఏజెంట్లకు అనువుగా చిన్న మొత్తాల్లో బియ్యం నిల్వ చేసే పాయింట్లను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఆయా ప్రాంతాల్లో స్టాక్ సమ కూరిన తర్వాత పరిస్థితిని బట్టి భువనగిరి పట్టణ శివారులోని గోదాంకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకేసారి పెద్ద మొత్తంలో బియ్యం ఒకచోట కనిపించకుండా విడతల వారీగా తరలింపు సాగుతున్నట్లు సమాచారం. ఇదంతా బోనగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కు తెలిసి జరుగుతుందా.. తెలవకుండా జరుగుతుందా..! అన్నది చర్చనీయాంశంగా మారింది. చిన్న వ్యాపారులతో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుమ్మక్కై ఇదంతా చేస్తున్నట్లు సమాచారం తెలుస్తుంది.. ఇది వాస్తవమా కాదా అనేది సివిల్ సప్లై అధికారులు తేల్చాల్సిన విషయం. అయితే , ఇప్పుడు ఈ స్టాక్ ఈ పాయింట్లు ఎక్కడున్నాయి..? వాటిలో ఎంత స్టాక్ నిల్వ చేస్తున్నారు..? ఎవరి ఆధ్వర్యంలో నడుస్తున్నాయి..? అనే వివరాలు బయటకు వస్తే నెట్‌వర్క్ విస్తృతి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**మిల్లును వదిలి..ఏజెంట్ల వ్యవస్థ...!**

గతంలో సదరు రేషన్ స్మగ్లర్ ఓ మిల్లును లీజుకు తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆ మిల్లును వదిలేసి పదుల సంఖ్యలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్టాక్ సేకరణ బాధ్యతలను ఏజెంట్లకు అప్పగించి , అవసర మైనప్పుడు వాటిని ప్రధాన గోదాంకు చేరుస్తున్నట్లు సమాచారం. దీంతో ఒకే కేంద్రం నుంచి మొత్తం వ్యవహారం నడిపిన పాత విధానానికి బదులుగా విస్తృత ఏజెంట్ నెట్‌వర్క్ ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ ఏజెంట్ల వివరాలు , వారి ఆధీనంలోని స్టాక్ పాయింట్లు గోదాంకు పంపుతున్న పరిమాణాల పై సివిల్ సప్లైస్ శాఖ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**రాత్రి వేళలో లోడింగ్ కు సిద్ధం..మాకు ఎవరు అడ్డం...?**

గోదాంలో బియ్యం తూకం , ప్యాకింగ్ పూర్తయిన తర్వాత రాత్రివేళల్లో లారీలకు బియ్యం లోడ్ చేస్తున్నట్లు సమాచారం. పగటిపూట సేకరణ , నిల్వ ప్రక్రియ సాగుతుండగా రాత్రి వేళల్లో రవాణాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. లారీల రాకపోకలు , లోడింగ్ సమయాలు , వాహనాల రిజిస్ట్రేషన్ వివరాలు , గోదాం పరిసరాల్లోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి బయటపడే అవకాశం ఉంది. అయితే కెమెరాలు పనిచేస్తున్నాయా..లేదా అనేది కూడా చూడాలి. ఒకవేళ లోడింగ్ సమయంలో కెమెరాలు ఆఫ్ లో ఉన్నాయా.. ఆన్ లో ఉన్నాయా పక్కాగా పరిశీలించాలి. ముఖ్యంగా ఒకే ప్రాంతం నుంచి నిరంతరంగా వాహనాలు కదులుతున్నట్లయితే వాటిపై సంబంధిత శాఖలు ఎలాంటి చర్యలు తీసుకున్నాయన్నది ప్రశ్నగా మారుతోంది.

లారీల ద్వారా మాత్రమే కాకుండా కొన్ని సందర్భాల్లో మిల్లుల పేరుతో రైళ్లలోనూ బియ్యం లోడింగ్ చేసి మహారాష్ట్రలోని చంద్ర పూర్ , బల్లార్షా ప్రాంతాలకు తర లిస్తున్నట్లు సమాచారం. సిర్పూర్ నుంచి రైళ్ల ద్వారా రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది. జె ఎస్ ఆర్ పేరుతో ప్యాకింగ్ అయిన బ్యాగుల పేరుతో రవాణా చేస్తున్నట్లయితే సంబంధిత మిల్లుల స్టాక్ రిజిస్టర్లు , రవాణా అను మతులు , బిల్లులు , లోడింగ్ వివరాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది. వాస్తవంగా ఏ మిల్లుకు సంబంధించిన బియ్యం..? పీడీఎస్ స్టాక్ ఎలా ఆ సరఫరా గొలుసులోకి చేరింది..? అనే అంశాలపై రికార్డుల ఆధారంగా విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

**సహకారం ఎవరిది..?**

భువనగిరి శివారులో గోదాం , దానికి అను సంధానంగా చిన్న స్టాక్ పాయింట్లు , వాటి నుంచి బియ్యం సేకరించే ఏజెంట్లు , అక్కడి నుంచి రాత్రివేళల్లో రవాణా..ఇలా దశలవారీ వ్యవస్థ ఉన్నట్లు సమాచారం వస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల నిఘా ఎంతవరకు ఉందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ముఖ్యంగా రేషన్ డీలర్ల స్థాయిలో బియ్యం సేకరణ , మధ్యంతర స్టాక్ పాయింట్లు , ప్రధాన గోదాం , లారీ లోడింగ్ , రైలు రవాణా వరకు ప్రతి దశలో రికార్డులను పరిశీలించాల్సి ఉంది. సదరు స్మగ్లర్‌కు గతంలో సహకరించని పోలీసు లను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర ఉందని స్థానికంగా ప్రచారంలో ఉంది. ప్రస్తుతం ఉన్నత స్థాయి పోలీసు అధికారుల తోనూ సంబంధాలు ఉన్నట్లు సమాచారం వినిపిస్తోంది..? అయితే ఈ అంశాన్ని అధికారికం గా నిర్ధారించే ఆధారాలు అందుబాటులో లేవు. అయినప్పటికీ ఒకవేళ పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యం రవాణా జరుగు తున్నట్లయితే పోలీసు శాఖకు చెందిన నిఘా విభాగాలు , స్థానిక పోలీసులు ఇప్పటివరకు గుర్తించిన వివరాలేమి టన్నది ప్రశ్న. గోదాం , వాహనాలు , రాత్రివేళల్లో జరిగే కదలికలపై సమాచారం ఉన్నా చర్యలు ఎందుకు కనిపించడం లేదన్న దానిపైనా స్పష్టత రావాల్సి ఉంది.

**సివిల్ సప్లైస్ అధికారుల నిఘా ఎక్కడ...?**

పీడీఎస్ బియ్యం సేకరణ, నిల్వ , తరలింపు మొత్తం వ్యవహారం సివిల్ సప్లైస్ శాఖ పరిధిలోనూ కీలకంగా ఉంటుంది. రేషన్ డీలర్ల వద్ద పంపిణీ రికార్డులు , లబ్ధిదారులకు అందిన పరిమాణం , మిగిలిన స్టాక్ , ఏజెంట్ల కదలికలు , గోదాం వద్ద జరుగుతున్న తూకాలు , ప్యాకింగ్ వంటి అంశాలను పరస్పరం సరిపోల్చితే లెక్కల్లో తేడాలు బయట పడే అవకాశం ఉంది. భువనగిరి పట్టణ శివారులోని గోదాం , అను మానిత స్టాక్ పాయింట్లపై తనిఖీలు చేపట్టి వాస్తవ పరిస్థితిని అధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది. కేవలం పట్టుబడిన బియ్యంతోనే వ్యవ హారాన్ని ముగించకుండా, సేకరణ నుంచి తుది రవాణా వరకు ఉన్న గొలుసును ఛేదించాల్సి ఉంది. శివారులోని గోదాం , అక్కడ జరిగే తూకాలు , స్టాక్ పాయింట్లు , ఏజెంట్ల వ్యవస్థ , రాత్రివేళల్లో జరిగే లోడింగ్ వంటి అంశాలను వారు వివరించారు. స్మగ్లర్‌కు ఎవరి నుంచి సహకారం అందుతోంది..? ఎవరు అతడి నెట్‌వర్క్‌లో కీలకంగా వ్యవహ రిస్తున్నారు..? అనే వివరాలను కూడా తమకు తెలిసిన మేరకు అంద జేస్తున్నారు. ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన కొత్త సమాచారం ప్రకారం పీడీఎస్ బియ్యం దందాలో ప్రధానంగా కనిపిస్తున్నది..! భువనగిరి శివారులోని గోదాం , దానికి అనుసంధానమైన చిన్న స్టాక్ పాయింట్లు , వాటిని కలుపుతున్న ఏజెంట్ల వ్యవస్థతో పక్కా నెట్వర్క్‌ను స్మగ్లర్ ఏర్పాటు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ మూడు దశలపై సమగ్ర తనిఖీ జరిగితేనే దందా అసలు పరిమాణం స్పష్టమయ్యే అవకాశం ఉంది. గోదాంలో తూకం వేసిన బియ్యం ఎంత..? ఏ ప్రాంతాల నుంచి వచ్చింది..? ఎవరెవరు తెచ్చారు..? ఎన్ని వాహనాల్లో బయటకు వెళ్లింది..? రైళ్లలో ఏ పేరుతో లోడింగ్ చేశారు..? అన్న రికార్డులను అధికారులు పరిశీలించాల్సి ఉంది. యథేచ్ఛగా సాగుతున్నట్లు వస్తున్న సమాచారానికి తెరదించాలంటే పోలీసు, సివిల్ సప్లైస్ శాఖలు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అసలు గోదాం నుంచి బయటకు వెళ్తున్న ప్రతి సంచి లెక్క తేలితేనే.. ఈ దందా వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్ ఎంత పెద్దదో స్పష్టమవుతోంది.

# రజకుల హక్కుల సాధనకై ఐక్యంగా కదలాలి.. రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక

- యూత్ అధ్యక్షుడు చింతకింది కర్ణాకర్
- 4వ మహాసభను విజయవంతం చేద్దాం: జంగపల్లి ఐలయ్య
- రాయపోలు మండల నూతన కమిటీ ఎన్నిక
- మండల అధ్యక్షులుగా వడ్లకొండ బిక్షపతి ఎన్నిక



**రాయపోలు: 23 సెప్టెంబర్ (ప్రజావాణి):**రజక కులవృత్తిదారుల సంక్షేమం, హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి నిరంతరం ఉద్యమిస్తోందని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య అన్నారు. రాయపోలు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో త్వరలో సిద్దిపేట జిల్లా లో జరగనున్న తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి 4వ మహాసభకు రజకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు, ఐలయ్య జిల్లా యూత్ అధ్యక్షులు కర్ణాకర్ అధ్యక్షతనలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ చిన్నరంగారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిటి రాజు లు హాజరై మాట్లాడారు... ఐక్యతే మన బలంగా హక్కుల సాధనే మన లక్ష్యంగా రజకుల అభ్యున్నతే మన ధ్యేయంగా సమాజ సంక్షేమం కోసం సమిష్టిగా ముందుకు సాగాలని రాష్ట్ర అధ్యక్షులు, గోపి రజక, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ లు అన్నారు. తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం లో నాలుగో మండల కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో నాలుగో మహాసభ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఉన్న 26 మండలాల కమిటీలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు ఇప్పటివరకు 4 మండల కమిటీలు పూర్తి చేయడం జరిగిందని జిల్లాలో ఉన్న రజకుల సభ్యులు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని నాలుగో మహాసభను విజయవంతం చేయాలని వారు అన్నారు..

రాయపోల్ మండల నూతన కమిటీ అధ్యక్షులుగా వడ్లకొండ బిక్షపతి (ఎల్కల్), యూత్ అధ్యక్షులు చాకలి రాము (రాం సాగర్) ఉపాధ్యక్షులుగా చెప్యాల్ స్వామి (రాయపోల్), తిమ్మరాజు నరసయ్య (వీర్ నగర్) వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ కృష్ణ (రాయపోల్) ప్రధాన కార్యదర్శిగా పరికిబండ మల్లేశం (బేగంపేట) కార్యదర్శిగా నవీన్ (రాయపోల్) సంయుక్త కార్యదర్శిగా రాచకొండ రవి (అనాజిపూర్) కోశాధికారిగా పీర్లపల్లి సాయికుమార్ (చిన్న మసాన్ పల్లి), మండల ఇంచార్జ్ వడ్లకొండ నర్సింలు (రామారం) మండల కన్వీనర్ కొట్టాల నర్సింలు (వడ్డేపల్లి) నియమిస్తూ నియామక పత్రాలు అందజేసి నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల రజకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీతను సన్మానించిన సాయి గ్రామర్ స్కూల్ అధ్యాపక బృందం



**చిలుకూరు సెప్టెంబర్ 23(ప్రజావాణి):** రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తమ ప్రధానోపాధ్యాయులు గా అవార్డు పొందిన సలీం షరీఫ్ ను చిలుకూరు సాయి గ్రామర్ స్కూల్ అధ్యాపక బృందం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు మాట్లాడుతూ నిబద్ధత కలిగిన వ్యక్తి విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో అగ్రగణ్యులు పాఠశాల ఎన్రోల్మెంట్ పెంచి ఎందరో ఉపాధ్యాయులకు బాసటగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దీప్తి,ఉమ, లావణ్య,అరుణ, ఇందిర, అనూష,ఇందుమతి లు పాల్గొన్నారు.

# మోడీ ఫాసిజానికి, ట్రంప్ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

- పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు



**కొత్తగూడ మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 23. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, బుధవారం రోజున పాకాల్ కొత్తగూడ మండల కేంద్రం లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు), అఖిల భారత ఐక్య రైతు కూలి సంఘం (ఎ.ఐ.పి.కె.ఎమ్.ఎస్), ప్రగతిశీల యువజన సంఘం (పి.వై.ఎల్) ఆధ్వర్యంలో, భారత జాతీయోద్యమ వీరుడు షాహిద్ భగత్ సింగ్ 119వ జయంతి వారోత్సవాలు (సెప్టెంబర్ 22 నుండి 28 వరకు) పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలతో ఘనంగా నివాళులు అర్పించారు. తధానంతరం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహా రావు, జిల్లా సహాయ కార్యదర్శి అలువాల నరేష్, ఎ.ఐ.పీ.కె.ఎం.ఎస్. జిల్లా ఉపాధ్యక్షులు మీసాల పాపన్న, పిన్నింటి నారాయణ రెడ్డి, పి.వై.ఎల్. జిల్లా నాయకుడు రాజు లు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత జాతీయోద్యమ వీరుడు షాహిద్ భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి నేటి విద్యార్థి, యువతకు మార్గదర్శకం కావాలని, దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిజానికి, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న యుద్ధోన్మాద చర్యల కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపును ఇచ్చారు. 80 సంవత్సరాల స్వాతంత్ర్య భారత దేశంలో పేదలందరికీ ఉచితంగా నాణ్యమైన సమాన విద్య, వైద్యం, అందించటంలో, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాటం లో పాలకవర్గాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న విద్యార్థుల 1200 కోట్ల రూపాయల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చేయకపోవడంతో, ఉన్నత చదువులు అర్థాంతరంగా మధ్యలోనే వదిలేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్కాలర్షిప్ బకాయిలు అడిగిన ప్రైవేట్ విద్యా సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులు, విజిలెన్స్ అధికారులచే దాడులకు పాల్పడటం సిగ్గుచేటు అన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కుల, మతోన్మాద చర్యలతో దేశ లౌకిక వ్యవస్థ, ప్రజల ఐక్యత ప్రమాదంలో పడిందన్నారు. పాలస్తీనా,క్యూబా ప్రజల న్యాయమైన పోరాటాలకు దేశ ప్రజలంతా సంఘీభావంగా నిలబడాలని, ఇజ్రాయిల్, అమెరికా యుద్ధోన్మాద చర్యలను నిరసించాలని, దేశంలో సామ్రాజ్యవాద పెట్టుబడిదారుల ఆర్థిక దోపిడీకి వత్తాసు పలుకుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. కొత్తగూడ మండల నాయకులు ప్రేమ్ కుమార్, డి.అనిల్, జి. అరవింద్, జి. కార్తీక్, మహేష్, రాజేష్, నవీన్, సాయి, విష్ణువర్ధన్, రాజు, కిరణ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# గరిడేపల్లి మండల కేంద్రంలో ఘనంగా గణేష్ నిమజ్జనం

- రచ్చబండ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిమజ్జనోత్సవం
- భజనలు, భక్తిగీతాల నడుమ సందడిగా సాగిన శోభాయాత్ర





**గరిడేపల్లి, సెప్టెంబరు 23 (ప్రజావాణి):** గరిడేపల్లి మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. రచ్చబండ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో భాగంగా గణేష్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల మధ్య శోభాయాత్రగా తరలించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, భక్తిగీతాలు ఆలపిస్తూ గణపయ్యను స్మరించుకున్నారు. యువత, పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మహిళల భజనలు, భక్తిగీతాలు శోభాయాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. "గణపతి బప్పా మోరియా" నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు. రచ్చబండ గణేష్ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. నవరాత్రుల సందర్భంగా గణపయ్యను భక్తిశ్రద్ధలతో పూజించిన భక్తులు, నిమజ్జన కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహించి గణనాథుడికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రచ్చబండ గణేష్ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, చిన్నారులు, పెద్దలు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిపిఓ నరసింహస్వామిని ఉద్యోగం నుండి సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులకు బాధితుడి ఫిర్యాదు

- జిపిఓ లీలలు.. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ భూ ఆక్రమణలు, కోర్టు వారెంట్!
- విధులు మాదన్నపేటలో.. ఆగడాలు చెన్నారావుపేటలో!
- రెండు క్రిమినల్ కేసులు నమోదైనా ఖాతరు చేయని అధికారి
- కోర్టు ఆదేశాలతో ఎన్‌బిడబ్ల్యు జారీ.. నర్సంపేట కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు









**చెన్నారావుపేట సెప్టెంబర్ 23 ప్రజావాణి** ప్రజలకు సేవ చేయాల్సిన ఒక ప్రభుత్వ అధికారి, తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని భూ ఆక్రమణలకు పాల్పడడమే కాకుండా, కోర్టు ఆదేశాలను కూడా బేఖాతరు చేసిన ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. మాదన్నపేట గ్రామంలో జిపిఓ గా పనిచేస్తున్న చెన్నారావుపేట గ్రామానికి చెందిన చెలుకలపెల్లి నరసింహస్వామి అనే అధికారిపై శాఖాపరమైన తీవ్ర చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. ?అసలేం జరిగింది? చెన్నారావుపేట గ్రామానికి చెందిన బాధితుడు చెలుకలపెల్లి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారావుపేట మండల పరిధిలోని తన సొంత వ్యవసాయ భూమిలోకి జిపిఓ నరసింహస్వామి అక్రమంగా ప్రవేశించి, ఆక్రమించుకోవడానికి యత్నించారని ఆరోపించారు. ఈ అక్రమాలపై చెన్నారావుపేట పోలీసు స్టేషన్‌లో ఐపిసి 447, 427 సెక్షన్ల కింద రెండు విడివిడి క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. క్రిమినల్ కేసులు నమోదైనప్పటికీ చట్టాన్ని గౌరవించకుండా, సదరు విఆర్వో కోర్టు విచారణకు హాజరుకాకుండా నిర్లక్ష్యం వహించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన నర్సంపేట అడిషనల్ జెఎఫ్‌సిఎమ్ న్యాయస్థానం ఆయనపై నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్ బిడబ్ల్యూ) జారీ చేసింది. ఈ వారెంట్ ఆధారంగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని 21.09.2026 నా కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన జిపిఓ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ, క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని కోర్టు వారెంట్లు ఎదుర్కొంటున్నాడని బాధితుడు వాపోయారు. సర్వీస్ ప్రవర్తనా నియమావళిని తీవ్రంగా ఉల్లంఘించిన ఈ అధికారిపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత కోర్టు ఉత్తర్వులు, ఎఫ్ఐఆర్ కాపీలతో ఉన్నతాధికారులకు బాధితుడు రాజు ఫిర్యాదు చేశారు.



To
The Revenue Divisional Officer
Narsampet.

Subject:-Request for verification of criminal cases pending against Sri Chelukalapelly Narasimha Swamy, S/o Mallaiah, Age: 43 years, Caste: Mudiraj, Occupation: GPO, Madannapeta Village, R/o Chennaraopet Village and Mandal, and for taking appropriate departmental action as per the rules - Regarding.

Respected Sir,

I respectfully submit that Sri Chelukalapelly Narasimha Swamy, S/o Mallaiah, working as GPO at Madannapeta Village, has been involved in disputes relating to agricultural land situated in Chennaraopet Mandal. The said Sri Chelukalapelly Narasimha Swamy allegedly entered into my agricultural land without my consent and interfered with my possession and enjoyment of the said land. In connection with the said incidents, two criminal cases were registered against him at PS Chennaraopet, as detailed below.

3. Cr.No.63/2021, U/Sec. 447, 427 IPC of PS Chennaraopet.
4. Cr.No.134/2022, U/Sec. 447, 427 IPC of PS Chennaraopet.

It is further submitted that the said Sri Chelukalapelly Narasimha Swamy failed to appear before the Hon'ble Court in the above case(s) and, consequently, the Hon'ble Court issued a Non-Bailable Warrant (NBW) against him. Pursuant to the said warrant, he was produced before the Hon'ble Additional JFCM Court, Narsampet, on 21.09.2026.

In view of the above facts, I respectfully request the competent authority to kindly verify the criminal case records, details of the court proceedings, and particulars of the Non-Bailable Warrant (NBW) issued by the competent court, and to take appropriate action, under the applicable service and disciplinary rules.

I further request that appropriate action may kindly be taken by the competent authority if, upon verification of the facts and records, any misconduct or violation of the applicable conduct/service rules is found.

Copies of the relevant available records are enclosed herewith for verification and necessary action.

Yours faithfully,
Ch Raj
Chelukalapelly Raju
R/o.Chennaraopet
Cell: 7032694864

Enclosures:
3. Copy of FIRs in Cr.Nos.63/2021 and 134/2022 of PS Chennaraopet
4. Copy of the relevant Hon'ble Court order/NBW.

22/09/2026

# భక్తిశ్రద్ధలతో 10వ రోజుకు చేరిన శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు....



**రాయపోల్, సెప్టెంబర్ 23(ప్రజావాణి)** రాయపోల్ ముదిరాజ్ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సిద్ధి వినాయక స్వామివారి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సభ్యులు ఆధ్వర్యంలో అరికెలస్వామి కుటుంబ సభ్యులు భక్తులు ఉత్సవాలకు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాయపోల్ గ్రామానికి చెందిన భజన సంగం సభ్యులు భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు కార్యక్రమాన్ని నిర్వహించారు..

# అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందాం..

- హనుమాన్ నగర్ తండ గ్రామసభలో సర్పంచి అశోక్ కుమార్

**ప్రజావాణి,నెల్లికుదురు:** హనుమాన్ నగర్ తండాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని దీని కోసం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు సర్పంచి గుగులోతు అశోక్ కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని హనుమాన్ నగర్ తండాలో సర్పంచ్ అశోక్ కుమార్ అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తండా పరిధిలోని వివిధ తండాలలోని సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా అన్ని సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. చెర్లలక్ష్మి తండాలో కరెంటు,రోడ్డు సమస్య గ్రామ సభ దృష్టికి తీసుకురాగా స్తంభాలు త్వరలోనే వేయించి లైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు సమస్య కూడా ఎమ్మెల్యేతో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పనిచేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కోసం దాతల నుంచి స్థలం సేకరించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. పల్లెదవాఖాన మంజూరు కాగానే హనుమాన్ నగర్ తండాలోనే ఏర్పాటు చేయాలని కోరగా ఆ సమస్యను కూడా అందరితో కలిసి సమన్వయంతో పరిశీలిద్దామని సర్పంచి చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు,ఉపసర్పంచి శ్రీలత యాకు, వార్డు సభ్యులు సోమ్లు,రఘుపతి,రజిత,సక్కు, రమ్య,రవి తండావాసులు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో పార్కల గండి గిరిజన ఆశ్రమ పాఠశాల!

- 500 మంది విద్యార్థులకు సరిపడని డైనింగ్ హాల్
- కురుస్తున్న కిచెన్ షెడ్.. ప్రాథమిక విద్యార్థులకు టాయిలెట్ల కొరత



**దమ్మపేట, సెప్టెంబర్ 23 (మన సమగ్ర ప్రజావాణి):** గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రాథమిక వసతులు కల్పించాల్సిన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్ర సమస్యగా మారింది. దమ్మపేట మండలం పార్కలగండి గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సుమారు 500 మంది హాస్టల్ విద్యార్థులు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

500 మందికి.. 100 మందికే డైనింగ్ హాల్!

ఆశ్రమ పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు ఉండగా, కేవలం 100 మందికి మాత్రమే సరిపడే డైనింగ్ హాల్ ఉంది. దీంతో మిగిలిన విద్యార్థులు ఒకేసారి భోజనం చేయడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. వర్షం కురిసిన సమయంలో విద్యార్థులు తడుస్తూనే భోజనం చేయాల్సి వస్తోందని వారి తల్లిదండ్రులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న డైనింగ్ హాల్ కూడా చిన్నపాటి వర్షానికే కురుస్తుండటంతో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విశాలమైన, సురక్షితమైన డైనింగ్ హాల్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వర్షంలోనే వంట.. కురుస్తున్న కిచెన్ షెడ్:

పాఠశాల కిచెన్ షెడ్ పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. చిన్నపాటి వర్షానికే కిచెన్ షెడ్‌లోకి నీరు చేరుతుండటంతో వంట సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురుస్తున్న సమయంలోనే వంట చేయాల్సి వస్తుండటంతో విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిచెన్ షెడ్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టాయిలెట్లు ఏవీ?

అదే క్యాంపస్‌లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు బాలురు, బాలికలకు ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. అయితే చిన్నారుల అవసరాలకు అనుగుణంగా తగినన్ని టాయిలెట్లు లేకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది. బాలురు, బాలికలకు ప్రత్యేకంగా పరిశుభ్రమైన మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. చిన్నారుల ఆరోగ్యం, పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల ప్రాంగణంలో తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రత సదుపాయాలను మెరుగుపరచాలని కోరుతున్నారు.

గ్రామసభలో అధికారుల దృష్టికి సమస్యలు:

ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న ఈ సమస్యలను 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన గ్రామసభలో ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. గిరిజన విద్యార్థులు చదువుకుంటున్న ఆశ్రమ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేకపోవడం పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొత్త డైనింగ్ హాల్ నిర్మాణం, కిచెన్ షెడ్ మరమ్మతులు, బాలబాలికలకు ప్రత్యేక టాయిలెట్ల ఏర్పాటు వంటి పనులను అత్యవసరంగా చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సహజమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, కనీస మౌలిక సదుపాయాలు అందేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు సూచనలు



**దండేపల్లి, సెప్టెంబర్ 23 (సక్రమ ప్రజావాణి):** వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి రైతు తన పొలంలో నీటి గుంత తవ్వుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని వి.బి.జి. రాంజీ మండల అధ్యక్షుడు కొల్లూరి సతీష్ సూచించారు. ఆయన సూచన మేరకు కొండాపూర్‌కు చెందిన యువరైతు సీపతి సతీష్ తన పొలంలో నీటి గుంత తవ్వుకునేందుకు ముందుకు వచ్చారు. రైతుల చొరవను గ్రామస్తులు అభినందించారు. తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

# నల్కి వెంకటాపూర్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్, వాటర్ బాటిల్స్, బ్యాట్స్, కంపాస్ బాక్సుల పంపిణీ



**దండే పెల్లి సెప్టెంబర్ 23 (ప్రజావాణి )** గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలుస్తూ, వారిని చదువులో ప్రోత్సహించాలనే లక్ష్యంతో గుమ్మడి రాజలింగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్కి వెంకటాపూర్ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, వాటర్ బాటిల్స్, బ్యాట్స్, కంపాస్ బాక్సులు, ఎగ్జామ్ ప్యాడ్స్ తదితర సామగ్రిని అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, నిరుపేద విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు ప్రోత్సాహం కల్పించడమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు. విద్యా సామగ్రి అందుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయగా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి రాజలింగు ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ గుమ్మడి కిరణ్, జిసిసి చైర్మన్ కొట్నాక తిరుపతి, డిసిసి ఉపాధ్యక్షులు ముద్దసాని వేణు, పీఏసీఎస్ డైరెక్టర్లు అద్దె కాంతారావు, కారుకూరి సత్తయ్య, ఉప సర్పంచ్ తిరుపతి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కంది సతీష్, నాగమల్లు, కొత్తపెల్లి నర్సయ్య, పీడీఎస్‌యూ నాయకులు పిట్టల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

## భజనలు నృత్యాల మధ్య గంగమ్మ వడిలోకి చేరిన గణపయ్య..





**ప్రజావాణి,ఇనుగుర్తి:** సర్వ విజ్ఞానం తొలగించే విఘ్నేశ్వరుడు భక్తులచే తొమ్మిది రోజులు విశేష పూజలు అందుకుని బుధవారం గంగమ్మ ఒడికి చేరారు. మండల కేంద్రం వెన్నుగొడితే తో పాటు వివిధ గ్రామాలలో సంబంధిత విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు గణపతి పప్పా మోరియా అంటూ పెద్ద పెట్టున అంటూ ఉండగా స్వామి వారిని నిమజ్జనం చేశారు. మండలంలోని చిన్ననాగారం హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జన శుద్ధ యాత్ర వైభవోపేతంగా అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భగవద్భక్తులైన గ్రామంలోని మహిళలు స్వామివారి రథం ముందు భజనలు కీర్తనలు ముత్యాలతో విఘ్నేశ్వరుని ఆనందింపజేస్తూ జనానికి వెళ్తున్న తీరు గ్రామస్తులను ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యులతో పాటు యువకులు అన్ని వర్గాల వారు శోభాయాత్రలో పాల్గొన్నారు. భక్తులు మంగళహారతులు పూజా ద్రవ్యాలను తీసుకొచ్చి స్వామివారిని దర్శించుకుని పులకించి,తరించి పోయారు. గ్రామంలోని స్టూడెంట్ యూత్,ముత్యాలమ్మ తల్లి యూత్, కొత్త వాడకు చెందిన గణపతులు, ఎర్రబెల్లి శ్రీనివాసరావు ఆవరణంలోని విఘ్నేశ్వరుని అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయ కమిటీల యువకులతో పాటు వివిధ వర్గాల ప్రజలు స్వామివారి శోభాయాత్రల లో పాల్గొని నిమజ్జనాలను ప్రశాంతంగా పరిసమాప్తం చేశారు.

## అంబరాన్నంటిన గణపయ్య నిమజ్జనోత్సవం!

- కన్నుల పండువగా శోభాయాత్ర



**చెన్నారావుపేట సెప్టెంబర్23 ప్రజావాణి** చెన్నారావుపేట మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న విఘ్నేశ్వరుడికి బుధవారం భక్తులు అత్యంత వైభవంగా నిమజ్జన వీడ్కోలు పలికారు. రంగురంగుల కాగితాలు, విద్యుత్ వెలుగులు, పూల మాలలతో అలంకరించిన వాహనాలపై లంబోదరుడిని ఉరేగించారు. ఊరేగింపు సాగిన దారి పొడవునా భక్తులు గణపయ్యకు బ్రహ్మరథం పట్టారు. 'జై గణపతి... జై జై గణపతి'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు, యువతీయువకులు చేసిన భక్తిపూరిత నినాదాలతో ఊరూవాడా మార్మోగింది. తీన్మార్ డ్యాన్సులు, ప్రత్యేక డోల్, బ్యాండ్, డప్పుల చప్పుళ్లతో వీధులన్నీ కోలాహలంగా మారాయి. మహిళల కోలాటాలు, చిన్నారుల కేరింతలు, బాణసంచా తారాజువ్వల నడుమ పండగ వాతావరణం ఉరిమేసింది. ఊరేగింపు అనంతరం స్థానిక వాగులు, చెరువులు, బావుల్లో స్వామివారిని నిమజ్జనం చేశారు. 'పోయిరా గణపయ్యా.. పోయిరా' అంటూ భక్తులు బొజ్జ గణపయ్యను గంగమ్మ ఒడికి చేర్చి శోభాయాత్రను దిగ్విజయంగా ముగించారు.

## విద్యా భారతి పాఠశాలలో ఆర్వో వాటర్ ప్యూరిఫై ప్రారంభం

- విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం.. పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు పాఠశాల యాజమాన్యం చర్యలు







**నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, సెప్టెంబర్ 24:--** నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని పల్సి గ్రామంలో ఉన్న విద్యా భారతి పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మంచినీటి కోసం ఆర్వో వాటర్ ప్యూరిఫైను బుధవారం పాఠశాల ప్రిన్సిపల్ పోతన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ఆర్వో వాటర్ ప్యూరిఫై ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సుకు పాఠశాల యాజమాన్యం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండటం విద్యార్థుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యమే తమ ప్రథమ బాధ్యత అని తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోతన్న, లక్ష్మ మధుసూదన్, కొట్టే ప్రవీణ్, రాజు, సాయినాథ్, దేవేందర్, దేవకి, సరస్వతి, రాణి, శృతిక, పద్మ, నేహ, గంగావేణి, లక్ష్మి, కవిత, గంగామణితో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజారాంపేట"వినాయకుడి లడ్డు పాట 80000

- లడ్డు పాట కైవసం చేసుకున్న కంటు రామయ్య మనవళ్ళు



**నేలకొండపల్లి సెప్టెంబర్ 23 బుధవారం** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధిలోని రాజారాంపేట గ్రామపంచాయతీలో ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహం వద్ద బుధవారం ప్రతిష్టాత్మకంగా లడ్డుపాట నిర్వహించారు. ఈ లడ్డు పాటలో గ్రామానికి చెందిన కంటూ రామయ్య మనవళ్లు కంటూ వీరస్వామి కంటూ రామకృష్ణ కంటూ వెంకటేశ్వర్లు కంటూ ఉమామహేశ్వరరావు లు 80 వేల రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బోనాల వెంకటేశ్వర్లు కంటు గోపి శాసనాల శ్రీను బోళ్ళ వంశీ గ ణవరపు వీరబాబు కం టు బ్రహ్మం గ్రామస్తులు వార్డు మెంబర్లు భక్తులు పాల్గొన్నారు. కాగా పెన్ను పాటను గోనెల ఉపేందర్ 16,500 రూపాయలకు దక్కించుకున్నారు.

# పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డల ఆరోగ్యం..

- గజ్వేల్ ప్రాజెక్ట్ సిడిపిఓ సరిత.




**రాయపోల్ సెప్టెంబర్ 23.(ప్రజావాణి)**పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డలు సురక్షితంగా ఉంటారని రాబోయే తరం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కావాలంటే గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారం తప్పనిసరిగా అవసరమని గర్భిణులకు పుట్టబోయే బిడ్డ సురక్షితంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలని గజ్వేల్ ప్రాజెక్ట్ సిడిపిఓ సరిత అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రం అంగన్వాడి కేంద్రంలో సెక్టర్ స్థాయి పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారం పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం పోషణ్ అభియాన్ లో భాగంగా సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషకాహార మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. పోషకాహార లోపంలేని గ్రామాల లక్ష్యంగా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తుందన్నారు.తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం గురించి వివరించడం జరిగింది. గర్భిణీ మొదటి రోజు నుంచి వెయ్యి రోజుల వరకు పోషకాహార ప్రాముఖ్యత వివరిస్తూ ప్రతినెల తల్లి బిడ్డల బరువులు, ఎత్తులు తూచి పోషకాహార లోపం ఉంటే వైద్యుల సూచన మేరకు వారికి అదనంగా పోషకాహారం అందజేసి సాధారణ స్థితికి తీసుకురావడానికి అంగన్వాడి టీచర్లు ప్రత్యేక చొరవ తీసుకుంటారన్నారు. గర్భిణీ, బాలింత మహిళలు అందరూ తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని, అప్పుడే పండంటి బిడ్డకు జన్మనిస్తారని, బిడ్డకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా జన్మించాలంటే తల్లి తప్పనిసరిగా పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు ఎల్లప్పుడూ వైద్యుల సూచనల మేరకు ఆరోగ్య ఆహార నియమాలను పాటించాలన్నారు. ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలలో గర్భిణులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని,ప్రతి ఒక్కరు రోజు పౌష్టికాహారం తీసుకోవాలని, పౌష్టికాహారం వలన కలిగే ఉపయోగాలపై గర్భిణీ,బాలింత స్త్రీలందరికీ అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ముఖ్యంగా గర్భిణీ మహిళలు ఈ సమయంలో ఎలాంటి మానసిక ఒత్తిడులకు గురి కావద్దని, ఆరోగ్యానికి హాని కలిగించే ఏ పని చేయకూడదని, ఎల్లప్పుడూ సంతోషంగా ఉన్నట్లయితే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా జన్మిస్తారని తెలియజేశారు. ప్రతి మహిళకు జీవితంలో అమ్మ అని పిలిపించుకోవాలని ఎంతో కుతూహలంగా ఉంటుందని అమ్మతనం అనేది ఎంతో అద్భుతమైనదన్నారు. కాబట్టి గర్భిణీలు అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటూ పండంట బిడ్డకు జన్మనివ్వాలని సూచించారు. అలాగే గర్భిణీ మహిళలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించి పోషణ ప్రతిజ్ఞ చేపించారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ షబానా, ఉప సర్పంచ్ హనుమంతు రాజు,రాయపోల్ సెక్టార్ అంగన్వాడి టీచర్లు, గర్భిణీ, బాలింత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- తెలంగాణ ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కోల శ్రీధర్ గౌడ్



**నంగునూరు, సెప్టెంబర్ 23:**తెలంగాణ ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నంగునూరు మండల కేంద్రానికి చెందిన కోల శ్రీధర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.రాష్ట్ర స్థాయిలో ఫోరం బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఫోరం నాయకులు ఆకాంక్షించారు.నియామక పత్రాన్ని అందుకున్న అనంతరం కోల శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీల ఉప సర్పంచులను సమన్వయం చేసుకుని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.గ్రామపంచాయతీల పరిపాలనలో ఉప సర్పంచులకు ఉన్న బాధ్యతలు, ప్రాధాన్యతపై అవగాహన కల్పించడంతో పాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత వేదికలపై ప్రస్తావిస్తానని తెలిపారు. ఉప సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను మండల, జిల్లా స్థాయిలో సేకరించి వాటిని రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని శ్రీధర్ గౌడ్ పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులతో కలిసి ఉప సర్పంచులు సమన్వయంతో పనిచేసేలా ప్రోత్సహిస్తానన్నారు. ఫోరం లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్రంలోని ఉప సర్పంచులు, ఫోరం నాయకుల సహకారం తీసుకుంటానని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహించి ఉప సర్పంచ్‌లకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్‌తో పాటు ఫోరం నాయకులు, రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌లకు శ్రీధర్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తన నియామకం పట్ల పలువురు నాయకులు, ఉప సర్పంచులు ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# పోషణ మాసోత్సవాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

- ఐ సి డి సి చేర్యాల ప్రాజెక్ట్ సి డి పి ఓ రమాదేవి
- అంగన్వాడి కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి ఎంపిడిఓ శ్రీనివాస్






**మద్దూరు సెప్టెంబర్ 23, ప్రజా వాణి,** మద్దూరు మండలంలోని లద్నూరు గ్రామ రైతు వేదికలో నిర్వహించిన పోషణ మాసోత్సవ కార్యక్రమంలో సీడీపీవో రమాదేవి,ఎంపిడిఓ శ్రీనివాస్ లు ముఖ్య అతిథిలుగా పాల్గొని పోషణ ప్రాధాన్యతపై మాట్లాడారు.గర్భిణులు, బాలింతలు,చిన్నారులు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఆమె తెలిపారు.చిన్నారుల ఎదుగుదలకు అవసరమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు.గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పోషకాహార లోపం వల్ల కలిగే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రతి కుటుంబంలో పెంపొందించాలని రమాదేవి సూచించారు. పోషణ మాసోత్సవాల ఉద్దేశం ప్రతి కుటుంబానికి పోషణపై అవగాహన కల్పించడమేనని తెలిపారు.అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. సర్పంచ్ కాసర్ల రేణుక కనకరాజు నూతనంగా గ్రామానికి వచ్చిన ఎంపిడిఓ శ్రీనివాస్ ను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపీఓ, ఏ పి ఓ మంజుల,గ్రామ సర్పంచ్ కాసర్ల రేణుక కనకరాజు, అంగన్వాడి సూపర్వైజర్ దేబోరరాణి,ఉప సర్పంచ్ శివ కుమార్, వార్డు సభ్యులు పాకాల శోభ, కొమ్ము భాస్కర్,పూల శరత్, మంజుల గోవింద్,సరస్వతి సుధాకర్, బిస్మా చారి,ఏ ఎన్ ఎం యాదమ్మ, ఆశా కార్యకర్తలు ప్రవళిక,పద్మ,అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లారం జీపీఓ ఇష్టారాజ్యం

- సర్టిఫికెట్ల జారీలో"నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైనం...?
- అనుకూలంగా ఉన్నవారికే ధ్రువపత్రాలా
- ధ్రువీకరణ పత్రాలు అడిగితే లోకల్ నాన్ లోకల్ అంటూ నిర్లక్ష్యం....?
- పైసలిస్తే పనులవుతాయా..? లేకుంటే పెండింగ్ లోనేనా...!






**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని ముదిగొండ మండలం మల్లారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీ వ్యవహారంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుకూలంగా ఉన్న వ్యక్తులకు ధ్రువపత్రాలు సులభంగా జారీ చేస్తున్నారని, ఇతరులు సర్టిఫికెట్ కోసం వెళ్తే మాత్రం నిబంధనల పేరుతో తిప్పి పంపుతున్నారని కొందరు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీ తీరు చర్చనీయాంశంగా మారింది.

**అడిగితే ఓ తీరు.. అనుకూలమైతే మరో తీరు**

సర్టిఫికెట్ కోసం కార్యాలయానికి వెళ్లే కొందరితో 'మీది ఇక్కడ కాదు' అన్నట్లుగా వ్యవహరిస్తూ వెనక్కి పంపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అవసరమైన ఆధారాలు ఉన్నప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని బాధితులు వాపోతున్నారు. అదే సమయంలో తమకు అనుకూలంగా ఉన్నవారి దరఖాస్తులు మాత్రం త్వరగా పరిష్కరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**అమౌంట్ ఇస్తేనే పని' అంటూ ఆరోపణలు...?**

సర్టిఫికెట్ల జారీకి సంబంధించి డబ్బులు ఇస్తేనే పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే వీటిపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది. ఆరోపణల్లో వాస్తవమెంత? నిబంధనల ప్రకారమే సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

**ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతోందా...?**

గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీపై ఇంతగా ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏ మేరకు ఉంది? ఈ వ్యవహారం వారి దృష్టికి వచ్చిందా? తెలిసినా చర్యలు ఎందుకు లేవు? అనే ప్రశ్నలు గ్రామస్థుల్లో వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ విషయంపై రెవెన్యూ అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలతో పాటు ఓటర్ల నమోదు ప్రక్రియలో చాలా కీలకంగా మారినప్పటికీ కొంతమంది అధికారుల తీరు వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిన అధికారులు ఆ దిశగా వ్యవహరించడం లేదని ఆరోపణలు నియోజకవర్గ వ్యాప్తంగా వినిపిస్తున్నాయి.

అధికారుల వివరణతో రేపటి కథనం...2లో

## తల్లులు చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి

- సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్



**మద్దూరు సెప్టెంబర్ 23, ప్రజా వాణి,**మండలంలోని మర్మాముల గ్రామంలో సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఏ ఎన్ ఏం రేఖ టీకాలు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ వర్ష కాలం సీజన్ లో చిన్నారులకు తప్పకుండా తల్లులు టీకాలు వేయించాలని కోరారు. అందుకోసం వైద్య సిబ్బంది ఎల్లవేళల అందుబాటులో ఉంటారని తెలిపారు.ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవాలంటే ఎప్పటికప్పుడు వైద్య సేవలు పొందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బస్వరాజు అశోక్, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆయుర్వేద వైద్యాన్ని పల్లె ప్రజలకు చేరువ చేయాలి

- మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి.
- ఏటూరునాగారం ఆయుర్వేద ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు.
- జాతీయ ఆయుర్వేద దినోత్సవ శిబిరాన్ని ప్రారంభించిన :: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క.




**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-**ఆయుర్వేద వైద్య సేవలను మారుమూల గ్రామాల ప్రజలకు చేరువ చేయాలని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆయుష్ విభాగం అధికారులకు సూచించారు. 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా బుధవారం ములుగు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని మంత్రి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ఆయుర్వేదం పురాతన వైద్య విధానమని, గ్రామీణ ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా శిబిరాలు నిర్వహించాలని అన్నారు. వర్షాకాలంతోపాటు రాబోయే కాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.వైద్య సదుపాయాలు తక్కువగా ఉన్న మారుమూల గ్రామాలకు వైద్య బృందాలు వెళ్లాలని మంత్రి తెలిపారు. శిబిరాల తేదీలను ముందుగానే స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసి, ఎక్కువ మంది ప్రజలు సేవలు పొందేలా చూడాలన్నారు. ఈ నెల 27న చిన్నబోయినపల్లిలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య బృందం పాల్గొనాలని కోరారు.ఏటూరునాగారంలోని ఆయుర్వేద ఆసుపత్రికి సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రికి పక్కా భవనాలు, అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ బానోత్ రవిచందర్, వైద్య బృందం, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లపేటలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమ పూజ



**తాళ్లపేట: గ్రామంలో దండేపెల్లి మండల్ సెప్టెంబర్ 23(ప్రజా వాణి)** అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు జనార్దన్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం కుంకుమ పూజ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యుల మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.అర్చకులు జనార్ధన్ శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక విశేషాలను వివరించారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కుంకుమ పూజ కార్యక్రమం విజయవంతంగా జరగడంతో నిర్వాహకులు, పాల్గొన్న భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఐక్యత, ఆధ్యాత్మిక భావన పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని యూత్ సభ్యులు తెలిపారు.

# ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

- మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం.
- 15 కోట్లతో అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు.
- జిల్లాలో పర్యాటక, వైద్య, రవాణా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.
- లక్ష్మీనగర్‌లో 5.95 కోట్లతో నిర్మించిన ఈస్ట్ రోడ్డును ప్రారంభించిన :: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-**ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.
బుధవారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు లక్ష్మీనగర్‌లో 5.95 కోట్ల పంచాయతీరాజ్ శాఖ నిధులతో నిర్మించిన ఈస్ట్ రోడ్డును జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ములుగు పట్టణ విస్తరణకు అనుగుణంగా రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. బృందావనం కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల్లో నివాసాలు విస్తరించడంతో స్థానికుల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. గతంలో మంజూరైన రహదారి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు.
ములుగు గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో మంజూరైన అభివృద్ధి పనులతోపాటు మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత పెరిగిన అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో అవసరమైన రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.ములుగు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ట్యాంకులు, తోపుకుంట మినీ ట్యాంక్‌బండ్, అంతర్గత రహదారులు, స్మశానవాటిక అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం సమర్పించిన వినతులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయా పనులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు.ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి వివిధ శాఖల సమన్వయంతో నిరంతరం పనులు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. మంజూరైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతోపాటు కొత్తగా అవసరమైన పనులకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ములుగులో 15 కోట్లతో అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు మంత్రి తెలిపారు. నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ఇటీవల ప్రారంభించుకున్నామని, జిల్లా ఎస్పీ కార్యాలయ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.
ములుగు పరిసర ప్రాంతాల్లో పర్యాటక సదుపాయాలను విస్తరించేందుకు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం పరిసరాల్లో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.
మల్లూరు క్షేత్ర అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను నిర్మాణ నిపుణులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర అంచనాలు రూపొందించనున్నట్లు చెప్పారు. అవసరమైన మిగతా పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు.మేడారం సమ్మక్క--సారలమ్మ క్షేత్ర పరిసరాల్లో భక్తులు, స్థానికులకు మెరుగైన సేవలు అందించేందుకు 30 పడకల ఆసుపత్రి, రహదారులు--భవనాల శాఖ అతిథిగృహం, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జాతర ప్రాధాన్యం, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు, గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయాలు, నీటి ట్యాంకుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా, తాగునీటి వసతులు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల ధాన్యం నిల్వ సమస్య పరిష్కారానికి ప్రతి మండలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో గోదాం నిర్మించేందుకు వ్యవసాయ శాఖకు నివేదికలు సమర్పించినట్లు వెల్లడించారు. ప్రతిపాదనల పరిశీలన అనంతరం గోదాముల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. మంజూరైన పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ బానోత్ రవిచందర్, స్థానిక కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీ పల్లి గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో అగ్నిప్రమాదం

- లక్ష్మిపల్లిలో సంపంగి ఈశ్వర్ కి ఆస్తి నష్టం
- రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం అంచనా!



**చిన్నంబావి ప్రజావాణి సెప్టెంబర్ 23** చిన్నంబావి మండలం లక్ష్మిపల్లి గ్రామానికి చెందిన సంపంగి ఈశ్వర్ ఇంట్లోషార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ వైర్లలో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంట్లోని విద్యుత్ పరికరాలు, సామగ్రి దెబ్బతిన్నట్లు సమాచారం. అగ్ని ప్రమాదంతో ఇంట్లో కూలరు, వాషింగ్ మిషన్. ఇంట్లో విలువైన వస్తువులు. ఎలక్ట్రానిక్ పరికరాలు, గోడలు, కరెంటు వైర్లు బోర్డులు మీటరు పైభాగం తదితర ప్రాంతాలు పొగతో నల్లగా మారి పూర్తిగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే ఇంట్లోని సామగ్రి, ఇతర ఆస్తులకు నష్టం వాటిల్లడంతో సుమారు రూ. 3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబం తెలిపింది.ప్రాణనష్టం తప్పినా.. భారీ ఆస్తి నష్టం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ఘటనతో సంపంగి ఈశ్వర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి ఘటనను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# గణేశ్ నిమజ్జనం సందర్భంగా సెప్టెంబర్ 25న సెలవు


GOVERNMENT OF TELANGANA
ABSTRACT
GENERAL ADMINISTRATION (SPL.E) DEPARTMENT
ORDER:
NOTIFICATION
(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
CHIEF SECRETARY TO GOVERNMENT
// FORWARDED :: BY ORDER //
SECTION OFFICER

**హైదరాబాద్, సెప్టెంబర్ 23: (ప్రజావాణి)** గణేశ్ విగ్రహాల నిమజ్జన శోభాయాత్రను పురస్కరించుకుని హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు సెప్టెంబర్ 25, 2026 (శుక్రవారం) సెలవు ప్రకటించారు.నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 25న ప్రకటించిన సెలవుకు బదులుగా నవంబర్ 14, 2026 (రెండో శనివారం) రోజును ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు పని దినంగా నిర్వహించనున్నారు.

# మినీ ట్యాంక్‌బండ్‌పై తొలి గణనాథునికి పూజలు

- పభుత్వ విప్ విజయరమణా రావు చేతుల మీదుగా నిమజ్జనం




**పెద్దపల్లి, సెప్టెంబర్ 23:**వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన మినీ ట్యాంక్‌బండ్ వద్ద బుధవారం గణనాథుల నిమజ్జన కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు తొలి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనానికి వచ్చే భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్, పోలీస్, విద్యుత్ తదితర శాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టారు.
ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్లు, పేస్ చైర్మన్ ముస్త్యాల నరేష్, ఎం ఆర్ వో రాజయ్య, ఎలక్ట్రికల్ ఎస్ ఈ గంగాధర్, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి నరేష్, ఏఈ రాజకుమార్, టి ఎన్ జి వో అధ్యక్షులు బొంకురి శంకర్, మున్సిపల్ సిబ్బంది, నాయకులు మందల సత్యనారాయణ రెడ్డి కౌన్సిలర్లు కొలిపాక సంపత్ మంథని నర్సింగ్ అమ్రేష్ తదితరులు పాల్గొన్నారు.వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని మినీ ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు, మున్సిపల్ అధికారులు అవసరమైన భద్రతా, పారిశుద్ధ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు.

# గూడూరు, గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్




**గూడూరు మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 23. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ బుధవారం రోజున గూడూరు, గంగారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలు చేస్తున్న వివిధ కేంద్ర అలాగే రాష్ట్ర ఆరోగ్య పథకాల రికార్డులను, సిబ్బంది హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనపై వైద్యాధికారితో సమీక్ష నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే 0--5 సంవత్సరాలలోపు పిల్లలు అందరికీ వ్యాధి నిరోధక టీకాలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అవసరమైన మందులు, పరీక్షా కిట్లు తదితర వైద్య సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారికి సూచించారు. జిల్లాలో జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాల ఏర్పాట్లను కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమాల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అలాగే ఇతర అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గంగారం మండలం లోని వైద్యాధికారి డాక్టర్ కిరణ్, గూడూరు మండలంలోని వైద్యాధికారి డాక్టర్ పవన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఏర్పాటుకు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి వినతి

- సానుకూలంగా స్పందించిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్



**ఆర్మూర్ టౌన్ సెప్టెంబర్ 23(మన సమగ్ర ప్రజావాణి):** ఆర్మూర్ నియోజకవర్గంలో మైనార్టీ విద్యార్థుల కోసం బాలికలకు, బాలురకు ప్రత్యేకంగా తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలు మంజూరు చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కోరారు. అదేవిధంగా హాస్టల్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేసి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ సచివాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌ను ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని మైనార్టీ విద్యార్థులు, ప్రజల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఎమ్మెల్యే వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనలను పరిశీలించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## భక్తి భావం పంచిన చిన్నారులు - మార్కండేయ ఆలయంలో కృష్ణవేణి విద్యార్థుల అద్భుత ప్రదర్శన



**రాయికల్, సెప్టెంబర్ 23 (ప్రజావాణి)** :రాయికల్ పట్టణంలోని మార్కండేయ ఆలయ ప్రాంగణంలో మంగళవారం భక్తి పారవశ్యంతో మార్మోగింది. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్న గణేష్ ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దైవత్వం ఉట్టిపడేలా చిన్నారులు శివుడు, పార్వతీదేవి, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్య స్వామి, కుమారస్వామి, విష్ణుమూర్తి వంటి దేవతా వేషధారణలో వేదికపైకి రావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. వినాయక చవితి విశిష్టతను, గజాననుని జన్మవృత్తాంతాన్ని కళ్లకు కట్టినట్లు నాటక రూపంలో ప్రదర్శించి భక్తులకు భక్తి తత్వాన్ని తెలియజేశారు. అనంతరం చిన్నారులు భక్తి గీతాలకు అద్భుతంగా నృత్య ప్రదర్శనలు చేసి అందరినీ అలరించారు. అంతేకాకుండా భగవద్గీతలోని శ్లోకాలను అనర్గళంగా పఠిస్తూ, వాటి అంతరార్థాన్ని చిన్నారులు సులభ శైలిలో వివరించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. సంప్రదాయానికి ఆధునిక విద్యను జోడిస్తూ చిన్నారులు చూపిన ప్రతిభకు భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ముక్తకంఠంతో ప్రశంసలు కురిపించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యాన్ని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జూపల్లి తిరుపతి రావు, ప్రిన్సిపాల్ జూపల్లి వేణుగోపాల్ రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు, సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా బలరామ జయంతి వేడుకలు



**రాయికల్, సెప్టెంబర్ 23 (ప్రజావాణి):** వ్యవసాయానికి ఆద్యుడు, రైతుల ఆరాధ్య దైవం బలరాముని జయంతిని పురస్కరించుకుని రాయికల్ మండల వ్యాప్తంగా బుధవారం రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో మండలంలోని కిష్టంపేట, అయోధ్య, ఉప్పుమడుగు, కుమ్మరిపల్లి, చెర్లకొండాపూర్ గ్రామాల్లో వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఉదయాన్నే కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించి, నాగలిని ఆయుధంగా ధరించిన బలరాముడి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. రైతు లేనిదే రాజ్యం లేదని, బలరాముని ఆశీస్సులతోనే వ్యవసాయం సుభిక్షంగా ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. అనంతరం జరిగిన రైతు సమావేశాల్లో నాయకులు మాట్లాడుతూ, నేడు రైతు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. పంటకు గిట్టుబాటు ధర, ఎరువుల కొరత, కౌలు రైతుల సమస్యలు, ప్రకృతి వైపరీత్యాల నుండి రైతును కాపాడాల్సిన ఆవశ్యకతను వివరించారు. వ్యవసాయాన్ని పండుగగా భావించి, రైతులందరూ సంఘటితంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోగలమని పిలుపునిచ్చారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కిసాన్ సంఘ్ అహర్నిశలు కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో భారతీయ కిసాన్ సంఘ్ జోనల్ అధ్యక్షులు రావుల లింగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తిరుమల శంకర్, మండల అధ్యక్షులు బొడ్డం శైలేందర్ రెడ్డి, ఆయా గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## శివాజీ యూత్ ఆధ్వర్యంలో పల్లకిలో వినాయక నిమజ్జనం





**రాయికల్, సెప్టెంబర్ 23 (ప్రజావాణి):**రాయికల్ మండలంలోని మూటపల్లి గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనం కన్నుల పండుగగా సాగింది. సంప్రదాయాన్ని చాటుతూ యువకులు వినాయక విగ్రహాన్ని పల్లకిలో ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. డప్పు చప్పుళ్లు, భజనల నడుమ భక్తులు "గణపతి బప్పా మోరియా" అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్రను నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన శోభాయాత్రలో చిన్నారులు, యువకులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిమజ్జన వేడుకలను పూర్తి చేసినట్లు శివాజీ యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ అధ్యక్షులు, సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి ధీరావత్ రవి నాయక్‌కు మద్దతు కోరుతూ కల్వకుంట్ల కవితతో భేటీ



**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 23**2027లో జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల (+తీుఃబఖ్వ) ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న టిఆర్జిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ధీరావత్ రవి నాయక్, తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ రక్షణ సేన ( టిఆర్ఎస్ ) వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధీరావత్ రవి నాయక్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయని తెలిపారు. సంప్రదాయ పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బీజేపీల కాలం చెల్లిందని, రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు నూతన రాజకీయ శక్తుల ఏకీకరణ అత్యంత అవసరమని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ఆయా పార్టీల తీరును నిరసిస్తూ, ప్రజల తరఫున నిలబడే నూతన ప్రత్యామ్నాయ శక్తులను గెలిపించుకోవాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చే అంశంపై కల్వకుంట్ల కవిత సానుకూలంగా స్పందించారని రవి నాయక్ తెలిపారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున, పార్టీ నాయకత్వంతో సమగ్రంగా చర్చించి త్వరలోనే తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని కవిత హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో టిఆర్జిఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ధీరావత్ శ్రీను నాయక్, నాయకులు ఎం న్ రావు, తరుణ్, సాయి, సిపాయ్ తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి యు పి ఎచ్ సి ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి

- మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా ఆనంద్

**మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 23 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** మెడిపల్లి యూపీహెచ్‌సీని సందర్శించిన సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్ ఆసుపత్రిలోని మందుల నిల్వలను పరిశీలించి, త్వరలో గడువు ముగియనున్న మందుల వివరాలను ప్రత్యేకంగా పరిశీలించి, వాటి వినియోగం మరియు స్టాక్ నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగుల హాజరు, రికార్డులు, ల్యాబొరేటరీ సేవలు, మాతా--శిశు ఆరోగ్య సేవలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు యూపీహెచ్‌సీకి అనుకూలమైన కొత్త ప్రదేశాన్ని ఏర్పాటు/మార్చాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిని కోరగా, ప్రజలకు వైద్య సేవలు మరింత సులభంగా అందేలా ఈ అంశాన్ని పరిశీలించాలని డా. కె. ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా ఎన్సీడీ సేవలను మరింత



సమర్థవంతంగా పర్యవేక్షించి, రక్తపోటు, మధుమేహం తదితర అసాంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్, నమోదు, చికిత్స మరియు ఫాలోఅప్ వివరాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. యూపిఎచ్సి పరిధిలోని అన్ని నిర్దేశిత ఆరోగ్య సేవలు మరియు కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలపై మరింత నమ్మకం కలిగేలా, ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా నాణ్యమైన వైద్య సేవలను అందించాలని సూచించారు.



ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులు పూర్తిగా నాణ్యతా ప్రమాణాలతో కూడినవేనని, ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, మందులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరికీ సమర్థవంతమైన సేవలు అందేలా సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

# క్రీడల్లో మెరిసిన కొత్తగూడ గిరిజన మోడల్ స్పోర్ట్స్ పాఠశాల విద్యార్థులు

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన 12 మంది క్రీడాకారులు
- అభినందించిన ఐటీడీప పీఓ, అధికారులు, పాఠశాల సిబ్బంది

**కొత్తగూడ మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 23. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండల కేంద్రం లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ మోడల్ స్పోర్ట్స్ పాఠశాల (గౌట్. టి డబ్ల్యు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ) విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే అక్టోబర్ నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వీరు మహబూబాబాద్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ?రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థుల వివరాలు?అథ్లెటిక్స్ (జూనియర్ విభాగం): ?ఎం. చరణ్ (10వ, తరగతి) - 600 మీటర్ల పరుగు పందెం. ?పి. కౌశిక్ (10వ,




తరగతి) - కిడ్స్ జావెలిన్ త్రో. ?రామకృష్ణ (10వ తరగతి) - హైజంప్. ?బి. హర్ష (9వ, తరగతి) - లాంగ్ జంప్. ?పి. భరత్ (9వ, తరగతి) - కిడ్స్ జావెలిన్ త్రో. ?జి. రాకేష్ (9వ తరగతి) - 600 మీటర్ల పరుగు పందెం. బాస్కెట్ బాల్ (ఎస్ జి ఎఫ్ ఐ విభాగం) ?డి. ఆర్యన్ (10వ తరగతి) - అండర్ -17. ?కే. రేవంత్ (7వ తరగతి) - అండర్-14. ?ఏ. శివ (6వ తరగతి) - అండర్-14.?హ్యాండ్‌బాల్ ?పి. రాజకుమార్ (10వ, తరగతి) - అండర్-17. ?కే. నిశాంత్ (10వ తరగతి) - అండర్-17. ?ఏ. రణధీర్ (10వ తరగతి) - అండర్-17. ?బి. సంజయ్ (9వ తరగతి) - అండర్ -14. ?బి. రాజకుమార్ (9వ,తరగతి) - అండర్-14. ?ఈ. రాజేష్ (9వ తరగతి) - అండర్-14. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఐటీడీఏ పీఓ. (ఏటూరునాగారం) లెనిన్ వత్సల్ టోప్పో , మహబూబాబాద్ గిరిజన సంక్షేమ శాఖ డిడి దేశీరామ్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సారయ్య, పీఎంఆర్‌సి మహబూబాబాద్ స్పోర్ట్స్ ఆఫీసర్ చుంచ కొమ్మాల్, స్టాఫ్ సెక్రటరీ చుంచ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన పీఈటీ ఇరువ దేవేందర్, అథ్లెటిక్స్ కోచ్ ధనాజీ, బాస్కెట్‌బాల్ కోచ్ వెంకటేశ్వర్లు, హ్యాండ్‌బాల్ కోచ్ సుధీర్, ఉపాధ్యాయ బృందాన్ని అధికారులు అభినందించారు.

# ఘనంగా పోషకాహార మహోత్సవం

- 19 మంది గర్భిణులకు శ్రీమంతం, ముగ్గురు చిన్నారులకు అక్షరాభ్యాసం
- అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: అధికారులు

**చింతలపాలెం సెప్టెంబర్ 23 ( ప్రజావాణి ):**పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ అధికారులు స్పష్టం చేశారు. జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలోని అంబేద్కర్ భవన్‌లో 'పోషకాహార మహోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి, పోషణ మాస పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భాగంగా చింతలపాలెం సెక్టార్ పరిధిలోని ముగ్గురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించగా, 19 మంది గర్భిణులకు ఘనంగా శ్రీమంతం నిర్వహించారు. దొండపాడు సర్పంచ్ చెన్నకేశి




వెంకయ్య యాదవ్ ఆర్థిక సహకారంతో ఆయన దంపతులు గర్భిణులకు స్వయంగా సారె సమర్పించి శ్రీమంతం జరిపించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యుఓ నరసింహారావు, సీడీపీఓ సత్యనారాయణ, ఏసీడీపీఓ కిరణ్మయి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ ఫరీద్ మాట్లాడారు. సెప్టెంబరు 9 నుంచి అక్టోబరు 8 వరకు మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను



నివారించవచ్చని, చిన్నారుల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నరాల కొండారెడ్డి, ఉపసర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ హనుమారెడ్డి, జువారి సిమెంట్ పర్సనల్ అధికారి పిళ్లై, సెక్టార్ సూపర్‌వైజర్లు సరిత, వీణ, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, నాగమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయకుడి నిమజ్జన వేడుకల్లో డీజేల నిషేధం పాటించాలి

- మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి పిలుపు

**రాయికల్; సెప్టెంబర్ 23(ప్రజావాణి)** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నిర్వహించే వినాయకుడి నిమజ్జన శోభాయాత్రల్లో డీజేలను పూర్తిగా నిషేధించాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి విజ్ఞప్తి చేశారు. భక్తి పారవశ్యంతో జరగాల్సిన వినాయకుడి నిమజ్జనం నేడు అధిక శబ్దాలతో ప్రాణాల మీదకు తెస్తున్న ప్రమాదంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో శోభాయాత్రల్లో డీజేల మోతకు అనుగుణంగా డాన్స్ చేస్తూ యువకులు గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయని, ఇది అత్యంత విచారకరమని పేర్కొన్నారు. అందుకే యువత, వినాయకుడి ఉత్సవ కమిటీలు, ప్రజలు ఆలోచించి స్వచ్ఛందంగా డీజేలకు దూరంగా ఉండాలని కోరారు. భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో, సంప్రదాయబద్ధంగా నిమజ్జన వేడుకలు జరుపుకుని తల్లిదండ్రుల పేరు నిలబెట్టడంతో పాటు సమాజంలో ప్రశంసలు పొందాలని సూచించారు. డీజేల బీభత్స శబ్దాలు, బీభత్స నృత్యాలకు బదులుగా హనుమాన్ భజనలు, దైవభక్తి గీతాలు, కోలాటాలు, సంప్రదాయ గ్రూపు డ్యాన్సులతో ఆహ్లాదకరంగా, నిదానంగా వేడుకలు జరుపుకోవడం ఎంతో శోభనిస్తుందని తెలిపారు. అధిక శబ్దం వల్ల ఒక్కసారిగా రక్తపోటు, గుండె వేగం పెరిగి గుండెపోటు ముప్పు



తీవ్రమవుతుందని, అంతేకాకుండా వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లల ఆరోగ్యంపై, వారి చెవులు, మెదడుపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కాబట్టి ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించేలా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించకుండా జిల్లాలోని అన్ని



గ్రామాలు, పట్టణాల్లో ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి మనమే స్వచ్ఛందంగా డీజేలను నిషేధించుకుంటున్నామని తీర్మానించుకోవాలని, ఐక్యమత్యంతో భక్తిశ్రద్ధలతో వినాయకుడి నిమజ్జనాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆయన హృదయపూర్వకంగా ప్రజలను, యువతను, వినాయకుడి ఉత్సవ కమిటీల సభ్యులను కోరారు.

# రాష్ట్రస్థాయి కుంగ్‌ఫు పోటీల్లో వశిష్ట విద్యార్థినుల సత్తా

● బంగారు పతకాలతో మెరిసిన పోత్కపల్లి బాలికలు

**పోత్కపల్లి:** మంచిర్యాల జిల్లా సోమగూడెంలోని త్రినేత్ర గార్డెన్‌లో ఈనెల 20న నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫు, కరాటే పోటీల్లో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లికి చెందిన వశిష్ట పాఠశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో వశిష్ట పాఠశాల విద్యార్థినులు తమ ప్రతిభను చాటుతూ విజేతలుగా నిలిచారు.

డ్రాగన్స్ కుంగ్‌ఫు విభాగంలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పాఠశాలకు, పోత్కపల్లి గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ముఖ్యంగా జూనియర్స్ గ్రూప్ నాన్‌చాక్ కాటాస్ విభాగంలో దుగ్యాల అభిసన్య, గజ్జి శాన్వి, బోగె ఆధ్యశ్రీ సమన్వయంతో అద్భుతమైన ప్రదర్శన చేసి గోల్డ్ మెడల్స్ సాధించారు.అదేవిధంగా ఇండివిజువల్ నాన్‌చాక్ కాటాస్ విభాగంలో శ్రీపతి మోక్ష ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో వరుసగా



మెరుగైన ప్రదర్శనతో విజయం సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థినులు క్రీడలతో పాటు చదువులోనూ రాణిస్తూ, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారని




పాఠశాల ప్రిన్సిపాల్ మ్యాడగొని కిషన్ తెలిపారు. విద్యార్థినులకు శిక్షణ అందిస్తున్న డ్రాగన్స్ కుంగ్‌ఫు గ్రాండ్ మాస్టర్ కొండిల్ల సదానందంను అభినందించారు.రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ మ్యాడగొని కిషన్, ఉపాధ్యాయ బృందం, డ్రాగన్స్ కుంగ్‌ఫు గ్రాండ్ మాస్టర్ కొండిల్ల సదానందం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతస్థాయి పోటీల్లో పాల్గొని పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన పెద్దమ్మతల్లి రైతు సహకార సంఘం సభ్యులు

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మంచాల, సెప్టెంబర్ 23: (ప్రజావాణి)**మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెద్దమ్మతల్లి రైతు పరస్పర సహాయక సహకార పొదుపు మరియు పరపతి సంఘం సభ్యులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరే హన్మంత్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యేను కలిశారు.ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన సంఘం లక్ష్యాలు, రైతులకు అందించనున్న సేవలు, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై ఎమ్మెల్యేతో సంఘం ప్రతినిధులు చర్చించారు. రైతులకు పరస్పర సహకారం, పొదుపు, పరపతి సౌకర్యాలను అందించి వారి ఆర్థిక



అభివృద్ధికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.అనంతరం సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. సంఘం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుంకరి పాండరీనాథ్‌గౌడ్, గుడిమల్ల చంద్రయ్య ముదిరాజ్, చిందం ఐలయ్య, సంఘం అధ్యక్షుడు పిడుగు నర్సింహా ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి దాసరమోని రమేష్ ముదిరాజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ ముదిరాజ్, నూకం వెంకటేష్ ముదిరాజ్, దాసరమోని నాగేష్ ముదిరాజ్, కావలి రమేష్ ముదిరాజ్, జిలమోని శ్రీనివాస్ ముదిరాజ్, బుట్టి జంగయ్య ముదిరాజ్, తలారి కృష్ణ ముదిరాజ్, తలారి సతీష్ ముదిరాజ్, కావలి వెంకటేష్ ముదిరాజ్, బుస్సు రాజు ముదిరాజ్‌తో పాటు సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి - రైతుల పంట నిల్వకు భరోసా

- తాడ్వాయిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్య గోదాముకు శంకుస్థాపన.
- ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలి.
- గిరిజన ఆవాసాల్లో సిమెంట్ కాంక్రీటు రహదారులు.
- రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.

**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-**రైతులు పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సురక్షిత నిల్వ సదుపాయాలు కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం గోదాముల నిర్మాణం చేపడుతూ రైతన్నకు అండగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

బుధవారం తాడ్వాయి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో 7 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్య గోదాము నిర్మాణానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంత్రి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తాడ్వాయి మండల రైతులకు ఉపయోగపడేలా భారీ సామర్థ్యంతో గోదాము నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. రైతులు పండించిన ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు సరైన వసతులు లేక రహదారులపై ఆరబెట్టాల్సి వస్తోందన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి మొలకెత్తే



పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిల్వ సదుపాయాలను విస్తరిస్తున్నట్లు తెలిపారు.తాడ్వాయి మండలంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో మరో గోదాము నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో వ్యవసాయ విస్తీర్ణంతోపాటు పంట దిగుబడులు పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని గోదాముల నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నిర్మించనున్న గోదాము తాడ్వాయి మండల రైతులకు ఎంతో ప్రయోజనకరంగా నిలుస్తుందని చెప్పారు.

అక్టోబర్ నుంచి నిర్మాణ పనులకు అనుకూలమైన సమయం ప్రారంభమవుతున్నందున పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వచ్చే వర్షాకాలానికి ముందే గోదాము నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. గిడ్డంగుల సంస్థ అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేసి ఆరు నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.గిరిజన ఆవాసాలు, ఎస్సీ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ఇటీవల గిరిజన ఆవాసాల్లో సిమెంట్ కాంక్రీటు రహదారుల నిర్మాణానికి సుమారు 50 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. గతంలో ఎస్సీ కాలనీలకు నిధులు కేటాయించామని, ప్రస్తుతం ఎస్టీ కాలనీల్లోనూ పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

విద్యుత్ సౌకర్యం లేని మారుమూల గూడాల్లో ఇంటింటికీ వెలుగులు అందించేందుకు, తాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వచ్చే పది రోజుల్లో ప్రారంభించి పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. పర్యావరణానికి, అటవీ జంతువులకు ఇబ్బంది కలగకుండా గిరిజన ఆవాసాల్లో తాగునీరు, రాత్రిపూట వెలుతురు వంటి కనీస సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

మహిళా సంఘాలు ముందుకొస్తే ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పత్తి ద్వారా మహిళా సంఘాలకు నెలకు రూ.5 లక్షల వరకు ఆదాయం లభించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే కార్యక్రమాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీల వారీగా 50 లక్షల విలువైన పనులు చేపట్టేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ భూముల్లో పనులు, జల సంరక్షణ గుంతలు, ఇంకుడు గుంతలు, బోర్ల వద్ద నీటి పునరుద్ధరణ నిర్మాణాలు, ఇంటి ఆవరణ ప్రహరీలు వంటి ప్రజలకు ఉపయోగపడే పనులను ఎంపిక చేయాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామ అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ పనుల ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు మంజూరు చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ సోమయ్య, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ ఎం.ఏ. హకీమ్.

- మొదటి కాన్పులో ఆడపిల్ల జన్మించిన దంపతులకు హకీమ్ తాతయ్య కాను.
- పాము కాటు బాధితురాలికి,కంటి సమస్య ఉన్న మహిళకు ఆర్థిక సాయం.
- అవసరమైతే కంటి ఆపరేషన్‌కు పూర్తి సాయం చేస్తానని భరోసా.
- ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత.

**కోటగిరి/ప్రజావాణి:–**నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని పోతంగల్ మండలంలో బీఆర్ఎస్ నాయకులు,సామాజిక సేవకులు డాక్టర్ ఎం.ఏ.హకీమ్ పలువురు నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు.బుధవారం పోతంగల్ మండలంలోని హంగర్గ ఫారం గ్రామానికి చెందిన రూబీనా బేగం షేక్ గౌస్ దంపతు లకు



మొదటి కాన్పులో ఆడపిల్ల జన్మించడంతో తాను ఇచ్చిన వాగ్దానం మేరకు హకీమ్ తాతయ్య కానుక కింద రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే బాలింతకు,చిన్నారికి బట్టలు పంపిణీ చేశారు.అదేవిధంగా పోతంగల్ మండల కేంద్రానికి చెందిన పలువురు బాధితులకు ఆయన తన వంతు సాయం అందించారు.పాము కాటుకు గురైన ఓ మహిళకు అలాగే కంటి చూపు సమస్యతో బాధపడుతున్న మరో మహిళకు ఆర్థిక సహాయం అందించారు. కంటి సమస్యతో బాధపడుతున్న మహిళకు అవసరమైతే ఆపరేషన్‌కు కూడా పూర్తి సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎం.ఏ. హకీమ్



మాట్లాడుతూ.ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి లాంటిదని.ఆడపిల్ల పుట్టిన ఇంట్లో శుభం కలుగుతుందన్నారు.పేద కుటుంబాల్లో ఆడపిల్లపుట్టినప్పుడు నా వంతుగా కొంత సహాయం అందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టాన ని అన్నారు.ఆపదలో ఉన్నవారికి అండ గా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో మరికొంద రు ముందుకు రావాలి అని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను స్థానికులు,పలువురు ప్రముఖులు అభినందించారు.ఆయన వెంట పోతంగల్,హంగర్గ ఫారం గ్రామ పెద్దలు,బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ సొంత తండాలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేసి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించఎమ్మెల్సీ శంకర్ నాయక్ దంపతులు





**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 23**నల్గొండ జిల్లా దామరచర్ల మండలం కేతావత్ తండాలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ దంపతులు వారి సొంత కేతవత్ తండాలో ఆ గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదాన కి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట స్థానిక సర్పంచ్ టపాస్ బాలు గ్రామ పెద్దలు ,మరియు మహిళలు భక్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు

# రాయికల్ త్రికూటాలయంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

● జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్





**రాయికల్; సెప్టెంబర్ 23 (ప్రజావాణి):** ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను ఈ నెల 27న రాయికల్ మండలంలోని ప్రసిద్ధ శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం) లో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు.బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రతి ఏటా సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యాటక రంగం ప్రాధాన్యత, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి, సుస్థిర అభివృద్ధిలో దాని కీలక పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని అన్నారు.ఈ ఏడాది 2026 సంవత్సరానికి “డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్‌రూపకల్పన” అనే థీమ్ ను నిర్ణయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ థీమ్ కు అనుగుణంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యతను విస్తృతంగా ప్రచారం చేస్తూ, పర్యాటకాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ నెల 9న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగిన వర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నానని, అందులో తీసుకున్న నిర్ణయం మేరకు జగిత్యాల జిల్లా వేడుకలకు రాయికల్ లోని చారిత్రక త్రికూటాలయాన్ని వేదికగా ఎంపిక చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేసేలా అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు







**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 23**మిర్యాలగూడ: పట్టణంలోని 1(చైతన్య నగర్), 6(ఇందిరమ్మ కాలనీ), 9(ప్రకాష్ నగర్), 10(రవీంద్ర నగర్), 17(విద్యా నగర్), 20(రెడ్డి కాలని) వార్డుల్లో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారుఈ సందర్భంగా ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి, విఘ్నేశ్వర స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు, స్థానిక నాయకులు, యువత మరియు భక్తులతో ఆత్మీయంగా మాట్లాడారు.వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, సుఖసంతోషాలతో జరుపుకోవాలని నల్లమోతు భాస్కర్ రావు ఆకాంక్షించారు. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారుఈ కార్యక్రమాల్లో ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి.ఎండి. ఇలియాస్ ఖాన్,గుడుగుంట్ల గణేష్,దీపిక విజయ్, పునాటి లక్ష్మినారాయణ,సందేషి అంజన్ రెడ్డి,భూక్యా రాంబాబు,ఆయిల వెంకన్న,ఎనుగంటి తిరుపతి రావు,గంటా శ్రావణ్ రెడ్డి,శ్రీనివాస్ రావు, కొర్ర కృష్ణా కాంత్, షైక్ ఫయాజ్,పులిపలుపుల శ్రీనివాస్ గౌడ్, కోలా శ్రీను,రామావత్ పద్మ, అవిరెంది కృష్ణ,నరేష్ చారి,కోడి వెంకటయ్య,సక్రాం నాయక్,కోర్రపిడత లింగారాజు,తెలుకుంట్ల శేఖర్,షైక్ మస్తాన్, జేజాల మణెమ్మ,కంబంపాటి సంతు,అంగోతు రాజేష్,వంశీ, శివాజీ యువసేన కమిటి సభ్యులు,వివిధ వార్డుల గణేష్ కమిటి సభ్యులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ఇంచార్జీలు, ఉత్సవ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.ఛ

# సెప్టెంబర్ 25 న సెలవు దినంగా ప్రకటించిన ప్రభుత్వం

**మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 23 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** ఈ నేల సెప్టెంబర్ 25న వినాయక నిమజ్జనం సందర్భంగా సెలవు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం నవంబర్ 14న పనిదినంగా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ శుక్రవారంనాడు హైదరాబాద్--సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు తెలంగాణ ప్రభుత్వం సాధారణ సెలవు ప్రకటించింది. ఈ సెలవుకు బదులుగా 2026 నవంబర్ 14వ తేదీని రెండో శనివారం పనిదినంగా పరిగణించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో +.ా.ౕ.చీశీ.1396 పేర్కొంది.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

# దళిత జర్నలిస్ట్ రాష్ట్ర మహాసభలకు సర్పంచ్‌కు ఆహ్వానం



**ఆల్మాయిపేట, సెప్టెంబర్ 23: మన సమగ్ర ప్రజావాణి జిల్లా ప్రతినిధి** దళిత జర్నలిస్ట్ ఫోరం ( డి జె ఎఫ్ ) ఆధ్వర్యంలో అక్టోబర్ 7న సంగారెడ్డిలో నిర్వహించనున్న 11వ రాష్ట్ర మహాసభలకు ఆల్మాయిపేట గ్రామ సర్పంచ్ దుర్గాప్రసాద్ను ఆహ్వానించారు.ఈ సందర్భంగా డి జె ఎఫ్ జిల్లా కార్యదర్శి జోగ్యల్ల రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాదిగ బుచ్చయ్య, మ్యాకల అమరేందర్ సర్పంచ్ దుర్గాప్రసాద్‌ను కలిసి మహాసభలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ దుర్గాప్రసాద్ చేతుల మీదుగా 11వ రాష్ట్ర మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సభ్యులు బంటు రాజు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఏసిపి

- డ్రగ్స్ మత్తుకు యువత దూరంగా ఉండాలి.
- ఇబ్రహీంపట్నం ఏసీపీ. కెవిపీ రాజు :



**ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సెప్టెంబర్ 23 (ప్రజావాణి న్యూస్):** నియోజకవర్గం లోని ఎలిమినేడు గ్రామంలో శంబాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథునికి ఇబ్రహీంపట్నం ఏసీపీ కెవిపి రాజు, సిఐ మద్ది మహేందర్ రెడ్డి, ట్రాఫిక్ సి ఐ జితేందర్ రెడ్డిలు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపి రాజు మాట్లాడుతూ గణనాధుని ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ప్రజలందరూ సుఖశాంతు లతో ఉండాలివర్షాలు బాగా కురిసిపంటలు బాగా పండాలని ఆయన కోరారు, అదేవిధంగా డ్రగ్స్ మత్తుకు దూరంగా ఉండాలని మంచి భవిష్యత్తును జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. ఇబ్రహీంపట్నం ఎస్హెచ్ఓ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ యూత్ యువత అందరూ కూడా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆన్లైన్ గేమ్ కు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. మంచి భవిష్యత్తు ఎంచుకోవాలని కోరారు ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ హెల్మెట్ ధరించాలి త్రిబుల్ రైడింగ్ చేయరాదు ట్రాఫిక్ రూల్స్ పాటించి సురక్షితంగా ప్రయాణం చేసి మీప్రాణాలను రక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు బజారు బిక్షపతి, మహేందర్, సాయి, శ్రీనివాస్, శ్రీకాంత్, ఏ మహేష్, గ్రామస్తులు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల పంపిణీ త్వరగా పూర్తి చేయాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 వరకు అవకాశం.
- ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో కృష్ణవేణి.



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-** ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించిన నోటీసుల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని ఎన్నికల నమోదు అధికారి, ములుగు రెవెన్యూ డివిజనల్ అధికారి, ఆర్డీవో కృష్ణవేణి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా రెవెన్యూ కార్యాలయంలో 109--ములుగు శాసనసభ నియోజకవర్గానికి సంబంధించిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో, సమావేశం నిర్వహించి, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతి, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల పంపిణీ, దరఖాస్తులు, అభ్యంతరాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా సవరణ షెడ్యూల్‌పై చర్చించారు. ప్రత్యేక సమగ్ర సవరణలో గుర్తించిన మ్యాపింగ్ కాని వ్యత్యాస కేసులకు సంబంధించి మొత్తం 41,900 నోటీసులు రూపొందించినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటివరకు 38,571 నోటీసులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన నోటీసుల పంపిణీని నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు.

గత వారం నుంచి బుధవారం వరకు వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలకు సంబంధించిన జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ప్రత్యేక సమగ్ర సవరణపై ఏవైనా సూచనలు ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఓటరు జాబితా సవరణకు భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్‌ను సమావేశంలో వివరించారు. 2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. 2023 నవంబర్ 1 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ, తత్సమాన విద్యార్హత పొందిన అర్హులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నమూనా--18లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 28న బహిరంగ ప్రకటన జారీ చేస్తారని, అక్టోబర్ 15న మొదటి పునఃప్రచురణ, అక్టోబర్ 25న రెండో పునఃప్రచురణ ఉంటుందని తెలిపారు. నమూనా--18 దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తారని, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఈ షెడ్యూల్ ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు





**ఆర్మూర్ టౌన్ సెప్టెంబర్ 23(మన సమగ్ర ప్రజావాణి):** ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆర్మూర్ పట్టణంలోని ఎంఆర్ గార్డెన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పట్టణ, మండల అధ్యక్షులు సాయిబాబా గౌడ్, దూడ వెంకటేష్, దయాకర్ రావు, బాబురావు, నాగరాజు, ప్రమోద్ తదితరులు హాజరై జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఆర్మూర్ పట్టణ చైర్మన్, కౌన్సిలర్లు, మాజీ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# దమ్మపేటలో రూ.7.05 లక్షల విలువైన అక్రమ టేకు కలప స్వాధీనం

**దమ్మపేట, సెప్టెంబర్ 23 (మన సమగ్ర ప్రజావాణి):** విలువైన టేకు చెట్లను అనుమతులు లేకుండా నరికివేయడం, చట్టబద్ధమైన పత్రాలు లేకుండా కలపను కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి అక్రమాలకు అటవీ శాఖ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు స్పష్టం చేశారు. అటవీ సంపద పరిరక్షణలో భాగంగా జిల్లాలో అక్రమ కలప నరికివేత, నిల్వ, రవాణాపై నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు.

24/7 కమాండ్ కంట్రోల్ సెంటర్ సమాచారంతో వేగవంతమైన చర్య

అటవీ నేరాల నియంత్రణ, అటవీ సంపద రక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో భాగంగా జిల్లా అటవీశాఖ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ కీలకంగా పనిచేస్తోంది. ఈ కేంద్రం 24/7 గంటల పాటు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక సిబ్బందితో నిరంతరం పనిచేస్తోంది. అంకంపాలెం బీట్‌లో అనుమతులు లేకుండా టేకు కలపను అక్రమంగా నిల్వ చేసినట్లు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా సంబంధిత టాస్క్‌ఫోర్స్ బృందానికి వెంటనే సమాచారం చేరవేశారు. సమాచారం అందిన వెంటనే టాస్క్‌ఫోర్స్ ఎఫ్ ఆర్ ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం దమ్మపేట రేంజ్ అధికారులు, బీట్, సెక్షన్ అధికారులు సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం అందిన 24 గంటల్లోనే టాస్క్‌ఫోర్స్ బృందం అక్రమ కలప నిల్వను గుర్తించి స్వాధీనం చేసుకోవడం, అటవీ నేరాల నియంత్రణలో వేగవంతమైన సమాచార వ్యవస్థ, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయానికి నిదర్శనంగా నిలిచింది.



రూ. 7.05 లక్షల విలువైన కలప స్వాధీనం

కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ బృందం దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అంకంపాలెం బీట్‌లో తనిఖీలు నిర్వహించి, ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను గుర్తించి స్వాధీనం చేసుకుంది. అధికారులు నిర్వహించిన కొలతల్లో 57 టేకు రౌండ్ దుంగలు (2.775 క్యూబిక్ మీటర్లు), 44 టేకు సాన్ సైజులు (2.460 క్యూబిక్ మీటర్లు) ఉన్నట్లు నిర్ధారించారు. మొత్తంగా 5.235 క్యూబిక్ మీటర్ల టేకు కలప, సుమారు రూ.7.05 లక్షల విలువైన అటవీ సంపదను స్వాధీనం చేసుకున్నారు. కలపను నిల్వ ఉంచిన వ్యక్తిని అధికారులు విచారించగా, తాను ఈ టేకు కలపను ఒక రైతు వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే సంబంధిత చెట్లను నరికివేయడానికి అవసరమైన అనుమతులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయా అనే అంశంపై అధికారులు విచారణ చేపట్టారు. అనుమతులు లేకుండా నరికిన చెట్ల నుంచి వచ్చిన కలపను కొనుగోలు చేసినా, నిల్వ ఉంచినా అది చట్టబద్ధమైన కలపగా మారదని అధికారులు స్పష్టం చేశారు. అటవీ శాఖ అనుమతులు, చట్టబద్ధమైన పత్రాలు లేకుండా అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం, నిల్వ చేయడం లేదా రవాణా చేయడం వర్తించే అటవీ చట్టాలు, నిబంధనల ప్రకారం చర్యలకు దారితీస్తుందని తెలిపారు. కలప కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ దాని మూలం, అనుమతులు, రవాణా పత్రాలు, చట్టబద్ధతను తప్పనిసరిగా పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అక్రమంగా చెట్లను నరికివేయడం వల్ల కేవలం కలప సంపద మాత్రమే కాకుండా, జీవవైవిధ్యం, వన్యప్రాణుల ఆవాసాలు, నేల సంరక్షణ, నీటి వనరులు, పర్యావరణ సమతుల్యతపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని అధికారులు తెలిపారు. అటవీ సంపదను కాపాడటం అటవీ శాఖతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అక్రమ కలప నరికివేత, నిల్వ లేదా రవాణా గురించి సమాచారం తెలిసిన వారు అటవీశాఖకు తెలియజేసి అటవీ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. స్వాధీనం చేసుకున్న మొత్తం టేకు కలపను దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి సమక్షంలో అంకంపాలెం బీట్ అధికారి శ్రీమతి ఏ. పార్వతి సురక్షిత కస్టడీకి అప్పగించారు. ఘటనపై వర్తించే అటవీ చట్టాలు, నిబంధనల ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి. జిల్లాలో అటవీ సంపదకు నష్టం కలిగించే అక్రమ నరికివేత, కలప నిల్వ, అక్రమ రవాణాపై కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా 24/7 నిఘా కొనసాగుతుందని, సమాచారం అందిన వెంటనే టాస్క్ ఫోర్స్, రేంజ్ అధికారులు క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో వేగవంతమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. .

# కామారెడ్డిలో నిమజ్జనానికి ముస్తాబైన గణనాథులు భక్తిశ్రద్ధలతో వీడ్కోలుకు సిద్ధం





**ప్రజావాణి సెప్టెంబర్ :23 కామారెడ్డి జిల్లా ప్రతినిధి** శోభాయాత్రకు సన్నద్ధమైన వినాయక మండపాలు కామారెడ్డి జిల్లా ప్రతినిధి:కామారెడ్డి పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. నవరాత్రుల పాటు భక్తుల పూజలు అందుకున్న గణనాథులు నిమజ్జనానికి ముస్తాబయ్యారు. గణేశ్ విగ్రహాలను ఘనంగా శోభాయాత్రగా తరలించి, భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. డప్పులు, బ్యాండ్ మేళాలు, భక్తిగీతాల నడుమ గణనాథులకు వీడ్కోలు పలికేందుకు భక్తులు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ .పట్టణ డిఎస్పి పట్టణ సీఐ . ఎమ్మార్వో తదితరులు పాల్గొన్నారుద

# జమ్మికుంట వాటర్ ప్లాంట్లపై నిఘా ఏది

- అనుమతులు ఎన్నున్నాయి నిబంధనలు పాటిస్తున్నారా
- వాటర్ ప్లాంట్లుఎన్ని పూర్తి అను మతులతో నడుస్తున్నాయి ఎన్ని ప్లాంట్లకు నోటీసులు జారీ చేశారు
- గతంలో ఎవరిపై చర్యలు తీసుకున్నారు



**జమ్మికుంట సెప్టెంబర్ 23 (ప్రజావాణి)** జమ్మికుంట పట్టణంలో వాటర్ ప్లాంట్ల నిర్వహణపై మరోసారి చర్చ మొదలైంది. పట్టణంలో కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లకు అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయా నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారా ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యతను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారాఅనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి వాటర్ ప్లాంట్ నిర్వహణకు సంబంధించి మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్, భవన/స్థల అనుమతులు, నీటి వనరుకు సంబంధించిన అనుమతులు నీటి నాణ్యత పరీక్షలు సంబంధిత శాఖల నిబంధనలకు అనుగుణంగా అవసరమైన ఇతర అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని పట్టణవాసులు కోరుతున్నారుగతంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఎండీ ఆయాజ్ హయాంలో వాటర్ ప్లాంట్లపై కఠినంగా వ్యవహరించి నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకున్నట్లు స్థానికంగా చర్చ ఉంది. ప్రస్తుతం కూడా అదే తరహాలో అధికారులు వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి అనుమతులు నిర్వహణ నీటి నాణ్యత తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారుప్రస్తుతం జమ్మికుంట మున్సిపాలిటీ అధికారిక వెబ్‌సైట్‌లో ట్రేడ్ లైసెన్స్, వాటర్ కనెక్షన్, భవన అనుమతులు వంటి సేవలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది ఎన్ని వాటర్ ప్లాంట్లు ఉన్నాయి వాటిలో ఎన్ని పూర్తి అనుమతులతో నడుస్తున్నాయి ఎన్ని ప్లాంట్లకు నోటీసులు జారీ చేశారు గతంలో ఎవరిపై చర్యలు తీసుకున్నారు అనే వివరాలను మున్సిపల్ అధికారులు బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారుప్రజల ఆరోగ్యంతో ముడిపడిన తాగునీటి విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి వాటర్ ప్లాంట్‌పై సమగ్ర తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.





# నాయిని చెరువు వద్ద మొదటి గణేష్ విగ్రహం నిమజ్జనం ప్రారంభం

- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్
- అడిషనల్ కలెక్టర్ ఆర్డీవోకమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి







**జమ్మికుంట సెప్టెంబర్ 23 (ప్రజావాణి)** జమ్మికుంట పట్టణ పరిధిలో నవరాత్రులు పూజింపబడిన విఘ్నేశ్వర స్వామి వారి మొదటి గణేష్ విగ్రహం నిమజ్జనం నాయిని చెరువు వద్ద ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిధిలో పలు చోట్ల విఘ్నేశ్వర స్వామి వారి నిమజ్జనం ప్రారంభం కావడం జరిగింది కావున సకాలంలో వచ్చి విఘ్నేశ్వర స్వామి వారి నిమజ్జనం పూర్తి చేసుకుని వెళ్ళగలరని తెలిపారు ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఆర్డీవోకమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్స్, ఎమ్మార్వో జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ ఎస్ ఐ,పలువురు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# చిన్న నాగారంలో..జిపి కార్యదర్శి సిబ్బందికి ఘన సన్మానం



**ప్రజావాణి,ఇనుగుర్తి:** మండలంలోని చిన్ననాగరం గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి పిట్టల శేఖర్ ను,గ్రామపంచాయతీ సిబ్బందిని బుధవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలోని అన్ని విఘ్నేశ్వర స్వామి మండపాల వద్ద ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచడానికి ఎప్పటికప్పుడు సూచనలిస్తూ పురమాయించడంతో పంచాయతీ సెక్రటరీ శేఖర్ ను,నిరంతరం పరిశుభ్రంగా ఉంచుతున్న గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను గణపతి విగ్నేశ్వర ఉత్సవ నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కరోబార్ కుర్మెల యాకయ్య, మునిగంటి ఎల్లయ్య, చెడుపాక రామస్వామి, చెడుపాక ఉపేంద్ర గోపాల్,తూల్ల మంజుల, చెడుపాక యాకమ్మ, ఆరేపల్లి రాధమ్మ లను సన్మానించి వారి సేవలను అభినందించారు.

# భువనగిరిలో అంబరాన్నింటిని గణేష్ నిమజ్జన శోభాయాత్ర...

**● గంగమ్మ ఒడికి బయల్లెళ్ళిన గణనాథులు..**







**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 14వ తేదీ నుండి తొమ్మిది రోజుల పాటు విశేష పూజ లందుకున్న విఘ్నేశ్వరుడి కి బుధవారం రోజు భక్తులు అత్యంత వైభవంగా నిమజ్జన వీడ్కోలు పలికారు. విద్యుత్ వెలుగులు , పూలమాలల తో అలంకరించిన ప్రత్యేక వాహనాలపై లంబో దరుడుని అధిష్టింప జేసి దేవతామూర్తుల వేష ధారణలు , కేరళ సాంప్రదాయ వాయిద్యాలు , భజనలు కీర్తనల నడుమ గణపయ్యలను ఊరేగించారు. ఊరేగింపు సాగిన దారి పొడవునా భక్తులు గణపయ్యకు బ్రహ్మరథం పట్టారు. జై గణేశా జై జై గణేశా గణపతి బప్పా మోరియా భక్తులు యువతి యువకులు చేసిన భక్తి పూరిత నినాదాలతో ఊరువాడ మార్మోగింది. గత తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందు కున్న స్వామివారి లడ్డు ప్రసాదాన్ని పోటా పోటీగా పాట పాడి కైవసం చేసుకున్న భక్తులు. తీర్ మార్ స్టెప్పులు , ప్రత్యేక డోల్ , బ్యాండు , డప్పు సప్పులతో పట్టణ వీధులన్నీ కులాహలంగా మారాయి. మహిళల కోలాటాలు , చిన్నారుల కేరింతలు , బాణాసంచా తారాజువ్వల నడుమ పండుగ వాతావరణం ఉరిమేసింది. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఊరేగింపుగా వస్తున్న గణనాథులకు ప్రత్యేక స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక జడ్జీవన్ రాయ్ చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన ప్రాంగణంలో కొంతమంది ప్రైవేట్ సింగర్లతో ప్రత్యేక కచేరి ఏర్పాటు చేశారు. స్వామివారి భజనలు కీర్తనలు చేస్తూ పట్టణ ప్రజల మనసులను దోచుకున్నారు. ఊరేగింపు అనంతరం స్థానిక పెద్ద చెరువులో గణపయ్యలను పోయిరావయ్య గణపయ్య.. బాయ్ బాయ్ గణేశ అంటూ భక్తులు బొజ్జ గణపయ్యను గంగమ్మ ఒడికి చేర్చి శోభాయాత్రను దిగ్విజయంగా ముగించారు.

# దమ్మపేటలో రూ.7.05 లక్షల విలువైన అక్రమ టేకు కలప స్వాధీనం



**దమ్మపేట, సెప్టెంబర్ 23 (మన సమగ్ర ప్రజావాణి):** విలువైన టేకు చెట్లను అనుమతులు లేకుండా నరికివేయడం, చట్టబద్ధమైన పత్రాలు లేకుండా కలపను కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి అక్రమాలకు అటవీ శాఖ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు స్పష్టం చేశారు. అటవీ సంపద పరిరక్షణలో భాగంగా జిల్లాలో అక్రమ కలప నరికివేత, నిల్వ, రవాణాపై నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. 24/7 కమాండ్ కంట్రోల్ సెంటర్ సమాచారంతో వేగవంతమైన చర్య అటవీ నేరాల నియంత్రణ, అటవీ సంపద రక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో భాగంగా జిల్లా అటవీశాఖ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ కీలకంగా పనిచేస్తోంది. ఈ కేంద్రం 24/7 గంటల పాటు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక సిబ్బందితో నిరంతరం పనిచేస్తోంది. అంకంపాలెం బీట్‌లో అనుమతులు లేకుండా టేకు కలపను అక్రమంగా నిల్వ చేసినట్లు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా సంబంధిత టాస్క్‌ఫోర్స్ బృందానికి వెంటనే సమాచారం చేరవేశారు.

# ప్రశాంత వాతావరణం లో గంగ కు చేరిన గణ నాథుడు....

- గణపతి బొప్పా మోరియా నినాదాలతో దద్దరిల్లిన కోదాడ..
- తీన్మార్ డప్పుల దరువులకు యువత స్టెప్పులే.. స్టెప్పులు
- కోలాటాలతో , డ్యాన్స్ లతో మహిళల సందడి..
- రంగులు చల్లుకుంటూ యువత కేరింతలు..
  బాణాసంచా మోతలతో హోరెత్తిన ప్రధాన వీధులు..
- భారీ ఊరేగింపులతో పెద్ద చెరువుకు చేరిన గణనాథులు..
- ప్రశాంతంగా నిమజ్జనం.. పోలీసుల గట్టి బందోబస్తు..





**కోదాడ, సెప్టెంబర్ 23/ ప్రజావాణి** కోదాడ పట్టణం బుధవారం గణేష్ నిమజ్జనం లో భాగంగా జరిగిన ఊరే గుంపులో గణపతి బొప్పా మోరియా నినాదాలతో కోదాడ పట్టణం దద్దరిల్లింది. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణం లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో వివిధ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ ఊరేగింపులు నిర్వహించగా, గణనాథుల దర్శనానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించి, డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, డీజే సంగీతాల నడుమ ఊరేగింపులు సాగాయి. తీన్మార్ డప్పుల దరువులకు యువత ఉత్సాహంగా స్టెప్పులు వేస్తూ సందడి చేయగా, మహిళలు కోలాటాలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. యువత, చిన్నారులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ నిమజ్జన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు భక్తులు ప్రత్యేక దుస్తులు ధరించి గణనాథుడి ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలుచోట్ల బాణాసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకోవడంతో పట్టణ ప్రధాన వీధులు సందడిగా మారాయి. మేళగాళ్లు, డప్పు బృందాలు, మైక్ సౌండ్ సిస్టమ్‌లకు భారీగా డిమాండ్ కనిపించింది. వివిధ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలివెళ్లే భక్తులకు మంచినీరు, ప్రసాదం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కోదాడకు చెందిన ముస్లిం సోదరులు నిమజ్జనానికి తరలివెళ్తున్న హిందూ భక్తులకు మంచినీరు అందించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. పరస్పర సహకారం, సోదరభావంతో నిమజ్జన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. పలుచోట్ల పోటాపోటీగా పులి హోరా ప్రదర్శనలు నిర్వహించడంతో యువత, భక్తుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. గణపతి లడ్డూ ప్రసాదాల పంపిణీ కూడా విస్తృతంగా చేపట్టారు. భక్తులు లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించి గణనాథుడి ఆశీస్సులు పొందారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో గణపయ్యలను కోదాడ పెద్దచెరువు వద్ద నిమజ్జనం కోసం తరలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేష్ విగ్రహాల కోసం కోదాడ మున్సిపాలిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో పెద్దచెరువు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలంకరణ, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర ఏర్పాట్లు చేపట్టారు. నిమజ్జన ప్రదేశంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల నాయకులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తులకు భోజన వసతి కల్పించారు. గణనాథుల ఊరేగింపులు, భక్తుల జయజయధ్వానాలు, డప్పుల దరువులు, మేళతాళాల మధ్య సాగి చివరకు పెద్దచెరువు నిమజ్జన ఘాట్‌కు చేరుకున్నాయి. భక్తులు గణపయ్యకు చివరి పూజలు నిర్వహించి, కన్నుల పండువగా వీడ్కోలు పలికారు. అనంతరం గణనాథులను భక్తిశ్రద్ధలతో గంగమ్మ ఒడికి చేర్చారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం పూర్తవడంతో నిర్వాహకులు, పోలీసులు, మున్సిపల్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. భక్తుల ఐక్యత, పరస్పర సహకారం, మత సామరస్యం, శాంతియుత వాతావరణంలో జరిగిన నిమజ్జన వేడుకలు కోదాడలో పండుగ వైభవాన్ని చాటిచెప్పాయి.

# సమ్మె నేపథ్యంలో ఆదివారం రోజు తెరుచుకోనున్న బ్యాంకులు...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23**బ్యాంకు యూనియన్ల సమ్మె నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు సమ్మె తల పెట్టిన నేపథ్యంలో ఆది వారం రోజు బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించాలని కేంద్ర ఆర్థిక శాఖ , రిజర్వ్ బ్యాంక్ నిర్ణయించాయి. దీంతో ఈ నెల 27న బ్యాంకు శాఖలు తెరుచు కోనున్నాయి. సమ్మె నేపథ్యంలో బ్యాంకు వినియోగదారులకు , కస్టమర్లకు ఇబ్బందులు రాకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్థిక శాఖ ప్రకటించింది. సాధారణం గా నాలుగో శనివారం , ఆదివారం బ్యాంకులు పనిచేయవు. 28 నుంచి (సోమ , మంగళ , బుధ) మూడు రోజుల సమ్మె నేపథ్యంలో మొత్తంగా ఐదు రోజుల పాటు బ్యాంకు సేవలకు విఘాతం కలగనుంది. ఈ క్రమంలో ఆదివారం బ్యాంకులు తెరిచేలా నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ఆర్‌బీఐ కూడా అందుకు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. దీంతో ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఆదివారం పనిచేయనున్నాయని ఆర్థిక శాఖ తెలిపింది.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందేలా పరిశీలన



**● నందిగామ సర్పంచ్ భూక్య భాస్కర్**

**నల్లబెల్లి, సెప్టెంబర్ 23 ప్రజావాణి:**మండల పరిధిలోని నందిగామ గ్రామంలో బుధవారం రోజున చేయూత పింఛన్ల అర్హత నిర్ధారణకు క్షేత్రస్థాయి విచారణ కార్యక్రమాన్ని సర్పంచ్ భూక్య భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.పంచాయతీ రాజ్ సహాయ ఇంజనీర్ రవికుమార్ నేతృత్వంలో అధికారుల బృందం ఈ విచారణను చేపట్టింది.కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు నేరుగా వెళ్లి పరిశీలన జరిపారు. దరఖాస్తుదారుల ఒరిజినల్ సర్టిఫికెట్లను, వారి సామాజిక, ఆర్థిక అర్హతలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ పరిశీలనలో భాగంగా మొత్తం 35 మంది దరఖాస్తుదారుల వివరాలను సర్వే చేశారు. ఇందులో వికలాంగులు 18, వితంతువులు 15, చేనేత కార్మికులు 1, ఒంటరి మహిళ 1 చొప్పున ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య భాస్కర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలన్నదే లక్ష్యమని తెలిపారు. పారదర్శకంగా సాగుతున్న ఈ విచారణ ద్వారా నిజమైన లబ్ధిదారులకు చేయూత పింఛన్లు అందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంజిత్, కారోబార్ రాజు, గూగులోతు రాజుతో పాటు పలువురు గ్రామస్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గూడూరు పాకాల వాగు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ముందస్తు ఏర్పాట్లు







**గూడూరు మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 23. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, గూడూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్న భక్తులు విగ్రహాలను ప్రశాంతమైన వాతావారణంలో నిమజ్జనం చేసేందుకు వీలుగా పంచాయతీ తరపున అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. వాగు వద్ద నీటి ప్రవాహాన్ని బట్టి భక్తులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు బారికేడ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా నైపుణ్యం గల ఈతగాళ్లను అందుబాటు లో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో కూడా నిమజ్జనాలు సాగుతాయి కాబట్టి, వాగు పరిసర ప్రాంతాల్లో భక్తులకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక విద్యుత్ దీపాలు (లైటింగ్) ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనానికి వచ్చే వాహనాలకు, భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దారులను సుగమం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. భక్తులందరూ స్థానిక యంత్రాంగానికి, పోలీసులకు సహకరిస్తూ నిమజ్జన ఉత్సవాలను సురక్షితంగా విజయవంతం గా ముగించాలని సర్పంచ్ ఈ సందర్భంగా కోరారు. బుధవారం రోజున గూడూరు మండల కేంద్రం లో అరవింద విద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని నవరాత్రి ఉత్సవాలను ముగించుకొని, వినాయకుని శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. అరవింద విద్యాలయం విద్యార్థినీ, విద్యార్థులు పలు రకాల నృత్యాలతో గూడూరు మండల ప్రజలను, భక్తులను భక్తి పారవశంలో ముంచెత్తారు. వీరి నృత్యాలకు భక్తజనులు భక్తిపారవశంలో మునిగితేలారు. అదేవిధంగా గూడూరు మండలం లోని పలు యూత్ క్లబ్ ల, కుల సంఘాల ఆధ్వర్యంలోని వినాయకుని విగ్రహాలు భారీగా నిమజ్జన శోభాయాత్రలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అసంఘటిత సంఘటనలు చోటు చేసుకోకుండా, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అట్ల కట్ల సత్యనారాయణ, గూడూరు సబ్ ఇన్స్పెక్టర్ వస్రా వినయ్ కుమార్, సబ్ ఇన్ స్పెక్టర్ టి. రమేష్ బాబు, పలు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, భక్తజనులు, పోలీసు సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన శోభాయాత్రలో మహిళల కోలాటం ప్రదర్శన



**రాయికల్, సెప్టెంబర్ 23 (ప్రజావాణి):** రాయికల్ పట్టణంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన శోభాయాత్రలో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణంలోని పటేల్ చౌరస్తా వద్ద జరిగిన శోభాయాత్రలో మహిళలు ఆకుపచ్చ, ఊదా రంగు చీరలలో ఒకే రకమైన ఏకరూప దుస్తులు ధరించి కోలాటం ఆడారు. చేతుల్లో కర్రలతో లయబద్ధంగా ఆడిన వారి నృత్యం భక్తులను అలరించింది.డీజేలకు దూరంగా సంప్రదాయబద్ధంగా సాగిన ఈ ప్రదర్శనకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. భక్తి గీతాలకు అనుగుణంగా మహిళలు వేసిన ప్రతి అడుగు చూపరులను ఆకట్టుకుంది. ఈ కోలాటాన్ని తిలకించేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.డీజే సంస్కృతి పెరుగుతున్న నేటి రోజుల్లో సంప్రదాయాన్ని కాపాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. ఈ నిమజ్జన ఉత్సవం ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వేలం పాటలో లడ్డుకు రూ.18,116..

**● కైవసం చేసుకున్న హైదరాబాద్ వాసి వంశీ**





**ప్రజావాణి,ఇనుగుర్తి:** మండలం చిన్ననాగారం గ్రామం హనుమాన్ ఆలయం గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి లడ్డు రూ.18 వేల 116కు హైదరాబాదు వాసి దక్కించుకున్నారు. బెల్లి వంశీ యాదవ్ ఆర్యవైశ్య సంఘం నేత మాలె రమేష్ మధ్య ఉత్కంఠ భరితంగా సాగిన వేలంపాటలో చివరికి భాగ్య నగరానికి చెందిన వంశీ యాదవ్ మహిమాన్విత లడ్డును గెలుచుకున్నారు.దీంతో గణపతి ఉత్సవ నిర్వాహకులు లడ్డును వంశీ యాదవ్ తరఫున ఉడుత పద్మ కు గణపతి నామస్మరణలో అందజేశారు.ఈ సందర్భంగా పద్మను సన్మానించారు. అంతకమునకు లడ్డు వేలంపాట చివరిదాకా పాడిన గత సంవత్సరపు విజేత ప్రస్తుత వినాయక విగ్రహ దాత మాలె రమేష్ ను గణపతి వేడుకల నిర్వాహకులు ఉడత శాలువాతో ఘనంగా సన్మానించారు. చిన్ననాగారం లడ్డును హైదరాబాద్ వాసి కైవసం చేసుకోవడం పట్ల గణపతి ఉత్సవ నిర్వాహకులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎస్సార్ ప్రైమ్ స్కూల్లో ఘనంగా గణేశుని శోభయాత్ర





**కోదాడ సెప్టెంబర్ 23.ప్రజావాణి :** జోనల్ ఇన్చార్జ్ స్నేహలత ఆధ్వర్యంలో గణేశుని శోభాయాత్ర నిర్వహించారు. ప్రిన్సిపాల్ పుల్లయ్య గణేశుని శోభ యాత్ర సందర్భంగా మాట్లాడుతూ గణేశుని ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నారు. తొమ్మిది రోజులు ప్రత్యేకంగా పూజలను నిర్వహించి మళ్లీ రా గణేశా అంటూ ఆటపాటలతో ఘనంగా శోభయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, విద్యార్థులు యొక్క తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గురువారం, సెప్టెంబర్ 24, 2026
మన పత్రిక ప్రజావాణి తెలుగు డైలీ
15

# ఎత్తొండ క్యాంప్‌లో ఘనంగా ఏక్ పెడ్ మా కే నామ్ కార్యక్రమం

- మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి.
- సర్పంచ్ గైని వీరమణి అర్జున్.



**కోటగిరి/ప్రజావాణి:**-తల్లి పేరు మీద ఒక మొక్క నినాదంతో ప్రతి ఒక్కరు మొక్కలు దాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సర్పంచ్ గైని వీరమణి అర్జున్ పిలుపునిచ్చారు.బుధవారం కోటగిరి మండలం ఎత్తొండ క్యాంప్ గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు లక్ష్యంగా ఏక్ పెడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ గైని వీరమణి అర్జున్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ టీచర్లు,పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మొక్కలు నాటి వాటిని కంటికి రెప్పలా సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గైని వీరమణి అర్జున్ మాట్లాడుతూ.విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించడం,పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయడం గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడం ఈ ప్రభుత్వ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# గుగ్గిళ్ల గ్రామంలో ఘనంగా గణనాథుని నిమజ్జన వేడుకలు



**బెజ్జంకి, సెప్టెంబర్ 23 (ప్రజావాణి)**సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో గణనాథుడి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 3వ వార్డు గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు నిమజ్జన వేడుకలకు హాజరైన గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య, వార్డు సభ్యుడు దూశెట్టి రాజిరెడ్డిని వార్డు ప్రజలు, మహిళలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య మాట్లాడుతూ సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గణనాథుడిని వేడుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడికి వైభవంగా వీడ్కోలు పలుకుతున్న ప్రజలంతా ఆనందంగా, సురక్షితంగా వేడుకలు ముగించుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తి పాటలు, తప్పెట్ల చప్పుళ్ల నడుమ ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. మహిళలు కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. అనంతరం గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడికి చేర్చి నిమజ్జనం చేశారు.కార్యక్రమంలో కిసాన్ మోర్చా బెజ్జంకి మండల అధ్యక్షుడు సీత భూమయ్య, యాదిరెడ్డి, చిట్టి శీను, తుమ్మరాజు, సీత శ్రీకాంత్, తిరుపతితో పాటు మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు

- సర్పంచ్ శాంతి కిషన్ నాయక్.



**ప్రజావాణి ?బయ్యారం సెప్టెంబర్ 23.**బయ్యారం మండలం ఆలిగేరు బ్రిడ్జి వద్ద వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో సమగ్ర ఏర్పాట్లు చేపట్టారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా అత్యవసర వైద్య సేవలు,పోలీస్ బందోబస్తు,పవర్ సప్లై, గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని ఘటనా స్థలంలో అందుబాటులో ఉంచారు.ఈ ఏర్పాట్లను ఎంపీడీఓ దీపిక స్వయంగా పర్యవేక్షించి,అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.నిమజ్జనం సజావుగా సాగేందుకు అన్ని శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# కాలాపూర్ రైతుల భూ పోరాటానికి బీఆర్ఎస్ అండ

- మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డికి గ్రామస్తుల ఘన సన్మానం



**ప్రజా వాణి, వికారాబాద్ జిల్లా పరిగి, సెప్టెంబర్ 23:**కాలాపూర్ గ్రామ రైతుల భూ సమస్యపై చేపట్టిన పోరాటానికి మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కాలాపూర్ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ని బీఆర్ఎస్ నాయకులను కాలాపూర్ గ్రామ సర్పంచ్ పులేందర్,మాజీ సర్పంచ్ జంగయ్య,జంగయ్య పాటు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.రైతుల భూ సమస్య పరిష్కారం కోసం గ్రామస్తులు చేస్తున్న పోరాటానికి అండగా నిలిచినందుకు మహేష్ రెడ్డి కి గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా కొప్పుల మహేష్ రెడ్డి,మాట్లాడుతూ.కాలాపూర్ గ్రామస్తులకు, రైతులకు ఎటువంటి సమస్య వచ్చినా ఇకముందు కూడా తన వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. రైతుల హక్కుల కోసం జరిగే పోరాటాలకు తమ పార్టీ తరఫున అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గణపతి నిమజ్జనం పర్యవేక్షించిన అధికారులు

**ప్రజావాణి,ఇనుగుర్తి:** మండల కేంద్రం ఇనుగుర్తి తో పాటు వివిధ గ్రామాలలో స్థానిక తహసిల్దార్ సుంకరి శ్రీనివాసులు, ఎంపీడీవో పార్థసారథి, ఎస్సై పి.నరేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గణపతి నిమజ్జన కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించారు. ప్రశాంతంగా స్వామి వారిని నిమజ్జనం చేసేందుకు తగు సూచనలు ఇస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూశారు. ఇనుగుర్తి లో బేటి చెరువు వద్ద భారీ క్రేన్ తో గణపతి ని గంగమ్మ గుడికి చేర్చడాన్ని తహసీల్దార్,స్థానిక సర్పంచి తమ్మడపల్లి కుమార్ పర్యవేక్షించారు.ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మండలంలోని ప్రతి గ్రామాన్ని తండాను సందర్శించి వినాయక ఉత్సవ కమిటీలకు తగు సలహాలు సూచనలు ఇస్తూ దిశా నిర్దేశం చేశారు.

# శ్రీరామనవమికి ముందే భద్రాచలం ఆలయ పనులు పూర్తి చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పనిని పూర్తి చేసేలా వేగం పెంచాలి.
- రాతి పనులకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ రోజువారీ లక్ష్యాలు నిర్దేశించాలి
- నాణ్యత, శాస్త్రోక్తత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ వద్దు..









**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (సెప్టెంబర్ 23):** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనులు నిర్వహించాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం రోజు భద్రాచలం చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.తదుపరి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి మంత్రి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్తర ద్వారం వద్ద ఉన్న దమ్మక్క విగ్రహం ప్రాంతం నుంచి పరిశీలన ప్రారంభించి, వివిధ నిర్మాణ పనుల పురోగతి, ప్రస్తుత దశ, పూర్తికి అవసరమైన సమయం, మానవ వనరులు, నిర్మాణ సామగ్రి తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లిఫ్టులు, స్లాబ్‌లు, రాతి పనులు, రహదారుల అభివృద్ధి, నిర్మాణ సామగ్రి లభ్యత, సిబ్బంది సమీకరణ, అదనపు నిధులు, సాంకేతిక సమన్వయం తదితర అంశాలపై పనుల వారీగా పురోగతిని పరిశీలించారు. ప్రతి విభాగానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించి, వారంవారీ ప్రణాళిక ప్రకారం పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.275 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే పనులు వేగం పుంజుకున్నాయని, నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యతతో పూర్తి చేసేందుకు అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని తెలిపారు. శ్రీరామనవమికి ముందుగానే ప్రధాన పనులు పూర్తయ్యేలా రివర్స్ ప్లానింగ్ రూపొందించుకోవాలని, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయం, మాడ వీధులు, అంతర్గత ప్రాకారం, బాహ్య ప్రాకారం తదితర ప్రాంతాల్లో చేపడుతున్న పనులను ముందుగానే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

లిఫ్ట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పనిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన మానవ వనరులను పెంచుకోవాలని, సిబ్బంది కొరత వల్ల పనులు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నిర్మాణ సామగ్రి అందుబాటులో లేక పనులకు అంతరాయం కలగకుండా సెంటరింగ్ తదితర సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని, అవసరమైన చోట బూమ్ పంపులు, ఇతర యంత్ర పరికరాలను వినియోగించి, పనుల సామర్థ్యాన్ని పెంచాలని తెలిపారు. స్లాబ్ పనుల్లో ఒక దశ పూర్తయ్యే వరకు తదుపరి దశకు సంబంధించిన ఏర్పాట్లు ఆలస్యం కాకుండా సమాంతరంగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. పనుల మధ్య ఖాళీ సమయం తగ్గించి నిరంతరాయంగా నిర్మాణ కార్యకలాపాలు కొనసాగేలా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ప్రతి పనికి వారంవారీ లక్ష్యాలను నిర్దేశించి, ఆ లక్ష్యాల మేరకు పురోగతి లేకపోతే కారణాలను వెంటనే గుర్తించి పరిష్కరించాలన్నారు.

రాతి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన నిపుణులు, సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి రోజువారీ లక్ష్యాలతో పనులు నిర్వహించాలని తెలిపారు. చివరి దశలో రాతి పనులు పెండింగ్‌లో ఉండకుండా ముందుగానే పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. గతంలో చేపట్టిన భారీ ఆలయ, జాతర ప్రాంతాల నిర్మాణ పనుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. ఆలయ నిర్మాణంలో నాణ్యతతో పాటు శాస్త్రోక్తతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ఆలయ సంప్రదాయాలు, నిర్మాణ విధానాలకు అనుగుణంగా పనులు సాగుతున్నాయా అనే అంశాన్ని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశించారు.

ఆలయ పరిసర రహదారుల అభివృద్ధికి సంబంధించి సుమారు రూ.25 కోట్ల ప్రతిపాదనను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను సమన్వయంతో అభివృద్ధి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భద్రాచలం ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఆలయ పనుల పురోగతిపై ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని తెలిపారు.నిర్ణీత గడువులు, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ సమన్వయంతో పనిచేసి పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్ట్‌లు, సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి నిలయాల్లో ‘సౌకర్యాల’ కరువు కల్వల బడిలో కన్నీటి వ్యధ!

- దీర్ఘకాలికంగా నడుస్తున్న సమస్య.!
- ఆడపిల్లల ఆత్మగౌరవానికి పరీక్షగా మారి న ‘కనీస’ వసతులు.
- చెట్ల కిందనే మధ్యాహ్న భోజన వంటలు.. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుంటున్న వంటమనుషులు.
- కేసముద్రం మండలంలో దయనీయంగా కల్వల ప్రభుత్వ పాఠశాలల స్థితి.










**కేసముద్రం సెప్టెంబర్ 23,ప్రజావాణి.**ప్రభుత్వాలు విద్యారంగ బలోపేతానికి, ‘బడిబాట’ కార్యక్రమాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం విద్యార్థుల ప్రాథమిక అవసరాలు తీరడం లేదు.మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు నేడు కనీస వసతులు లేక నరకప్రాయంగా మారాయి. దేశాన్ని ఏలే రేపటి పౌరులను తీర్చిదిద్దాల్సిన ఈ విద్యా నిలయాల్లో... మలమూత్ర విసర్జన వంటి అత్యంత ప్రాథమిక అవసరానికి కూడా స్థలం లేకపోవడం విద్యాశాఖ పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది.

ఆడపిల్లల, అబ్బాయిలు రోదన.

ఈ రెండు పాఠశాలల్లో కలిపి వందలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే, ఇక్కడ సరైన బాత్రూమ్ సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ముఖ్యంగా యుక్తవయసుకు వస్తున్న హైస్కూల్ బాలికల బాధలు వర్ణనాతీతం. పాఠశాల ఉపాధ్యాయులకు కేటాయించిన బాత్రూంలో బాలికలు ఉపయోగించుకోవడం జరుగుతుంది.ఇది కేవలం అసౌకర్యం మాత్రమే కాదు, బాలికల ఆత్మగౌరవానికి సంబంధించిన తీవ్రమైన సమస్య. దీనివల్ల పలువురు విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ప్రాణాంతకంగా మధ్యాహ్న భోజనం...చెట్ల కిందనే వంటలు!

మరోవైపు పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సైతం అస్తవ్యస్తంగా మారింది. శాశ్వత వంటగది లేకపోవడంతో, వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆరుబయట, చెట్ల కిందనే వండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండ తీవ్రతకు, వానాకాలం తడిసిపోతూ వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.గాలికి వచ్చే దుమ్ము, ధూళి,చెట్లపై నుండి రాలే పురుగులు ఆహారంలో పడే ప్రమాదం పొంచి ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా, ఆరుబయట మంటలు పెట్టి వండుతున్న సమయంలో చిన్న పిల్లలు ఆడుకుంటూ అటువైపు వస్తే ఏ క్షణంలోనైనా ప్రమాదం జరగొచ్చని వంటమనుషులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల తక్షణ జోక్యం అవసరం!

కల్వల గ్రామంలోని ఈ సమస్య కేవలం ఒక పాఠశాల సమస్య కాదు,సమాజంలోని ప్రతి ఒక్కరినీ కదిలించే అంశం. విద్యాశాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి, యుద్ధప్రాతిపదికన ఈ పాఠశాలలకు నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తక్షణ డిమాండ్లు:

బాలబాలికలకు విడివిడిగా ఆధునిక రక్షణతో కూడిన బాత్రూమ్‌లను నిర్మించాలి.పరిశుభ్రమైన వాతావరణంలో వంట చేయడానికి వీలుగా సురక్షితమైన వంటగదిని ఏర్పాటు చేయాలి.మన పిల్లల భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే, వారికి చదువుతో పాటు కనీస సౌకర్యాలు కల్పించడం వ్యవస్థ బాధ్యత.అధికారులు త్వరలోనే స్పందించి కలువల గ్రామ పాఠశాలల రూపురేఖలు మారుస్తారని ఆశిద్దాం.

# కురవిలో భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం

- పంచాయతీ కార్యదర్శి రాజేష్ వేద ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- ఎస్సై సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు
- సర్పంచ్ లక్ష్మీ రా జు నాయక్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ



**కురవి:** మండల కేంద్రంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నిమజ్జనానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేష్ వేద ఆధ్వర్యంలో నిమజ్జన ప్రాంతంలో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను బోలగాని సతీష్ గౌడ్ పర్యవేక్షించారు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీరాజు నాయక్ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామపంచాయతీ తరపున అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలో గణపతి నవరాత్రుల సందర్భంగా పూజలందుకున్న వినాయకుడు విగ్రహాలను భక్తిశ్రద్ధలతో పురవీధుల్లో ఊరేగిస్తూ గణనాథుడు విగ్రహాలను పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. శివ గణేష్ యూత్ ఆధ్వర్యంలో కురవి మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయితీ సెంటర్లో గణేష్ నవరాత్రులు సందర్భంగా శివ గణేష్ యూత్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మామిడాల స్రిజ,చైతన్య మామిడాల, పావని మామిడాల,కడగట్ల బిధు, శ్రీహనసయ,మేకల సృజన, ప్రవీణ్వర్షిత్,ఆశిష్,ప్రణయ్,టింకు,అనిల్,విష్ణు,సాత్విక్,గౌతమ్,కౌశిక్,రేతివిక్,హారహ,లక్కీ,రిషి,వీరమాణిక్య,లేఖ హారహ చిన్నారులు గణనాథుని భక్తిశ్రద్ధలతో పూజించారు. పదవరోజు ఆటపాటలతో పురవీధుల్లో గణనాథుని ఊరేగించి కొరవి పెద్ద చెరువులో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

# రోస్టర్ విధానంతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది: నిరడి రవి

- మాల విద్యార్థి జేఏసీ సంఘాల రాష్ట్ర నాయకులు



**కూకట్పల్లి : సెప్టెంబర్ 23 (ప్రజావాణి దినపత్రిక )** రోస్టర్ విధానాన్ని సవరించి ఎస్సీ గ్రూప్‌లో ఉన్న మాల, ఇతర 25 కులాల మొదటి రోస్టర్ పాయింట్‌ను 22 నుంచి 16కు మార్చాలని మాల విద్యార్థి జేఏసీ సంఘాల రాష్ట్ర నాయకులు నీరడి రవి అన్నారు. మాలల రాజ్యాంగ హక్కులు కాలరాస్తున్న రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నేల అక్టోబర్ 10న హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ లో మాల సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తునమని దీనికి రాష్ట్రంలో ఉన్న మాలల తరపున ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న అన్ని రాజకీయ పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేస్తూ మాల సోదరి సోదరులు అందరూ హాజరై నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని మన హక్కులను కాపాడుకుందని పిలుపునిచ్చారు.

# ఆయుర్వేదంతో ఆరోగ్య పరిరక్షణ




**చిలుకూరు సెప్టెంబర్ 23 ( ప్రజావాణి):**ఆయుర్వేద వైద్య విధానంతో అనేక రకాల అనారోగ్య సమస్యలకు సహజ సిద్ధమైన చికిత్స అందించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చిలుకూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి సుశీల అన్నారు బుధవారం 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకొని ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆయుర్వేద వైద్యం పై అవగాహన పెంచుకొని ఆరోగ్య పరిరక్షణలో యోగా ధ్యానాన్ని నిత్యజీవితంలో బాదం చేసుకోవాలని సూచించారు యోగా ధ్యానం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు ఆయుర్వేద వైద్య విధానంలో అందుబాటులో ఉన్న చికిత్స పద్ధతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేసి ఆయుర్వేద వైద్యం పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారుద

# పదహారేళ్ల ప్రస్థానం..

- నిధులు వచ్చుడో - లేక నేను సచ్చుడో..
- అధికారుల తీరుపై ఆగని పోరాటం..
- ఈ ప్రాంత అభ్యున్నతి కోసం ప్రాణ త్యాగా నికి కూడా వెనకాడలే..
- మూల మధుకర్ రెడ్డి..




**ప్రజావాణి బయ్యారం సెప్టెంబర్ 23** సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు కోసం 16 ఏళ్ల క్రితం బయ్యారం మండలంలో సాగిన ఆమరణ నిరాహార దీక్ష నాటి ఉద్యమ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. సమస్యల పరిష్కారం కోసం అప్పట్లో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష మూడు రోజులకు చేరిన సందర్భంగా నాటి పత్రికల్లో ప్రచురితమైన వార్తలు, ఫొటోలు ప్రస్తుతం కూడా ఆ ఉద్యమానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

రేపటితో ఆమరణ నిరాహార దీక్షకు 16 ఏళ్లు..

అలుపెరుగని పోరాటానికి పదహారేళ్ల నిండినవి ఈ పోరాట స్ఫూర్తి కి నేటికీ ఆదర్శంగా నిలుస్తున్న ఆ ఫోటోలే ప్రత్యక్ష సాక్షాలు.. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిధులను వెంటనే బయ్యారం మండలానికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ,ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. మండల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉద్యమకారులతో నిరసనకు దిగారు.

ఆరోగ్యం సహకరించకపోయిన ఆగని పోరాటం..

బయ్యారం నిధుల విషయంలో దీక్షకు దిగిన మధుకర్ రెడ్డి ఆరోగ్య విషయం అంతంత మాత్రమే ఉండేది. వైద్యులు కూడా తన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుందని తెలియజేసిన తన ఆరోగ్యం పై ఎలాంటి ఆందోళన చెందకుండా ఈ ప్రాంత అభివృద్ధి ప్రధాన ఎజెండాగా ముందుకు సాగి కొట్లాడిన ధిక్కార దిశాలి మధుకర్ రెడ్డి..

నిధులు వచ్చుడో -లేక నేను సచ్చుడో..

దీక్ష మూడు రోజులకు చేరినా సమస్య పరిష్కారం కాకపోవడంతో నిధులు వచ్చుడో లేక నేను సచ్చుడో అనే నినాదంతో ఉద్యమాన్ని ఉద్యమకారులతో తమ నిరసనను తీవ్రంగా కొనసాగించారు. మధుకర్ రెడ్డి దీక్షను దీక్షా శిబిరం వద్దకు వచ్చి పలువురు సంఘీభావం ప్రకటిస్తూ సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. నిధులు మంజూరు చేసి మండల అభివృద్ధికి బాటలు వేయాలని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అప్పట్లో డిమాండ్లు వినిపించాయి...

16 ఏళ్ల తర్వాత కూడా జ్ఞాపకంగా నాటి పోరాటం..

ప్రస్తుతం 2026లో ఆ ఘటనను గుర్తు చేసుకుంటే.. రేపటితో 16 ఏళ్లు పూర్తవుతున్న ఈ సందర్భంలో నాటి ఉద్యమానికి సంబంధించిన పాత పత్రికా కథనం, ఫొటో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అప్పట్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన తీరు, దీక్షా శిబిరంలో కూర్చున్న ఉద్యమకారులు, వారికి మద్దతుగా హాజరైన ప్రజలు నాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమిస్తే ప్రభుత్వాల దృష్టికి సమస్యలను తీసుకెళ్లవచ్చనే భావనకు నాటి దీక్ష ఒక ఉదాహరణగా నిలిచిందని స్థానికులు పేర్కొంటున్నారు. 16 సంవత్సరాలు గడిచినా నాటి పత్రికా కథనం, ఫొటోలను భద్రపరచుకోవడం ద్వారా ఆ ఉద్యమ జ్ఞాపకాలు నేటి తరానికి కూడా చేరుతున్నాయి..

# గరిడేపల్లి సాయి కుమార్ కి సంతాపం తెలిపిన --ఏఐవైఎఫ్



**చిలుకూరు,సెప్టెంబర్ 23(ప్రజావాణి):** చిలుకూరు మండల కేంద్రానికి చెందిన ఏఐవైఎఫ్ (AIYF) కార్యకర్త గరిడేపల్లి సాయి కుమార్ హఠాన్మరణం చెందటంతో ఏఐవైఎఫ్ జెండాను కప్పి నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు మాట్లాడుతూ ప్రజా రంగంలో మరియు యువజన సంఘాల్లో చురుగ్గా పనిచేసే ఒక యువ కార్యకర్త కోల్పోవడం సంఘానికి తీరని లోటని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ఏఐవైఎఫ్ ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మొక్క లక్ష్మీనారాయణ, పిల్లుట్ల జగదీష్, షేక్ జాన్ పాషా, టైలర్ రంజాన్, కట్టెకోల సాయి, కొండ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

- నిరుద్యోగ గిరిజన యువతి, యువకులకు సువర్ణావకాశం..
- ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం/మన ప్రజావాణి (సెప్టెంబర్ 23):** సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ భద్రాచలం వారి ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు 3 నుంచి 4 నెలల పాటు ఉద్యోగ నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. భద్రాచలం, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, ఖమ్మంలో ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ బుధవారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు.

శిక్షణ కోర్సులు వివరాలు:

1, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్ -- మహిళలు, 18--35 ఏళ్లు, 5వ తరగతి ఉత్తీర్ణత.

2, బ్యూటీ థెరపిస్ట్ -- మహిళలు, 18--35 ఏళ్లు, 8వ తరగతి ఉత్తీర్ణత.

3, కంప్యూటర్ హార్డ్‌వేర్ టెక్నీషియన్ -- పురుషులు, 18--30 ఏళ్లు, ఇంటర్మీడియట్.

4, గెస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ -- మహిళలు, పురుషులు, 18--30 ఏళ్లు, ఎస్ఎస్సి.

5, డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ -- మహిళలు, పురుషులు, 18--35 ఏళ్లు, ఎస్ఎస్సి.

6, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ -- మహిళలు, 18--35 ఏళ్లు, ఎస్ఎస్సి.

7, మల్టీ స్కిల్ టెక్నీషియన్ -- పురుషులు, 18--35 ఏళ్లు, ఎస్ఎస్సి.

8, హోటల్ మేనేజ్మెంట్ - మహిళలు, 18--30 ఏళ్లు, ఎస్ఎస్సి.

శిక్షణ పొందు కేంద్రాలు:భద్రాచలం గిరిజన భవన్ సమీపంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్, ఇల్లందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్, అశ్వారావుపేట ఎంపిడిఓ కార్యాలయం సమీపంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్, ఖమ్మంలో రోటరీ నగర్ పోలీస్ స్టేషన్ పక్కన యూత్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్, స్టడీ మెటీరియల్, శిక్షణ తదనంతరం సర్టిఫికెట్ ఇప్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరుతూ మరిన్ని వివరాల కోసం సంబంధిత శిక్షణ కేంద్రాల ఫోన్ నంబర్లు 9347 46 6615, 810 6141505, 9866 113645, 90 59667710, 630 580 2724 సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆయన కోరారు.

# బేతవోలు నిమజ్జన ప్రాంతంలో పోలీసుల భద్రత




**చిలుకూరు సెప్టెంబర్ 23(ప్రజావాణి:** చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలోని నిమజ్జన ప్రాంతంలో గణేష్ విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పోలీసు సిబ్బంది పటిష్ట భద్రత కల్పిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిఘా ఏర్పాటు చేసి, భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# మంచితనాన్ని చేతకానితనంగా చూడొద్దు!

- క్యాడర్‌ను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదు
- పుంగనూరులో కూటమి ప్రభుత్వంపై ఎంపీ మిథున్‌రెడ్డి ధ్వజం





**మన ప్రజావాణి పుంగనూరు:** వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని రాజంపేట ఎంపీ పి.వి. మిథున్‌రెడ్డి హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా పుంగనూరులో పర్యటించిన ఆయన కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.తనను ఇబ్బందులకు గురిచేసినా తాను భరిస్తానని, అయితే అమాయకులపై ప్రతాపం చూపడం తన విధానం కాదని అన్నారు. "అది నా మంచితనం.. మంచితనానికి, చేతకానితనానికి చాలా తేడా ఉంటుంది" అంటూ వ్యాఖ్యానించారు.తన క్యాడర్‌ను ఇబ్బంది పెడితే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదని మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తై ఉదయం ఏడు గంటలకు డిక్లరేషన్ చేతికి వచ్చిన వెంటనే శాస్తి జరుగుతుందని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.'నా ఎన్నిక కంటే మీ కోసం గట్టిగా కష్టపడతా' తన రాజకీయ భవిష్యత్తు కంటే నియోజకవర్గ ప్రజల కోసం మరింత గట్టిగా పనిచేస్తానని మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. పుంగనూరు అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

నీరు పారుతున్నా.. పుంగనూరుకు మాత్రం కరువు

కూటమి ప్రభుత్వం పుంగనూరు నియోజక వర్గాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని ఎంపీ ఆరోపించారు. "నీరిచ్చే దిక్కులేదు.. రోడ్లు వేసే దిక్కులేదు" అంటూ ప్రభుత్వం పై మండిపడ్డారు.పుంగనూరు పక్కనే నీరు ప్రవహిస్తున్న ప్పటికీ పోలీసులను అడ్డుపెట్టుకుని పక్క నియోజకవర్గాలకు నీటిని తరలిస్తున్నారని ఆరోపించారు. పుంగనూరు ప్రజల అవసరాలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎంపీ మిథున్‌రెడ్డి వ్యాఖ్యలతో పుంగనూరు నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

# కేసీఆర్ హయాంలో క్షణం పోని కరెంట్.. కాంగ్రెస్ పాలనలో గంటల తరబడి కోతలపై ప్రజల ఆగ్రహం



**రాయికల్, సెప్టెంబర్ 23 (ప్రజావాణి):** రాయికల్ పట్టణం, మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా అంతరాయంపై ప్రజల్లో తీవ్ర చర్చ, ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణలో 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఉండేదని, ఒక్క క్షణం కూడా కరెంట్ పోయేది కాదని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. అలాంటిది ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం రిపేర్ల పేరుతో ఉదయం నుండి సాయంత్రం వరకు గంటల తరబడి కరెంట్ నిలిపివేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గత కొన్ని రోజులుగా రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, కొన్ని చోట్ల సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు.దీంతో ఎండ వేడిమికి చిన్నారులు, వృద్ధులు, గృహిణులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్రిజ్ లు, ఫ్యాన్లు, మోటార్లు పనిచేయకపోవడంతో హోటళ్లు, బట్టల దుకాణాలు, వెల్డింగ్, జిరాక్స్ సెంటర్ల వంటి చిరు వ్యాపారాలు స్తంభించి వ్యాపారులు నష్టపోతున్నారు. యాసంగి సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో పగటిపూట కరెంట్ లేక వ్యవసాయ మోటార్లు నడవక రైతులు పంట పొలాలకు నీరు పెట్టలేక ఆందోళన చెందుతున్నారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల చదువులకు కూడా ఆటంకం కలుగుతోంది.రిపేర్లు చేయాల్సి వస్త విడతల వారీగా చేయకుండా ఒకేసారి గంటల కొద్దీ కరెంట్ తీసివేయడం వల్ల సామాన్యుల జీవనం అస్తవ్యస్తమవుతోందని, విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చి, ఇబ్బంది లేకుండా మరమ్మతులు చేపట్టాలని, కరెంట్ కోతలపై పునరాలోచించాలని ప్రజలు కోరుతున్నారు.

# గణపయ్య కు ఇక సెలవు

- భక్తసందడి కీ వీడుకోలు ఘన నిమజ్జన శోభ!
- నవరాత్రులు ముగించుకుని కన్నీటి వీడ్కోలు పలికిన భక్తజనం




**ఓదెల:** వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక సందడితో ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న విఘ్నేశ్వరుడు నిమజ్జనానికి తరలివెళ్లడంతో పలు గ్రామాల్లో భక్తులు భావోద్వేగానికి లోనయ్యారు. గణనాథుని విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, మేళతాళాలు, డప్పు చప్పుళ్లు, భక్తుల నినాదాల మధ్య నిమజ్జనానికి తరలించారు.నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు, అన్నప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించి గణనాథుని సేవలో భక్తులు తరించారు. చివరి రోజున పెద్ద సంఖ్యలో భక్తులు మండపాల వద్దకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా" అంటూ భక్తులు నినదిస్తూ గణనాథుడికి వీడ్కోలు పలికారు. చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. భక్తుల సందడితో ప్రధాన వీధులు పండుగ వాతావరణాన్ని తలపించాయి.నవరాత్రులంతా తమను ఆశీర్వదించిన గణనాథుడు తిరిగి తమ ఇళ్లలోకి సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి, ఐశ్వర్యాన్ని తీసుకురావాలని భక్తులు ప్రార్థించారు. భక్తి, సామరస్యం, ఆనందోత్సాహాల మధ్య గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

# 16 ఏళ్ల సేవకు ఫలితం.. కుమారికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

- కుమారి విద్యాసేవలకు గ్రామస్తుల అభినందనలు



**ప్రజావాణి ?బయ్యారం సెప్టెంబర్ 23:** ఇటీవల బయ్యారం మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న బి.కుమారిని బుధవారం జగ్గుతండా పిఎస్ పాఠశాలలో గ్రామ సర్పంచ్ బోల్లి జయంతి వెంకట కృష్ణ, హెచ్ఎం పద్మావతి, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గత 16 ఏళ్లుగా విద్యాబోధనలో అంకితభావంతో పనిచేస్తూ,ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన కుమారి గారి సేవలను కొనియాడారు.బయ్యారం మండలంలో సుదీర్ఘకాలం సేవలందించి తల్లిదండ్రులు,అధికారుల మన్ననలు పొందిన ఆమెకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం అభినందనీయమన్నారు.?ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చెన్నాయపల్లి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**చిన్నశంకరంపేట,సెప్టెంబర్23, మన ప్రజావాణి:** ఆదిదేవుడు విఘ్నేశ్వరుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని చెన్నాయపల్లి గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా బుధవారం చిన్నశంకరంపేట పరిధిలోని చెన్నాయపల్లి గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువుదీరిన విఘ్నేశ్వరుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ సందర్భంగా, వినాయక చవితి ఉత్సవాలు భక్తిభావంతో పాటు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.ప్రతి ఒక్కరూ గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.ప్రజలందరూ గణనాథుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

# అధికారులు, ప్రజాప్రతినిధులకు గణేష్ కమిటీ ఘన సత్కారం



**ప్రజావాణి బయ్యారం సెప్టెంబర్ 23.** బయ్యారం మండల కేంద్రంలోని శివాలయంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి హాజరైన మండల అధికారులను,ప్రజాప్రతినిధులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.సన్మానం పొందిన వారిలో బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్,బయ్యారం సీఐ రవీందర్,తహసీల్దార్ నాగరాజు,ఎస్ఐ ప్రశాంత్ బాబు,ఆర్ఐ సందీప్, ఉన్నారు.నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా,సజావుగా సాగేలా సహకరిస్తున్న అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవకమిటీ ప్రతినిధులు,భక్తులు,గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో గణనాథుడికి ఘన వీడ్కోలు

- కార్లలో ఊరేగింపు.. ఉత్సాహంగా లడ్డూ వేలం
- రూ.30 వేలకు శ్రీరామ్ కాలనీ యూనిటీ దక్కించుకున్న తొలి లడ్డూ



**సెప్టెంబర్ 23 (ప్రజావాణి):** నారాయణఖేడ్ నియోజకవర్గం లోని కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ గ్రామం శ్రీరామ్ కాలనీలో ప్రతిష్ఠించిన గణనాథుడికి భక్తులు భక్తిశ్రద్ధలతో ఘన వీడ్కోలు పలికారు. నిమజ్జన కార్యక్రమంలో భాగంగా వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించిన కార్లలో ఊరేగింపుగా తరలించారు. 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో కాలనీ పరిసరాలు మార్మోగాయి.కాలనీ వాసులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా నిమజ్జన ఊరేగింపును నిర్వహించారు. అనంతరం భక్తులకు పులిహోర ప్రసాదాన్ని అందజేశారు.తదుపరి నిర్వహించిన గణపతి లడ్డూ వేలం పాట ఆసక్తికరంగా సాగింది. లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడగా, శ్రీరామ్ కాలనీ యూనిటీ రూ.30 వేలతో తొలి లడ్డూను కైవసం చేసుకుంది. అలాగే పలువురు భక్తులు లడ్డూలు, శాలువాలు, దండలను వేలం పాటలో పోటీ పడి దక్కించుకున్నారు.గణనాథుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని భక్తులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీరామ్ కాలనీ వాసులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కష్టకాలంలో రైతు కుటుంబాలకు అండగా నిలవాలి.

- కరువుపై ప్రభుత్వం కనీసం ప్రకటన చేయకపోవడం దారుణం.
- ఎన్ని ఎకరాల్లో ఏ పంటలు సాగు చేశారో.. ఎంత నష్టం జరిగిందో ప్రభుత్వానికి తెలియదా?
- తుంగభద్ర డ్యాంలో నీళ్లున్నా పీఏబీఆర్ కుడికాలువకు నీళ్ల ఎందుకు ఇవ్వడం లేదు?
- పేరూరు డ్యాంకు నీళ్లిస్తే వందలాది ఎకరాల పంటలను కాపాడొచ్చు..
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మూడేళ్లు పేరూరు డ్యాంకు నీళ్లిచ్చాం.
- నేడు రైతుల ప రిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది.
- తీవ్ర కరువుతో వలసలు.. ఎండిపోతున్న పంటలు.. అడుగంటుతున్న భూగర్భజలాలు.
- వేలాది బోర్లు ఎండిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.
- హంద్రీనీవా కా లువకు లైనింగ్‌తో రైతులకు ఇబ్బందులు.
- జెండాలు, అజెం డాలు పక్కనపెట్టి రైతుల కోసం ఒక్కటవుదాం.
- రైతులకు అండ గా పోరాటం కొనసాగిస్తాం..
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి




**అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 23 ప్రజా వాణి** రైతాంగాన్ని కాపాడుకునేందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా 'రైతు పార్టీ'గా ఏకం కావాల్సిన అవసరం ఉందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. అనంతపురం టవర్‌క్లాక్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న కరువుదీక్షలకు బుధవారం ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ప్రజా సమస్యలపై సీపీఐ చేపట్టే ప్రతి ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. అందరికీ ఏకైక శత్రువు కరువేనని, అన్నంపెట్టే రైతులకు ఆపద వచ్చిందన్నారు. పార్టీలకు అతీతంగా రైతులు ఏకం కావాలని, కష్టకాలంలో రైతు కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. పార్టీలు, ఇతర భేషజాలకు పోయి రైతులను ఏకాకి చేయొద్దని విజ్ఞప్తి చేశారు.ఎన్ని ఎకరాల్లో ఏయే పంటలు సాగు చేశారు, కరువు ప్రభావంతో రైతులు ఏ మేరకు నష్టపోయారన్న వివరాలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు డ్యాష్‌బోర్డు ముందు ఉన్నప్పటికీ కరువుపై కనీసం ప్రకటన చేయడం లేదని ప్రకాష్ రెడ్డి విమర్శించారు. తుంగభద్ర డ్యాంలో నీళ్లున్నా పీ.ఏ.బీ.ఆర్ కుడికాలువకు నీళ్ల ఇవ్వడం లేదన్నారు. పేరూరు డ్యాంకు నీళ్ల ఇవ్వాలని అనేక వేదికలపై వైఎస్సార్‌సీపీ గళం విప్పుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నీరు లేక డ్యాం కింద వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వరుసగా మూడేళ్లు పేరూరు డ్యాంకు నీళ్ల ఇచ్చామని, దీంతో అనంతపురం నగరం వరకు భూగర్భజలాలు పెరిగి వందలాది గ్రామాల్లో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు.జెడ్పీ సమావేశంలో ఎంపీ పార్థసారథి కాలువ పూర్తయిన తర్వాత పేరూరు డ్యాంకు నీళ్లిస్తామని చెబుతున్నారని, మరోవైపు చంద్రబాబు అసెంబ్లీలో 2028 నాటికి కాలువ పనులు పూర్తి చేస్తామని చెబుతున్నారని తెలిపారు. పదేళ్లలో కేవలం 30 శాతం పనులు చేసి, రానున్న 15 నెలల్లో మిగిలిన 70 శాతం పనులు పూర్తి చేస్తామంటే రైతులు నమ్మాలా? అని ప్రశ్నించారు.మడకశిర బ్రాంచ్ కాలువ నుంచి తురకాలపట్నం వద్ద నీళ్లు వదిలితే పెన్నా నది కాలువ ద్వారా పేరూరు డ్యాంకు నీళ్లు చేరుతాయని చెప్పారు. ప్రభుత్వం నుంచి రూపాయి తీసుకోకుండా దాదాపు 60 కిలోమీటర్ల కాలువ తవ్వి, మూడేళ్ల పాటు పేరూరు డ్యాంను నింపామని తెలిపారు.ప్రస్తుతం తీవ్ర కరువుతో ప్రజలు వలసలు వెళ్తున్నారని, పంటలు ఎండిపోతున్నాయని, చెట్లు కొట్టేస్తున్నారని, వేలాది బోర్లు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా కాలువకు లైనింగ్ వేసి రైతుల నోట్లో దుమ్ము కొట్టారని విమర్శించారు. ముఖ్యంగా హిందూపురం పార్లమెంట్ పరిధిలో లక్షల ఎకరాలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు.శ్రీశైలంలో 70 రోజుల పాటు నీరిచ్చేంత నీటి నిల్వలు ఉన్నప్పటికీ రైతును బతికించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.సీఎం జిల్లాకు రావడం లేదని, మంత్రి నారా లోకేష్ విగ్రహావిష్కరణలు చేసి నాలుగు మాటలు చెప్పి వెళ్లారని, కరువు, రైతు, నీళ్ల గురించి మాట్లాడలేదని ప్రకాష్ రెడ్డి విమర్శించారు. ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లోకి వెళు_న్న తమపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. 26 నెలల్లో తనపైనా, తన సోదరులపైనా 22 కేసులు పెట్టారని తెలిపారు. కేసులకు తాము భయపడబోమని, ప్రజల కోసం పోరాడేందుకు ముందుంటామని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి ప్రజల్లోకి వెళ్తే ఎంతమందిపై కేసులు పెడతారని ప్రశ్నించారు.జెండాలు, అజెండాలు పక్కన పెట్టి రైతుల కోసం ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. ఇది ప్రభుత్వ స్పాన్సర్డ్ కరువని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఏడాది క్రితమే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రైతులకు అండగా పోరాడతామని స్పష్టం చేశారు.

# చిత్తూరు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

- పలమనేరు తహసీల్దార్ కార్యాలయంలో రైతు సంఘం వినతి



**పలమనేరు, సెప్టెంబరు** చిత్తూరు జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి రైతులకు కరువు సహాయాన్ని అందించాలని ఏఐకేఎంఎస్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమాపతి నాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు బుధవారం పలమనేరు తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి డీటీ శివజ్యోతికి రైతు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడుతూ ఎల్‌నీనో ప్రభావంతో జిల్లాలో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిని రైతులు అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలను పరిశీలించి కరువు పరిస్థితులను ప్రకటించి తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. పశుగ్రాస కేంద్రాలు, పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేయడంతోపాటు హంద్రీ--నీవా నీటిని చెరువులు, కుంటలకు మళ్లించాలని డిమాండ్ చేశారు. రైతుల పంట రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని, కరువు ప్రభావిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సబ్సిడీపై అందించాలని కోరారు.

కౌండిన్యా నదిపై చెక్‌డ్యామ్‌లు, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, ఇసుక--మట్టి తవ్వకాలను నిలిపివేయాలని అన్నారు. ఉద్యాన పంటలకు నష్టపరిహారం పెంచి, మామిడి, కొబ్బరి తదితర పంటలకు బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు జ2౦50 శాతం ఆధారంగా మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు.ఏనుగుల బెడద నివారణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతోపాటు పంట నష్టపరిహారాన్ని పెంచాలని, అసైన్డ్ భూములను సాగుదారుల పేర్లపై పట్టా భూములుగా మార్చి భద్రత కల్పించాలని, వర్షాధార భూములకు ఉచిత బోర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో రైతు సంఘం కోశాధికారి వాసు, సుబ్రమణ్యం రెడ్డి, రవీంద్రారెడ్డి, హరి, లక్ష్మీపతి నాయుడు, వాసుదేవరెడ్డి, మురుగేష్ నాయుడు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ శాఖల పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..




**అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 23 మన ప్రజా వాణి** ఆయా ఇంజనీరింగ్ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టి సకాలంలో గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఆర్.అండ్.బి, పంచాయతీ రాజ్, ఆర్.డబ్ల్యు.ఎస్, ఇతర ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఇంజనీరింగ్ సెక్టార్ పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న అన్ని రకాల ఇంజనీరింగ్ పనులు ఏ దశలో ఉన్నాయి, ఎంత పని పూర్తి అయ్యింది ఆరా తీసి, ఆయా పనులను వేగవంతంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయలని ఆదేశించారు. ఆర్.అండ్.బి పరిధిలో చేపట్టిన రహదారులు, బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సాస్కి, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన -3, నాబార్డు కింద కింద చేపట్టిన పనులను కేటాయించిన లక్ష్యం మేరకు గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఎంపీ నిధుల కింద మంజూరైన పనులలో పురోగతి చూపించకపోతే పీఆర్ ఈఈపై చార్జెస్ ఫ్రేమ్ చేస్తామన్నారు. ఆర్డబ్ల్యూఎస్ పరిధిలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్‌లో మంజూరైన అన్ని కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సెస్ యూనిట్లను ఈనెల ఆఖరి నాటికి పూర్తి చేయాలని, దేవాలయాలలో పురోగతిలో ఉన్న పనులను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని టాయిలెట్లు మరియు తాగునీటి సౌకర్యాల పనులను ఈనెల 30 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా ప్రారంభంకాని ఎంపీ నిధుల పనులన్నింటినీ వచ్చే వారంలోగా ప్రారంభించాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ఎఫ్ హెచ్ టి సి లక్ష్యమైన 20,633 కనెక్షన్ల పనులను వచ్చే మార్చి నెల నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపిఎస్ఎంఐడిసి,హెచ్ఎన్ఎస్ఎస్, ఏపిఈడబ్ల్యుఐడిసి, హెచ్ఎల్సి, ఇతర ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. టైం లైన్ ప్రకారం అన్ని పనులను ఆయా శాఖల అధికారులు పూర్తి చేయడంపై క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, పిఆర్ ఎస్ఈ సుబ్బరాయుడు, సీపీఓ బాలాజీ నాయక్, మైన్స్ ఎడి ఆదినారాయణ,హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ ఎస్ఈ ఉమామహేశ్వర రావు, ఆయా ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తుఫాన్ కారణంగా కేదారి పురము గెడ్డ ప్రాంతాన్ని.పరిశీలించిన అధికారులు

**పలాస ప్రజావాణి ప్రతినిధి** పలాస మున్సిపాలిటీ పరిధి రూరల్ ప్రాంతాల్లో భారీ వర్షాలు మరియు వరదల నేపథ్యంలో అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు . కేదారి పురము,వరహాల గెడ్డ కు భారీ స్థాయిలో వరద నీరు చేరడం వల్ల ప్రజలను అప్రమత్తము చేశారు. అధికార యంత్రాంగం అప్రమత్తమై, లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేశారు..వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన అధికారుల్లో కాశీబుగ్గ డీఎస్పీ భవానీ, తహసీల్దార్ శ్రీదేవి, మండల ప్రత్యేక అధికారి మట్ట రవికుమార్, పలాస ఎంపిడివో వసంత కుమార్, ఇతర అధికారులు ఉన్నారు..




# శ్రీకాకుళం జిల్లా టెక్కలి వద్ద ఘోర రైలు ప్రమాదం

- నలుగురు అక్కడికక్కడే మృతి, ఒకరకి తీవ్ర గాయాలు తో ఆసుపత్రి లో చేర్చారు.
- ఇన్ ఛార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర మంత్రి అచ్చెన్న నాయుడులు దిగ్భ్రాంతి నీ వ్యక్తం చేశారు.
- బాదిత కుటుంబాలకు న్యాయము చేసేందుకు కృషి చేస్తాము









**పలాస ప్రజావాణి ప్రతినిధి** శ్రీకాకుళం జిల్లా టెక్కలి వద్ద ఘోర రైలు ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం జిల్లాలో పెను విషాదం చోటుచేసుకుంది. టెక్కలి మండలం రావి వలస జంక్షన్ – బర్మా కాలనీ సమీపంలో వేగంగా దూసుకొచ్చిన రాజ్యరాణి ఎక్స్ప్రెస్ రైలు బుధవారం ఢీకొట్టడంతో నలుగురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఐదుగురు ఇంటర్ విద్యార్థులు టెక్కలి నుంచి నౌపడ వైపు ట్రాక్ పై నడుచుకుని వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో అదే మార్గం లో అత్యంత వేగంగా దూసుకొచ్చిన రాజ్యరాణి ఎక్స్ప్రెస్ వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశాఖరావు, దిలీప్ కుమార్, శివ, శరత్ అక్కడికక్కడే మృతిచెందగా, సాల్మన్ రాజుకి తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారితో పాటు గాయపడిన వ్యక్తిని సమీపంలోని దమర ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. గాయపడిన యువకుడిని స్థానికులు, పోలీసులు హుటాహుటిన సమీప టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు.

సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు, స్థానిక పోలీసు యంత్రాంగం ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృత దేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు యువకులు మృతి చెందడంతో దమర, రావివలస ప్రాంతాల్లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పి, ఆర్డీవో: సమాచారం అందిన వెంటనే జిల్లా ఎస్పీ టెక్కలి ఆర్డిఓ కృష్ణమూర్తి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

విద్యార్థుల మృతికి బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలి:

టెక్కలి మండలం బర్మా కాలనీ సమీపంలో జరిగిన రైలు ఘోర ప్రమాదం అత్యంత బాధాకరమని అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగులపల్లి మదన్ కుమార్ అన్నారు. ఈ విద్యార్థులకు సెలవు సమాచారం అందించడంలో టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల యాజమాన్యం విఫలమైందని ఆయన ఆరోపించారు. సరైన సమాచారం లేక కళాశాలకు వచ్చిన విద్యార్థులు సెలవు ఉందని తెలుసుకుని ఇంటికి వెళ్లకుండా రైలు పట్టాల పై వెళ్లడంతో ప్రమాదం జరిగిందని అన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన కళాశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రమాదంపై మంత్రి అచ్చెన్న తీవ్ర దిగ్భ్రాంతి :

రావివలస వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నౌపడ నుంచి గుణుపూర్ వెళ్తున్న రాజ్యరాణి ఎక్స్ ప్రెస్ ఢీకొని నలుగురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే మంత్రి అచ్చెన్నాయుడు జిల్లా రెవెన్యూ, పోలీసు, రైల్వే ఉన్న తాధికారులతో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. మరణించిన నలుగురి కుటుంబాలకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుల వివరాలను సేకరించి వారి కుటుంబ సభ్యులకు తక్షణ సమాచారం అందించాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అధికారులు బాధితులకు అవసరమైన తోడ్పాటు అందించాలని సూచించారు. ప్రమాదంలో తీవ్రం గా గాయపడిన మరో వ్యక్తికి మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రైల్వే లైన్ వెంట ప్రజలు రాకపోకలు సాగించే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని రైల్వే, పోలీసు అధికారులకు సూచించారు. రైల్వే ట్రాక్ లను దాటే సమయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రమాదంపై ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరా తీసారు

టెక్కలి మండలం రావివలస దగ్గర జరిగిన రైలు ప్రమాదం పై జిల్లా ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంఘటనా స్థలానికి రెవెన్యూ పోలీసు యంత్రాన్ని చేరుకొని సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు..

# ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అవకాశం

**చిత్తూరు, సెప్టెంబర్ 23 (ప్రజావాణి):** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని ఎస్వీ జూనియర్ కళాశాల (చిత్తూరు) కోఆర్డినేటర్ అనంత కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను మధ్యలోనే నిలిపివేసిన వారికి తిరిగి విద్యను కొనసాగించేందుకు ఏపీ ఓపెన్ స్కూల్ మంచి అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ముఖ్యంగా బాలికలు, యువతీ యువకులు, ఉద్యోగాలు, ఇతర పనులు చేసుకుంటున్న మహిళలు, పురుషులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. 2026--27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో హెచ్ఈసీ, ఎంపీసీ, బైపీసీ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియట్ విద్యను ఒక సంవత్సరంలో పూర్తి చేసుకునే వెసులుబాటు కూడా ఉందని తెలిపారు. ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా జారీ చేసే పాస్ సర్టిఫికెట్‌తో ఉన్నత విద్యను కొనసాగించడంతో పాటు ఉద్యోగ అవకాశాలకు కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు గుర్తింపు, అనుమతి ఉన్నట్లు అనంత కుమార్ తెలిపారు. అడ్మిషన్లకు గడువు సమీపిస్తున్నందున ఆసక్తి ఉన్న విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9177696071 నంబర్‌ను సంప్రదించి ఏపీ ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

# రన్నర్స్ డయేరియా అంటే ఏమిటి.. ఇది ఎందుకు వస్తుంది.. ఏం చేయాలి..?



తీవ్రమైన వ్యాయామం లేదా పరుగు సమయంలో అకస్మాత్తుగా మల విసర్జనకు వెళ్లాలనే తొందర, కడుపులో నొప్పి, విరేచనాలు వంటి సమస్యలు కొందరు క్రీడాకారుల్లో కనిపిస్తాయి. ఇటీవల బీజింగ్‌లో జరిగిన హైరోక్స్ పోటీలో ఆస్ట్రేలియాకు చెందిన క్రీడాకారిణి జొవానా వియెట్జిక్‌కు పరుగు మధ్యలో మల నియంత్రణ కోల్పోయినట్లు వార్తలు రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఆమె ఆ తర్వాత కూడా కొంతసేపు పోటీలో కొనసాగినట్లు సమాచారం. ఈ ఘటనతో ఇతర క్రీడాకారులు, ప్రేక్షకుల ఆరోగ్యం, పోటీ ప్రాంగణంలో పరిశుభ్రత వంటి అంశాలపై ప్రశ్నలు తలెత్తాయి. వ్యాయామం సమయంలో వచ్చే జీర్ణవ్యవస్థ సమస్యలు అంటువ్యాధి కారణంగా మాత్రమే వస్తాయని భావించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. రన్నర్స్ డయేరియా అంటే..పరుగు సమయంలో వచ్చే విరేచనాలు, కడుపు మంట లేదా మల విసర్జనకు తీవ్రమైన తొందరను రన్నర్స్ డయేరియాగా పిలుస్తారు. ఎక్కువసేపు లేదా అధిక తీవ్రతతో వ్యాయామం చేయడం, శరీరంలో నీరు తగ్గిపోవడం, వేడి, ఆందోళన, వ్యాయామానికి ముందు తీసుకునే కొన్ని ఆహారాలు, పానీయాలు ఇందుకు కారణం అవుతాయి. తీవ్రమైన వ్యాయామ సమయంలో శరీరం పనిచేస్తున్న కండరాలు, గుండె, ఊపిరితిత్తులకు ఎక్కువ రక్తాన్ని సరఫరా చేస్తుంది. దీంతో జీర్ణవ్యవస్థకు వెళ్లే రక్తప్రసరణ తాత్కాలికంగా తగ్గుతుంది. పరుగు సమయంలో శరీరానికి పదేపదే కలిగే కుదుపులు, వ్యాయామ తీవ్రతలో ఆకస్మిక మార్పులు కూడా పేగుల కదలికలను పెంచి మల విసర్జనకు తొందర కలిగిస్తాయి. అయితే వ్యాయామం తర్వాత వచ్చే ప్రతి విరేచనాన్ని కేవలం వ్యాయామం వల్లేనని భావించకూడదు.

పరిశుభ్రత సమస్యలు వచ్చే చాన్స్..

పెద్ద స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో అనేక మంది ఒకే ప్రాంగణం, వ్యాయామ పరికరాలు, నీటి కేంద్రాలు, ఇతర సౌకర్యాలను ఉపయోగిస్తారు. మల పదార్థం సామూహికంగా ఉపయోగించే ప్రదేశంలో పడితే పరిశుభ్రత సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అయితే వ్యాయామం వల్ల వచ్చే మల విసర్జన సమస్యకు, అంటువ్యాధి వల్ల వచ్చే విరేచనాలకు తేడా ఉంది. కలుషితమైన ఆహారం లేదా నీరు, సరైన చేతుల పరిశుభ్రత పాటించకపోవడం వల్ల కూడా విరేచనాలు, వాంతులు వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల పోటీల్లో ఆహారం, నీటిని జాగ్రత్తగా ఎంచుకోవడం, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, ఇతరులతో సీసాలు లేదా ఆహార పరికరాలను పంచుకోకపోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్త..వ్యాయామ సమయంలో అప్పుడప్పుడు మల విసర్జనకు తొందర కలగడం తీవ్రమైన సమస్యకు సంకేతం కాదు. కానీ పదేపదే మల నియంత్రణ కోల్పోవడం, వ్యాయామం చేయకపోయినా ఇలాంటి సమస్య రావడం, మలంలో రక్తం కనిపించడం, నిరంతర విరేచనాలు, తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు, అధిక జ్వరం, తల తిరగడం, నీరు తగ్గిపోయే లక్షణాలు లేదా బరువు తగ్గడం వంటి సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. పోటీల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు క్రీడాకారుల ఆరోగ్య పరిస్థితితోపాటు ఇతరుల భద్రత, పరిశుభ్రతను కూడా నిర్వాహకులు పరిగణనలోకి తీసుకోవాలి. కాబట్టి క్రీడాకారులు పోటీకి ముందు కొత్త ఆహారం లేదా పానీయాలను ప్రయత్నించకుండా, శిక్షణ సమయంలో తమ శరీరానికి సరిపడే ఆహారాన్ని గుర్తుంచుకోవడం, తగినంత నీరు తీసుకోవడం, జీర్ణవ్యవస్థకు సంబంధించిన హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకపోవడం మంచిది.

# మట్టి గణపయ్యకు ఘనంగా వీడ్కోలు!

- తొమ్మిది రోజుల పూజల అనంతరం అక్కడే నిమజ్జనం..





**బీరంగూడ, సెప్టెంబర్ 23 (ప్రజావాణి):** మట్టి వినాయకుడి నిమజ్జనంతో ప్రకృతికి భారాన్ని మిగల్చకుండా ఆదర్శంగా నిలిచారు! బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో అమీన్‌పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడికి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తుల సమక్షంలో మట్టి గణపయ్యను అక్కడే నిమజ్జనం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు.

పర్యావరణహిత గణపయ్యకు ప్రాధాన్యం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాల స్థానంలో సహజంగా కలిసిపోయే మట్టి వినాయకులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. మట్టి విగ్రహాలను వినియోగించడం, సాధ్యమైన చోట పర్యావరణహిత పద్ధతుల్లోనే నిమజ్జనం చేయడం ద్వారా నీటి వనరులు, ప్రకృతిని కాలుష్యం నుంచి కాపాడుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

భక్తితో పాటు బాధ్యత కూడా..

ఈ సందర్భంగా ఈర్ల రాజు మాట్లాడుతూ "మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. పండుగ ఆనందంతో పాటు ప్రకృతి పరిరక్షణను కూడా సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. వినాయకుడి నిమజ్జనం ప్రకృతికి భారంగా కాకుండా.. ప్రకృతిలోనే కలిసిపోయేలా ఉండాలని సూచించారు.

ప్రతి ఇంటా మట్టి గణపయ్య..

పర్యావరణహిత గణేష్ ఉత్సవాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి యువజన సంఘం మట్టి విగ్రహాలను ప్రోత్సహిస్తే పర్యావరణ పరిరక్షణకు మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. భక్తి, సంప్రదాయంతో పాటు ప్రకృతిని కాపాడే బాధ్యతను కూడా భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు.

తొమ్మిది రోజుల పూజలకు ముగింపు పలుకుతూ మట్టి వినాయకుడిని అక్కడే నిమజ్జనం చేయడంతో స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# జుట్టు నిస్తేజంగా కనిపిస్తుందా.. అనేక జుట్టు సమస్యలకు నీళ్లే కారణమా..?



జుట్టు మెరుపు తగ్గడానికి షాంపూ, కాలుష్యం, హెయిర్ డ్రైయర్ లేదా ఇతర వేడి పరికరాలనే చాలామంది కారణాలుగా భావిస్తారు. అయితే ప్రతిరోజూ జుట్టును నల్లా నీటితో కడగడం కూడా జుట్టు నాణ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా నీటిలో కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ఇలాంటి నీటిని హార్డ్ వాటర్‌గా పిలుస్తారు. నీటిలోని ఖనిజాలు జుట్టు తంతువులపై పేరుకుపోవడం వల్ల జుట్టు క్రమంగా మెరుపును, మృదుత్వాన్ని కోల్పోయి పొడిబారినట్లు, గరుకుగా కనిపించే అవకాశం ఉంటుంది. హార్డ్ వాటర్‌తో కడిగితే..హార్డ్ వాటర్‌తో జుట్టును పదేపదే కడగడం వల్ల జుట్టు తంతువులపై ఖనిజాల పొర పేరుకుపోయే అవకాశం ఉంటుంది. ఫలితంగా జుట్టు నిస్తేజంగా మారడంతోపాటు దాని పరిమాణం తగ్గినట్లు కనిపిస్తుంది. జుట్టు పొడిబారడం, చిక్కులు పడటం, ఎక్కువగా ఫ్రిజ్జీగా మారడం, జుట్టు తెగిపోవడం వంటి సమస్యలు కూడా కనిపిస్తాయి. అలాగే షాంపూ సరిగా నురుగు రాకపోవడం కూడా నీటి నాణ్యతకు సంబంధించిన సంకేతంగా ఉంటుంది. రంగు వేసిన జుట్టు, పొడిబారిన జుట్టు లేదా వంకర జుట్టు ఉన్నవారిలో ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది.

రోజూ తలస్నానం చేస్తే..రోజూ జుట్టు కడగడం వల్లనే సమస్య వస్తుందని చెప్పలేమని, జుట్టు రకం, నీటి నాణ్యత వంటి అంశాలపై ప్రభావం ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే హార్డ్ వాటర్‌కు నిరంతరం గురికావడం వల్ల జుట్టు విరిగిపోవడం, నాణ్యత తగ్గడం, కొంతమందిలో జుట్టు రాలడం పెరిగే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. సాధారణంగా రోజుకు సుమారు 100 వెంట్రుకలు రాలడం సహజమే అయినప్పటికీ, నీటి నాణ్యతతోపాటు ఇతర కారణాలు కూడా జుట్టు రాలడాన్ని ప్రభావితం చేసే వీలు ఉంది.

జాగ్రత్తలు అవసరం..జుట్టును హార్డ్ వాటర్ ప్రభావం నుంచి కాపాడుకోవడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైనప్పుడు క్లారిఫైయింగ్ షాంపూను ఉపయోగించడం, బాత్‌రూమ్‌లో షవర్ ఫిల్టర్ ఏర్పాటు చేసుకోవడం, జుట్టుకు క్రమం తప్పకుండా డీప్ కండిషనింగ్ చేయడం వంటి చర్యలు ఉపయోగపడతాయి. వీలైతే జుట్టు కడగడానికి ఫిల్టర్ చేసిన నీటిని ఉపయోగించడం కూడా ఒక మార్గం. ఈ జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ జుట్టు విపరీతంగా పొడిబారడం, నిస్తేజంగా మారడం లేదా అధికంగా రాలడం కొనసాగితే చర్మవ్యాధి నిపుణుడిని సంప్రదించడం మంచిది.

# జీపీఆర్ ప్లాట్ల బాధితులకు న్యాయం చేయాలి!

- ఏళ్లుగా డబ్బులు చెల్లించినా ప్లాట్లు దక్కలేదు..
- తెరవెనుక రాజకీయ హస్తం ఉందంటున్న బాధితులు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా..
- రికార్డులు, భూమి వివరాలపై సమగ్ర విచారణకు డిమాండ్



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 23 (ప్రజావాణి):** ప్లాట్ల కోసం ఏళ్ల తరబడి డబ్బులు చెల్లించి ఎదురుచూస్తున్నా.. తమకు న్యాయం జరగడం లేదంటూ జీపీఆర్ హౌసింగ్ సొసైటీ బాధితులు ఆందోళనకు దిగారు. తమ సమస్యలను పరిష్కరించి ప్లాట్లను తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ పటాన్చెరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జీపీఆర్ హౌసింగ్ సొసైటీలో ప్లాట్లు కొనుగోలు చేసిన సభ్యుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపించారు. తమకు తెలియకుండానే ప్లాట్ల విషయంలో కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని, దీని వెనుక రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తుల హస్తం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ జరగాల్సి ఉంది. సమస్య పరిష్కారం కోసం అధికారులను పలుమార్లు కలిసినా స్పష్టమైన సమాధానం లభించలేదని బాధితులు తెలిపారు. అధికారులు కాలయాపన చేయడం వల్లే కార్యాలయం ఎదుట ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు. తమ కష్టార్జిత డబ్బును ప్లాట్ల కోసం పెట్టుబడిగా పెట్టామని, ప్రస్తుతం వాటిపై హక్కు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీపీఆర్ హౌసింగ్ సొసైటీకి సంబంధించిన రికార్డులు, భూమి వివరాలు, ప్లాట్ల యాజమాన్య హక్కులు, గత లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని బాధితులు జిల్లా ఉన్నతాధికారులను కోరారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని, అవసరమైతే ఉన్నతాధికారులను ఆశ్రయించి చట్టపరమైన మార్గాల్లోనూ పోరాడుతామని స్పష్టం చేశారు.

గురువారం, సెప్టెంబర్ 24, 2026

ప్రజావాణి

19

# వెండికొండ మీరాబాయి

## వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతం సొంతం

## బ్యాడ్మింటన్‌లో మెన్స్ జట్టుకు కాంస్యం

## 2026 ఆసియా క్రీడలు

ఓ ఒలింపిక్ పతకం, ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో మూడు మెడల్స్. కామన్‌వెల్త్ క్రీడల్లో మరో మూడు పతకాలు. ఆసియా చాంపియన్‌షిప్స్‌లోనూ ఓ మెడల్. ప్రతిష్టాత్మక క్రీడా ఈవెంట్లలో అన్నింటా పోడియం ఫినిష్ చేసినా, అయినా ఏదో వెలితి. అదే ఆసియా క్రీడల్లో మెడల్. 2026లో ఆ లోటును తీర్చుకుంది దిగ్గజ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను. ఆసియా క్రీడల్లో మహిళల 49 కేజీల విభాగంలో మీరాబాయి చాను రజత పతకం సాధించింది.ఆసియా క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టింగ్ పతక నిరీక్షణకు తెరపడింది. 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో తెలుగు తేజం కరణం మల్లీశ్వరి మహిళల 63 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించగా.. సరిగ్గా 28 ఏండ్ల తర్వాత ఆసియా క్రీడల్లో మరో భారత వెయిట్‌లిఫ్టర్ వెండి కాంతులతో వెలుగొందింది. ఇటు భారత్‌తో పాటు మీరాబాయి చానుకు సైతం ఆసియా క్రీడల్లో పతక వెలితి వేధించింది. 2014 ఆసియా క్రీడల్లో తొలిసారి పోటీపడిన మీరాబాయి చాను తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2018 జకర్తా ఆసియా క్రీడలకు గాయంతో దూరమైంది. 2023 గాంగ్జౌ ఆసియా క్రీడల్లో నాల్గో స్థానంతో పతకానికి అడుగు దూరంలో ఆగిపోయింది. టోక్యో ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్‌తో శిఖర స్థాయికి చేరుకున్న మీరాబాయి చాను.. ఆసియా క్రీడల్లో పసిడి ఫేవరేట్‌గా బరిలోకి దిగింది. 49కేజీల మహిళల విభాగంలో స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కేజీలు ఎత్తింది. ఓవరాల్‌గా 198 కేజీలతో మీరాబాయి చాను రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. దక్షిణ కొరియా వెయిట్‌లిఫ్టర్, డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్ రి సంగ్ గమ్ 215 కేజీలతో (94o121) బంగారు పతకం నిలుపుకుంది. ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా వెయిట్‌లిఫ్టర్‌కు ఇది వరుసగా మూడో బంగారు పతకం. ఇండోనేషియా వెయిట్‌లిఫ్టర్ లులుక్ డయానా 191 కేజీలు (88o103) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకుంది. స్నాచ్‌లో మీరాబాయి చాను 83 కేజీలు, 85 కేజీలు, 87కేజీలు ఎటువంటి తడబాటు లేకుండా అలవోకగా ఎత్తిపడేసింది. క్లీన్ అండ్ జెర్క్‌లో తొలుత 107 కేజీలు ఎత్తిన మీరాబాయి చాను ఆ తర్వాత 111 కేజీలతో మెరుగైంది. కానీ ఆ తర్వాత మూడో ప్రయత్నం చేయలేదు. 'కొంత ఒత్తిడి ఉండేది. కానీ పతకం నెగ్గుతానా లేదా అనేంత ఒత్తిడి కాదు. మెడల్ సాధిస్తాననే నమ్మకం నాకుంది. నన్ను నమ్మేవాళ్లకు నాపై అంచనాలు ఉన్నాయి. నా కోచ్‌లు, సహాయక సిబ్బంది నేను దేశానికి మరో మెడల్ సాధించేందుకు సహకరించారు'అని మీరాబాయి చాను తెలిపింది. మహిళల 53 కేజీల విభాగంలో పోటీపడిన జ్ఞానేశ్వరి యాదవ్ 195 కేజీలు (87o108)తో ఎనిమిదో స్థానంలో నిలిచింది. **బ్యాడ్మింటన్‌లో కాంస్యం** పురుషుల బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో భారత్ కాంస్య పతకం సాధించింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో అగ్రజట్టు చైనా చేతిలో భారత్ 1-3తో పరాజయం పాలైంది. తొలి సింగిల్స్‌లో లక్ష్యసేన్ 16-21, 18-21తో షి యుకి చేతిలో ఓడాడు. డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 21-11, 22-2-తో లియాంగ్, చాంగ్‌లపై గెలుపొంది లెక్క సమం చేశారు. రెండో సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి 19-21, 13-21తో షి ఫెంగ్ చేతిలో కంగుతిన్నాడు. రెండో డబుల్స్‌లో హరిహరణ్, ఎంఆర్ అర్జున్ జోడీ 16-21, 9-21తో నిరాశపరిచారు. దీంతో చైనా 3-1తో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో ఓటమితో భారత్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది.వుషూలో భారత్ కనీసం సిల్వర్ మెడల్ ఖాయం చేసుకుంది. మహిళల వుషూ 60 కేజీల విభాగంలో రోషిబినా దేవి పసిడి పోరుకు చేరుకుంది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఇండోనేషియా అమ్మాయి తానియాపై 2-0తో రోషిబినా దేవి గెలుపొందింది. నేడు ఫైనల్లో పసిడి పతకం కోసం చైనా అమ్మాయి జాంగ్‌తో రోషిబినా దేవి పోటీపడనుంది.



**షూటింగ్‌లో డబుల్ ధమాకా** షూటింగ్‌లో భారత్ బుధవారం డబుల్ ధమాకా మోగించింది. స్కీట్ టీమ్ విభాగంలో భారత పురుష, మహిళల జట్లు కాంస్య పతకం సాధించాయి. మహేశ్వరి చౌహాన్, పరినాజ్ దాలివాల్, రైజా ధిల్లాన్‌లతో కూడిన మహిళల జట్టు 331 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. చైనా (357), కజకిస్తాన్ (336) గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించాయి. అనంత్‌జిత్ సింగ్, మేరాజ్ అహ్మద్ ఖాన్, భవతేజ్ సింగ్ గిల్‌తో కూడిన మెన్స్ జట్టు 346 పాయింట్లతో కాంస్య పతకం సాధించింది. స్టార్ షూటర్ మను భాకర్ మహిళల 10మీ ఎయిర్ పిస్టల్ విభాగంలో ఐదో స్థానంలో నిలిచి నిరాశపరిచింది. 10మీ ఎయిర్ పిస్టల్ జట్టు విభాగంలో ఇషా సింగ్, సురుచి సింగ్, మను భాకర్ త్రయం వియత్నాంతో కలిసి 1719 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచినా.. మెరుగైన ఇన్నర్ 10 స్కోరింగ్‌తో వియత్నాం కాంస్య పతకం దక్కించుకుంది. **సాఫ్ట్‌టెన్నిస్‌లో మెడల్ ఖాయం** ఆసియా క్రీడల్లో భారత్ తొలిసారి సాఫ్ట్ టెన్నిస్‌లో పతకం ఖాతాలో వేసుకోనుంది. పురుషుల వ్యక్తిగత సాఫ్ట్‌టెన్నిస్‌లో జే మీనా సెమీఫైనల్‌కు ప్రవేశించాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో షెర్విన్ నుగియట్‌పై ఏడు గేముల థ్రిల్లర్‌లో గెలుపొందాడు. 0-4, 4-2, 2-4, 4-2, 5-3, 2-4, 7-5తో జే మీనా విజయం సాధించి సెమీస్‌కు చేరుకున్నాడు. జే మీనా సెమీస్‌లో అడుగుపెట్టి కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకున్నాడు.



# సాఫ్ట్ టెన్నిస్‌లో కాంస్య పతకం

హైదరాబాద్: ఆసియా క్రీడల సాఫ్ట్ టెన్నిస్ విభాగంలో భారతదేశం చారిత్రక ఘనత సాధించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల క్రీడాకారుడు జయ్ మీనా కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఆసియా గేమ్స్ చరిత్రలోనే ఈ క్రీడలో భారత్‌కు పతకం దక్కడం ఇదే తొలిసారి.బుధవారం నాటి సెమీఫైనల్ పోరులో జపాన్‌కు చెందిన టకుయా కురోసాకాతో జయ్ మీనా తలపడ్డాడు. 45 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ ప్రారంభంలో జయ్ వరుసగా మూడు గేమ్‌లు ఓడిపోయి ఒత్తిడిలో పడ్డాడు. ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుని వరుసగా రెండు గేమ్‌లను (4-1, 6-4) తన ఖాతాలో వేసుకుని మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు.



# ఆసియా క్రీడల్లో భారత్‌కు డబుల్ పతకాలు

ఆసియా క్రీడల్లో భారత పతకాల వేట కొనసాగుతోంది. బుధవారం రెండు ఈవెంట్లలో మెడల్స్ దక్కాయి. స్కీట్ టీమ్ విభాగంలో భారత మహిళ, పురుష జట్లు కాంస్యం దక్కించుకున్నాయి. అటు భారత స్టార్ షూటర్ మను బాకర్ నిరాశకు గురిచేసింది. మహిళల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రైజా దిల్లాన్, మహేశ్వరి చౌహన్, పరినాజ్ ధలీవాల్.. 331 స్కోరుతో మూడో స్థానంలో నిలిచారు. దీంతో కాంస్యం దక్కింది. ఈ ఈవెంట్‌లో చైనా బృందానికి బంగారు పతకం రాగా.. కజకిస్థాన్ టీమ్ రజతం గెలిచింది.ఇక, పురుషుల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్ నరుకా, భవతేగ్ సింగ్ గిల్, మైరాజ్ అహ్మద్ ఖాన్.. 346 స్కోరుతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించారు. మరోవైపు, వ్యక్తిగత విభాగంలో అనంత్‌జీత్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఒలింపిక్‌లో డబుల్ మెడల్స్‌తో ఆకట్టుకున్న మనుబాకర్‌కు.. ఆసియా గేమ్స్‌లో నిరాశ ఎదురైంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కొద్దిలో ఆమె పతకం చేజార్చుకుంది. ఫైనల్ పోరులో 181.1 స్కోరుతో మను ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్ల బృందం కాంస్యాన్ని త్రుటిలో మిస్ అయ్యింది. అటు సాఫ్ట్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు జై మీనాకు కాంస్యం దక్కింది. సెమీస్‌లో జపాన్ క్రీడాకారుడి చేతిలో జై 2-4తో ఓటమిపాలయ్యాడు.

# కుర్రాళ్లు కుమ్మేశారు.. ఆసీస్‌తో సిరీస్ క్లీన్ స్వీప్



రాజ్‌కోట్: ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన మూడు అనధికారిక వన్డేల సిరీస్‌ని భారత అండర్-19 జట్టు 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో అనధికారిక వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ నామమాత్రపు మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 254 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ జెడ్ హోలిక్(87), నీల్ పటేల్(51) అర్ధ శతకాలతో రాణించారు. భారత బౌలర్లలో మోహిత్ ఉల్వ, మోనల్ చౌహన్ తలో మూడు వికెట్లు తీయగా.. ఆర్యన్ సవసాని, కావ్య పటేల్ చెరో వికెట్ పడగొట్టారు.అనంతరం లక్ష్య చేధనకు దిగిన భారత్‌కు మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ శుభారంభం అందించాడు. 31 బంతులు ఎదురుకున్న అతడు 5 ఫోర్ల సాయంతో 34 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. అనంతరం కెప్టెన్ లక్ష్య రాయ్‌చందన్ ఆసీస్ బౌలర్లను టార్గెట్ చేశాడు. ఆచితూచి ఆడుతూ.. 100 బంతుల్లో సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. 106 బంతులు ఎదురుకున్న అతడు 9 ఫోర్లు, 3 సిక్సులతో 110 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరితో పాటు కుశాగ్ర ఓఝా(45), రజత్ బఘేల్ (44 నాటౌట్) రాణించారు. ఫలితంగా భారత్ 4 వికెట్లు కోల్పోయి 41.2 బంతుల్లో లక్ష్యాన్ని చేధించింది. ఆసీస్ బౌలర్లలో స్పెన్సర్ గ్రీన్ రెండు వికెట్లు సాధించాడు.

# కెప్టెన్ శతకం వృథా.. రెండో వన్డేలో ఆసీస్ చేతిలో భారత్ ఓటమి

మొహాలీ: మూడు అనధికారిక వన్డేలు, మూడు అనధికారిక టి-20లు, ఒక అనధికారిక టెస్ట్ ఆడేందుకు ఆస్ట్రేలియా మహిళల ఎ జట్టు భారత్‌కు వచ్చింది. ఇందులో భాగంగా టి-20 సిరీస్‌ను కంగారూ జట్టు 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. అయితే ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. అయితే మొహాలీ వేదికగా జరిగిన రెండో వన్డేలో భారత్‌కు పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 338 పరుగుల భారీ స్కోర్‌ను సాధించింది. కెప్టెన్ యస్తికా భాటియా సెంచరీతో చెలరేగింది. 84 బంతుల్లోనే 16 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 112 పరుగులు చేసింది. ఇక తేజల్ హసాబ్నిస్ (60), అనుష్క శర్మ (60 నాటౌట్) అర్ధ శతకాలు సాధించారు. ఆసీస్ బౌలింగ్‌లో డార్సీ బ్రౌన్ మూడు వికెట్లు, మిల్లీ ఇల్లింగ్‌వర్త్ రెండు వికెట్లు, లల్లీ మిల్స్ ఒక వికెట్ తీశారు.అనంతరం లక్ష్య చేధనలో ఆసీస్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ నికోలి ఫాల్తుమ్(12)ను సయాలీ సత్గరే తక్కువ స్కోర్‌కే పెవిలియన్ పంపింది. కానీ ఆ తర్వాత మరో ఓపెనర్ తాహిలా విల్సన్ (79), అనికా లిరాయిడ్ (54) హాఫ్ సెంచరీలు చేశారు. ఇక చార్లి నాట్ 37 బంతుల్లోనే 63 పరుగులతో అదరగొట్టింది. హేలీ సిల్వర్ హోమ్స్ (47), టెస్ ఫ్లింటాఫ్ (38) పరుగులతో రాణించారు. అయితే భారత బౌలర్లు విజయం సాధించడానికి ఆఖరి వరకూ పోరాడారు. కానీ, విజయం మాత్రం ఆసీస్‌ని వరించింది. 49.3 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయిన ఆసీస్ 341 పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఫలితంగా ఈ సిరీస్‌ని 1-1 తేడాతో సమం చేసింది. మూడో వన్డే శుక్రవారం మొహాలీ వేదికగా జరగనుంది.



# కూచిపూడితో మెప్పించిన డింపుల్ హయాతి..

## తిరుమలలో ప్రత్యేక ప్రదర్శన!



టాలీవుడ్ అందాల భామ డింపుల్ హయాతి తిరుమలలోని నాద నీరాజనం వేదికపై అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి భక్తులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎరుపు, గోల్డ్ కలర్ సిల్క్ చీర కట్టి, సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో ఆమె ప్రదర్శించిన కూచిపూడి నాట్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది.ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఆ విశేషాలు చూద్దాం.. శ్రీవారి బ్రహ్మోత్సవాల పవిత్ర సమయంలో డింపుల్ హయాతి నాద నీరాజనం వేదికపై కూచిపూడి నాట్యం చేయడం విశేషం. సంప్రదాయబద్ధమైన నృత్య భంగిమలు, చక్కటి ముఖకవళికలతో ఆమె చేసిన ప్రదర్శన భక్తులకు కనులవిందుగా నిలిచింది. ఇక నృత్య ప్రదర్శనకు ముందు రోజు ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. నెటిజన్ల ఆశ్చర్యం, ప్రశంసలు : ఇన్నాళ్లూ సినిమాల్లో గ్లామరస్ పాత్రల్లో అలరించిన డింపుల్ హయాతిలో ఈ స్థాయి సంప్రదాయ నాట్య ప్రతిభ కూడా ఉందా అని నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఆమె డ్యాన్స్ వీడియోలు చూసిన అభిమానులు "డింపుల్ గారు చాలా అందంగా, అద్భుతంగా నాట్యం చేశారు" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.సినిమా కెరీర్ మరియు క్రేజ్: తెలుగు, తమిళ సినిమాల్లో నటించి మంచి నటిగా పేరు తెచ్చుకున్న డింపుల్, వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' చిత్రంలో 'జర్రా జర్రా' స్పెషల్ సాంగ్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఆ తర్వాత ఖిలాడి, రామబాణం, అత్రంగి రే, వీరమే వాగై సూడుమ్, భర్త మహాశయులకు విజ్ఞప్తి వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు దగ్గరైంది. 'ఆదర్శ కుటుంబం'తో త్వరలో ముందుకు: ప్రస్తుతం సరైన సినిమా బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న డింపుల్ హయాతి, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నట్టు టాక్. ఈ భారీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం అక్టోబర్ 9న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమాతో ఆమెకు పెద్ద హిట్ అందుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.ఇక అంతేగాక శర్వానంద్ 38వ సినిమా సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో ఓ పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.వెండితెరపై తన గ్లామర్, నటనతో ఆకట్టుకునే డింపుల్ హయాతి, తిరుమలలో ప్రదర్శించిన కూచిపూడి నాట్యంతో తనలోని సంప్రదాయ కళాత్మక కోణాన్ని ఆవిష్కరించారు. భక్తిభావంతో ఆమె చేసిన ఈ ప్రదర్శన ప్రతి ఒక్కరి మనసులను దోచుకోవడమే కాకుండా, ఆమె కెరీర్‌కు మరింత సానుకూలతను తీసుకువస్తుందనడంలో సందేహం లేదు.

# ఇక మైత్రీ థియేటర్లలో 'సర్వపిండి'..

## సినిమా చూస్తూ కమ్మని రుచి.. 'ది ప్యారడైజ్'తో ఎంట్రీ!




ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ 'మైత్రీ' తమ థియేటర్ల ద్వారా ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. సినిమా అనుభూతికి తెలంగాణ సంస్కృతిని, అచ్చమైన పల్లె రుచులను జోడిస్తూ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇకపై తమ థియేటర్లలో తెలంగాణ సంప్రదాయ వంటకమైన 'సర్వపిండి'ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది.
తొలి దశలో భాగంగా మైత్రీ విమల్, మైత్రీ శివగంగ థియేటర్లలో ఈ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' ప్రదర్శన సమయంలో విరామంలో ప్రేక్షకులు ఈ కమ్మని సర్వపిండిని ఆస్వాదించవచ్చు. సినిమా చూస్తూనే, తెలంగాణ ప్రత్యేక వంటకాన్ని రుచి చూసే ఈ కొత్త అనుభవం సినీ ప్రియులను ఆకట్టుకుంటుందని సంస్థ భావిస్తోంది.ఈ సరికొత్త ఆలోచన వెనుక సోషల్ మీడియాలో ప్రజాదరణ పొందిన 'బామ్మాస్టోరిస్'కు చెందిన 77 ఏళ్ల బామ్మ కృషి ఉంది. ఓ చిన్న టిఫిన్ సెంటర్‌లో ఆమె ప్రేమతో తయారు చేసే సర్వపిండి, ఇప్పుడు ఏకంగా బిగ్ స్క్రీన్ ప్రేక్షకులకు చేరువ కావడం విశేషం. వెండితెరపై దృశ్యాలను ఆస్వాదిస్తూనే, తెలంగాణ అసలైన రుచిని అందించాలన్న మైత్రీ థియేటర్స్ ప్రయత్నంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# పుష్ప సినిమాలో ఆ పాత్ర నేను చేయాల్సింది.. కానీ!: శివాజీ



టాలీవుడ్ నటుడు శివాజీ 'తెల్ల కాగితం' సినిమా ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ... ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన దిగ్గజ చిత్రం 'పుష్ప'కు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 'పుష్ప' చిత్రంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ప్రతి నాయక ఛాయలున్న 'మంగళం శ్రీను' పాత్ర మొదట తనకే రావలసి ఉందని శివాజీ తెలిపారు.ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... "మంగళం శ్రీను పాత్రకు మొదట సుకుమార్ నన్నే అనుకున్నారు. కానీ ఒక పాత్ర ఎవరికి రాసి ఉంటే చివరికి వాళ్లకే దక్కుతుంది. నాకు రాసి లేని పాత్రను నేనెలా చేయగలను? ఆ పాత్ర సునీల్‌కే రాసి పెట్టి ఉంది, అందుకే ఆయన వద్దకు వెళ్లింది. సునీల్ ఆ పాత్రలో అద్భుతంగా జీవించారు, ఎవరు ఏ పాత్ర చేసినా చివరికి అది వాళ్లకే సరిపోతుంది" అని వ్యాఖ్యానించారు.'తెల్ల కాగితం' విశేషాలను ఆయన పంచుకుంటూ... సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇచ్చే సమయంలో తాను విన్న రెండో కథ ఇదేనని, కథ బాగా నచ్చడంతో ఈ చిత్రాన్ని తానే నిర్మించాలని అనుకున్నట్లు తెలిపారు. అయితే ఈ కథ పలువురు నిర్మాతల చేతులు మారి, చివరకు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు, కృష్ణ కొమ్మలపాటి సంయుక్త నిర్మాణంలో తెరకెక్కి తన వద్దకే రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పాటు, గ్రాఫిక్స్ కు ప్రాధాన్యత ఉన్న 'కూర్మావతారం' అనే చిత్రంలోనూ తాను నటిస్తున్నట్లు శివాజీ వెల్లడించారు.

# 'ప్యారడైజ్'లో నాని 'జడల్' పాత్రకు స్ఫూర్తి ఈ ఫొటోనే!



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన తాజా యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. ఈ చిత్రం రేపు (సెప్టెంబరు 24) విడుదల కానున్న నేపథ్యంలో, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాలోని కీలకమైన 'జడల్' పాత్రకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఈ పాత్రకు, ముఖ్యంగా నాని జడల లుక్‌కు తన చిన్ననాటి జ్ఞాపకాలే స్ఫూర్తి అని ఆయన వెల్లడించారు.
ఈ సందర్భంగా శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియాలో తన చిన్ననాటి ఫొటోను పంచుకుంటూ ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "జడల్ పుట్టుక, యుద్ధం కల్పితం కావచ్చు... కానీ అతని జడలు, లుక్ నా చిన్నప్పటి స్ఫూర్తితో వచ్చినవే. అమ్మ నాకు 5, 6 ఏళ్ల వయసు వరకు జడలు వేసి కట్టేవారు. నేను పెద్దయ్యాక, కమర్షియల్ సినిమాలో ఒక హీరో జడలతో 70వీవీ స్క్రీన్‌పై ఎలా ఉంటాడా అని ఎప్పుడూ ఊహించుకునేవాడిని. ఇప్పుడు నా హీరో నాని అన్నను జడల్‌గా మీ ముందు ఉంచుతున్నాను. ఈ చిత్రం కేవలం నా చిన్నతనం కాదు, నా ప్యారడైజ్" అని ఆయన పేర్కొన్నారు.
శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన లుక్ ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు పంచుకున్న ఈ వ్యక్తిగత విషయం



# తెలుగు ఇండస్ట్రీని చూసి కన్నీళ్లొచ్చాయి : 'ది ప్యారడైజ్' నటుడు రాఘవ్ జుయల్

ప్రముఖ డ్యాన్సర్, నటుడు రాఘవ్ జుయల్.. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ, ఇక్కడి పని సంస్కృతిపై ప్రశంసల వర్షం కురిపించారు. తెలుగు పరిశ్రమలో సినిమాను ఒక వేడుకలా జరుపుకునే విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు, సినిమా నిర్మాణం పట్ల ఇక్కడి వారికి ఉన్న అభిరుచి, గౌరవాన్ని దగ్గర నుంచి చూశానని రాఘవ్ తెలిపారు.
ఆయన మాట్లాడుతూ.. "ఇక్కడ సినిమాను, సినిమా వాళ్లను ఎంతగా గౌరవిస్తారో చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ప్రతి ఒక్క టెక్నీషియన్‌కు ఎంతో గౌరవం ఇస్తారు. సౌండ్ ఇంజనీర్‌ను కూడా ప్రేక్షకులు గుర్తుపట్టడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇక్కడ వారు కేవలం పని పూర్తి చేయడానికి రారు, సినిమాను సెలబ్రేట్ చేసుకోవడానికి వస్తారు. ఈ విషయాన్ని నేను నేర్చుకున్నాను" అని భావోద్వేగంగా చెప్పారు. తనపై దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రభావం ఎంతో ఉందని కూడా రాఘవ్ చెప్పుకొచ్చారు.ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో పుట్టి పెరిగిన రాఘవ్, 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ 3' రియాలిటీ షోతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 'క్రాక్‌రాక్స్' అనే స్టేజ్ పేరుతో తన స్లో-మోషన్ డ్యాన్సింగ్ స్టైల్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తర్వాత 'డ్యాన్స్ ప్లస్' వంటి అనేక విజయవంతమైన టీవీ షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు.

# నంది అవార్డుల కోసం దరఖాస్తు విధానం- మార్గదర్శకాలు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ - నాటకరంగ అభివృద్ధి సంస్థ (విజయవాడ) 2025 సంవత్సరానికి సంబంధించిన -చలనచిత్ర నంది బహుమతులు - 2025- , ౨౨ నంది బహుమతులు - 2025- కోసం అధికారిక ప్రకటనను విడుదల చేసింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమను, టెలివిజన్ రంగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఈ పురస్కారాలను అందజేస్తోంది. అర్హులైన నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణుల నుండి దరఖాస్తులను సంస్థ ఆహ్వానించింది. చలనచిత్ర విభాగంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంది చలనచిత్ర నిబంధనలను అనుసరించి 2025 సంవత్సరానికి ఉత్తమ ఫిల్మ్ నిర్మాతలు, ఉత్తమ కళాకారులు.. ఉత్తమ సాంకేతిక నిపుణులకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు. తెలుగు భాషలో భారతదేశంలో ఎక్కడైనా నిర్మించి.. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ -సీబీఎఫ్‌సీ ద్వారా థియేటర్లలో ప్రదర్శించిన చిత్రాలు, జాతీయ సమైక్యతపై చిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, విద్యాసంబంధమైన చిత్రాలు అలాగే తెలుగు సినిమా మీద వచ్చిన పుస్తక రచనలు, రచయితలు, నిర్మాతలు దరఖాస్తు




చేసుకోవడానికి అర్హులు.
ఇక టెలివిజన్ రంగానికి సంబంధించి 2025 సంవత్సరానికి నంది టి.వి. చిత్ర నిబంధనల ప్రకారం ఉత్తమ టి.వి. చిత్ర నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణులను సత్కరించనున్నారు. టెలిఫిల్మ్, టి.వి. ఫీచర్స్, టి.వి. మెగాసీరియల్స్, డైలీ సీరియల్స్, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, సామాజిక అంశాలు, విద్య సంబంధిత చిత్రాల రూపకర్తలు ఈ బహుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవార్డులకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు.. ఇతర వివరాలను సంస్థ అధికారిక వెబ్‌సైట్ **www.apsftvdc.in** ద్వారా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను



పొందుపరుచుటకు చివరి తేదీగా 12.10.2026ను నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తుల ప్రింట్ ప్రతులను సంబంధిత డాక్యుమెంట్లతో జతపరిచి నిర్దేశిత గడువులోగా అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల హార్డ్ కాపీలను -మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ, 4వ అంతస్తు, ఎన్.టి.ఆర్. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, పండిత్ నెహ్రూ బస్ కాంప్లెక్స్, విజయవాడ - 520013- చిరునామాకు పంపడానికి చివరి తేదీ 16.10.2026గా ఖరారు చేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఐ.ఏ.ఎస్., తెలిపారు. కళాకారులు - నిర్మాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com